ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 454

వెల : రూ.25/-

జనవరి 2023




జనసాహితి ప్రచురణ

## ఫిలిప్పీన్స్ గెరిల్లా పోరాటనేత, కవి, రచయిత

# జోస్ మరియా సిజన్ మరణం

**ఫిలిప్పీన్స్‌లో** మావోయిస్టు కమ్యూనిస్టుపార్టీ నిర్మాత, గెరిల్లా పోరాట నిపుణుడు, కవి, రచయిత జోస్ మరియా సిజన్ ప్రవాసంలో వున్న నెదర్లాండ్స్‌లో 16-12-2022న తన 83వ యేట మరణించారు. ఆయన 8-2-1939న భూస్వామి కుటుంబంలో జన్మించారు.

ఆయన 1952లో ప్రాథమిక విద్య, 1956లో హైస్కూలు విద్య ముగించి, 1959లో ఇంగ్లీషు సాహిత్యంలో ఆనర్స్ డిగ్రీ ఫిలిప్పైన్ విశ్వవిద్యాలయం నుంచి పొందారు. విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కమ్యూనిస్టుపార్టీలో 1962లో చేరి 1963లో దాని కార్యవర్గసభ్యుడయ్యారు. జాతీయతాభావాన్ని ప్రచారం చేసే ఉద్యమానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ 1964లో దేశభక్త యువత అనే సంస్థ సంస్థాపక సభ్యులలో ఒకరిగా వున్నారు. ఈ సంస్థ వియత్నాం యుద్ధానికి, నియంత మార్కోస్‌కు, సామ్రాజ్యవాదానికి, బ్యూరోక్రటిక్ పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్యవిధానానికి వ్యతిరేకంగా యువతను సమీకరించింది. ఆ పోరాటంలో మావో ఆలోచనా విధానం అధ్యయనం చేయడం ఒక భాగం.

1942లో స్థాపింపబడిన కమ్యూనిస్టుపార్టీ మాస్కోకు అనుకూలంగా పనిచేస్తుండగా, సిజన్ తప్పులు దిద్దుకునే ఉద్యమం ప్రారంభించి, పార్టీ చేసిన తప్పులు, పొందిన అపజయాలు విమర్శించి, 1968 డిసెంబరు 26న కొత్తగా మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానాన్ని సమర్థిస్తూ ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. దాని కేంద్రకమిటీకి నాయకునిగా పనిచేశారు. మార్చి 1969లో నూతన ప్రజాసైన్యం (New Peoples' Army - NPA)ను 60 మంది పోరాటయోధులతో, 9 ఆటోమేటిక్ రైఫిల్స్‌తో, 26 సింగిల్ షాట్ రైఫిల్స్, పిస్టల్స్ తమ ఆయుధాలుగా ప్రారంభించారు. ఆ తర్వాత ఈ సైన్యం సంఖ్య 25 వేలకు పెరిగింది. ఇది దేశవ్యాప్తంగా గెరిల్లా పోరాటాలు చేసింది.

సిజన్ 1977లో అరెస్టయ్యారు. ఆ తర్వాత 9 ఏళ్ళకు అధికారంలోకి వచ్చిన ఎక్వినో ప్రభుత్వం 1986లో ఆయన్ను విడుదల చేసింది. ఒంటరి నిర్బంధకాండ అనుభవించిన కాలంలో ఆయన కవిత్వం రాసి తనను కలుసుకోడానికి వచ్చే లాయర్లు, బంధువులు, మిత్రుల ద్వారా బయటకు పంపేవారు. వాటిని 'ప్రిజన్ అండ్ బియాండ్' పేరుతో ప్రచురించారు. ఆ సంపుటిలో ఒక గేయం 'గెరిల్లా కూడా కవి లాంటివాడే' ప్రసిద్ధ గేయం. వివిధ దేశాలలో పర్యటించి, ఫిలిప్పైన్స్‌లో తమ పార్టీకి సంఘీభావాన్ని కోరుతూ ఉపన్యాసాలు ఇచ్చే కార్యక్రమంలో 1986 సెప్టెంబరులో ప్రారంభించి, ఆయన నెదర్‌లాండ్స్‌లో వుండగా, ఫిలిప్పైన్ ప్రభుత్వం 1988లో ఆయన పాస్‌పోర్టును రద్దుచేసింది. దానితో ఆయన మరణించే వరకూ ఆ దేశంలోనే ప్రవాస జీవితం గడపాల్సి వచ్చింది.

రాజకీయాలకు సంబంధించి ఆయన రాసిన వ్యాసాలు 28 సంపుటాలుగా ప్రచురించారు. సాయుధ పోరాటంలో భాగంగా ప్రజల భాషల్లో రాసిన కవితలు, పాటలు, కథలు, నాటికలు, నవలలతో సాంస్కృతికరంగంలో వీరి పార్టీ కృషిచేసింది. నిర్బంధానికి లోనైనా అజ్ఞాతంగా కృషి కొనసాగించింది. ప్రజాసమూహాలలో ఆందోళనల సందర్భంగా వివిధ కళారూపాలను ఉపయోగించారు. సాహిత్య సాంస్కృతికరంగాలకు సంబంధించి సిజన్ విలువైన వ్యాసాలు రాశారు. నియంతకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలలో ఈ నిరసన సాహిత్యం ప్రధానపాత్ర వహించింది.

## సాంత్వన ఇచ్చే కవిత్వం

ఆంగ్లం : జోస్ మరియా సిజన్ | తెలుగు : కొత్తపల్లి రవిబాబు

చాలాకాలం నుండీ
పూజలూ, ప్రార్థనలు
బాధిత ప్రజలకు -

నేను రాత్రిళ్ళు వెల్లకిలా పడుకొని
గొంతు తడారిపోయేంతవరకు
నా కవితలు బిగ్గరగా ఆలపించి
సుఖంగా నిద్రపోతాను

నా కవితలు తేడాగా వుంటాయి
అవి ప్రజలకు ప్రేమపాత్రులు
వారిపైనా, వారి పోరాట పటిమపైనా

నాకు దృఢవిశ్వాసం
విశ్రాంతి సమయంలో కూడా
పోరాటం కొనసాగుతుంటుంది
విశ్రాంతి అనంతరం
నేను చేయగలిగినదంతా చేస్తాను

ఒంటరి నిర్బంధ శిక్ష
విషతుల్యమైన చిత్రహింస
కాని నేను కూర్చే నా కవితలు
నాకు నిజమైన సహచరులు

- 'ప్రిజన్ అండ్ బియాండ్' నుండి

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

454

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 46
సంచిక : 6
జనవరి 2023

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | జాతీయ విద్యావిధానం పర్యవసానం కార్టూన్ – అంతర్జాలం నుండి | | 01 |
| ✦ రెండవ అట్ట | : | జోస్ మరియా సిజన్ – కవిత 'సాంత్వన ఇచ్చే కవిత్వం' | | 02 |
| ✦ మూడవ అట్ట | : | పద కామ్రేడ్ పద – సాంబమూర్తి లండ; రంగువెలసిన చిత్రం – శీలా సుభద్రాదేవి | | 43 |
| ✦ నాల్గవ అట్ట | : | కె.పి. శశి కార్టూన్‌లు – అంతర్జాలం నుండి | | 44 |
| ✦ సంపాదకీయం | : | జాతీయ విద్యావిధానం – సాంస్కృతిక పర్యవసానం! | | 05 |
| ✦ కథ | : | యాది | – వారాల కృష్ణమూర్తి | 07 |
| ✦ వ్యాసాలు | : | మోడీస్వామ్యంలో ఎన్నికల సంస్కృతి | – దివికుమార్ | 11 |
| | : | అరుదైన కథకుడు వారాల కృష్ణమూర్తి | – శీలా సుభద్రాదేవి | 18 |
| | : | మతము | – త్రిపురనేని రామస్వామి | 22 |
| | : | పాతికేళ్ళు నిండిన అప్పుల భారత ప్రపంచీకరణ | – వారాల కృష్ణమూర్తి | 36 |
| ✦ సినిమా సమీక్ష | : | చీకట్లోంచి కటిక చీకట్లోకి 'కాంతార' | – డి.ఆర్.ఇంద్ర | 20 |
| | : | 28వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవ విశేషాలు | – బాలాజీ (కోల్‌కతా) | 26 |
| ✦ ధారావాహికలు | : | వ్యాసం – దేశ విభజన వస్తువుగా సాహిత్యం (5) | | |
| | | ఖుర్రతులైన్ హైదర్ రచనలు –1 | – కొత్తపల్లి రవిబాబు | 30 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | బలరాజ్ సాహ్నీ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | 25 |
| ✦ పుస్తక పరిచయం | : | 'నన్ను నడిపించిన చరిత్ర' – వకుళాభరణం రామకృష్ణ స్వీయగాథ | – కొత్తపల్లి రవిబాబు | 15 |
| ✦ కవితలు | : | ఈతకోట సుబ్బారావు, సహచరి (**34**); డాక్టర్ కత్తి పద్మారావు (**39**); | | |
| ✦ వివిధ | : | శాశ్వతనిధి ప్రకటన, కృతజ్ఞతలు (**04**); కుందుర్తి శతజయంతి ముగింపు (**24**); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**29**); సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**35**); చైతన్యవాహిని (**40**); ఈ పుస్తకాలు అందాయి (**41**); కార్టూన్‌లు – అంతర్జాలం నుండి | | |
| ✦ సంతాపాలు | : | జగ్గారపు సుబ్బారావు (**04**); వారాల కృష్ణమూర్తి (**17**); రామకోటేశ్ (**19**); జైనీ మల్లయ్య గుప్తా (**21**); రాజేశ్వరి (**23**); కాకర్ల నాగేశ్వరరావు, కె.పి. శశి (**33**); చావా శివకోటి (**38**); రావూరి అర్జునరావు (**40**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** **ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ఫ్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X
LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# విజ్ఞప్తి

'ప్రజాసాహితి' శ్రేయోభిలాషులు వారి వారి ఆప్తుల స్మారకార్థం శాశ్వతనిధిగా విరాళాలు అందజేస్తున్నారు. మొదట్లో ఆ ఆప్తుల వర్ధంతిని 10 ఏళ్ళపాటు పత్రికాముఖంగా వారి ఫొటోలు వేసి జ్ఞాపకం చేసుకుంటూ వచ్చాము.

పదేళ్ళపాటు ప్రచురించే శీర్షికను కరోనా కాలం నుండి మానివేశాము. శ్రేయోభిలాషులు అర్థం చేసుకుంటారని భావిస్తున్నాము. జనవరి 2023 నుండీ ఎవరి జ్ఞాపకార్థం విరాళాలు ఇస్తారో వారి గురించి ఫొటోతో వివరాలు ఆ విరాళం ఇచ్చిన నెలలో మాత్రమే ప్రచురించాలని కూడా నిర్ణయించాము.

ఆర్థికంగా పత్రిక ఎదుర్కొంటున్న పరిస్థితిని గుర్తించి, మేము ఈ విషయమై తీసుకున్న నిర్ణయాన్ని సహృదయంతో అంగీకరించగలరు.

– సంపాదకవర్గం

# కృతజ్ఞతలు

**ఈ సంచిక ప్రచురణకు త్రిపురనేని రామస్వామిగారి నాల్గవ అన్న త్రిపురనేని సుబ్రహ్మణ్యకవి (అంగలూరు) మనవడు, విశ్రాంత బోటనీ అధ్యాపకులు పొట్లూరి పూర్ణేందుమౌళి ఆర్థిక సహాయం అందించారు.**

## ప్రజాసాహిత్య ప్రచారకుడు, ప్రజాతంత్రవాది
# జగ్గారపు సుబ్బారావుకు జోహార్లు



ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం కన్వీనర్, ఏఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు జగ్గారపు సుబ్బారావు అనారోగ్యంతో 17-12-2022న మంగళగిరిలో మరణించారు. ఆయన గుంటూరుజిల్లా భట్టిప్రోలులో జన్మించారు.

జగ్గారపు సుబ్బారావు వివాహానంతరం మంగళగిరి వలస వచ్చారు. ఆనాటినుండి సామ్యవాద భావాలకు ఆకర్షితులై ప్రజల పక్షాన నిలబడుతూ ఆ, ఆ సంఘాలలో చివరికంటా కృషిచేశారు. మంగళగిరి రత్నాల చెరువు ప్రాంతంలో శ్రామికనగర్ నిర్మించుకోవటంలో బాధ్యత వహించారు. ఆ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికై మున్సిపల్ సమావేశాలలో ప్రజాసమస్యలపై గళమెత్తారు. చేనేత కార్మికుల సమస్యల మీద నిర్విరామ కృషిచేశారు. 'ప్రజాసాహితి' వివిధవర్గాల ప్రజల మధ్యకు తీసుకువెళ్ళటంలో చొరవ చూపారు. ప్రజాసాహిత్యాన్ని తన చేతిసంచిలో పెట్టుకుని అందరికీ ఏ శషభిషలూ లేకుండా పరిచయం చేసేవారు. ఆ ప్రాంతపు కార్యకర్తలందరినీ ఆదరించేవారు. తను కడు పేదరికంలో వున్నా చాలా ఔన్నత్యంతో ఆదరించేవారు.

శ్రామికవర్గ సాహిత్యాభిమాని, శ్రామికవర్గ నాయకుడు జగ్గారపు సుబ్బారావుకు జోహార్లు. ఆయన కుటుంబసభ్యుల బాధలో పాలుపంచుకుంటున్నాం.

## సంపాదకీయం

# జాతీయ విద్యావిధానం - సాంస్కృతిక పర్యవసానం!

**"జాతీయ** విద్యావిధానం - 2020 అనేది ఒక విప్లవాత్మక విధానం. ఇది పాఠశాల మరియు కళాశాల విద్య రెండింటినీ మరింత సమగ్రంగా, అనువైనదిగా బహుళ - క్రమశిక్షణతో 21వ శతాబ్దపు అవసరాలకు సరిపోయేలా చేయటం ద్వారా మరియు విశిష్టతను వెలికితీసే లక్ష్యంతో భారతదేశాన్ని ఒక శక్తివంతమైన నాలెడ్జి సొసైటీగా మరియు గ్లోబల్ నాలెడ్జి సూపర్ పవర్‌గా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది".

"సంపద్వంతమైన భారతీయ ప్రాచీన వారసత్వమూ, అజరామరమైన భారతీయ జ్ఞానసంపదా, ఆలోచనావిధానం ఈ జాతీయ విద్యా విధానానికి మార్గదర్శకంగా ఉంటుంది".

ఈ లక్ష్యాలతో, ఆశయాలతో 2020 జూలై 29న జాతీయ విద్యావిధానాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆ, ఆ సంఘాల నేతలు వ్యతిరేకించినప్పటికీ పార్లమెంటులో దానిని ప్రవేశపెట్టి చర్చకు అవకాశం ఇవ్వకుండా ఆమోదించారు.

2020 జూన్ 24న ప్రపంచబ్యాంకు 500 మిలియన్ల డాలర్ల రుణాన్ని భారతదేశంలోని ఉపాధ్యాయుల, విద్యార్థుల ప్రమాణాలను పెంచటానికి మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించింది. ఆ ప్రకటనలోనే అత్యధికంగా యువత (60 కోట్లమంది) వున్న భారతదేశం రాబోయే కాలంలో మానవ వనరులు అధికంగా వున్న దేశం కాబోతున్నందున, ఈ మానవ వనరులను భవిష్యత్ మార్కెట్ అవసరాలకు ఉపయోగపడే కార్మికశక్తిగా మలిచేందుకు ఈ రుణాన్ని మంజూరు చేస్తున్నట్లుగా ప్రపంచబ్యాంకు తెలియచేసింది.

ఎంతో ప్రగతిశీలంగా కనపడుతున్న జాతీయ విద్యావిధానపు లక్ష్యమూ, ప్రపంచబ్యాంకు ప్రకటనా చూసిన తర్వాత జాతీయ విద్యా విధానం ఎవరికోసం రూపొందించబడిందో, ఎందుకు అమలుచేయ బడుతుందో స్పష్టంగానే అర్థమవుతుంది. అసలు జాతీయ విద్యావిధానం అని పేరు పెట్టడంలోనే ఆర్.ఎస్.ఎస్.వారి ఏకజాతి సిద్ధాంతం ఇమిడి వుంది. అనేక జాతుల సమాహారమైన ఉపఖండంలో ఒకేజాతి, ఒకే మతంలాగా ఒకే సిలబస్, ఒకే ప్రణాళిక, ఒకే రకం పాఠ్యపుస్తకాలను దేశమంతా అమలుపరచబోతున్నారు. బహుశా ఒకే జాతి, ఒకే చదువు అనే నినాదం కూడా ఇస్తారేమో! ఈ పాఠ్యాంశాలను కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. వీటిని మార్చటానికి వీలులేదు. కావాలంటే ఆ,ఆ రాష్ట్రాలలో వారు కావాలనుకున్న అంశాలను చేర్చుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల, పాఠశాలల నాణ్యతను జాతీయ మదింపు సర్వే ద్వారా కేంద్ర ప్రభుత్వమే మదింపు చేస్తుంది. దీనివల్ల ఇప్పటివరకూ ఉమ్మడి జాబితాగా ఉన్న విద్యాశాఖను కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసేసుకోబోతుంది. రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర నామమాత్రంగా మిగలబోతుంది.

ఈ జాతీయ విద్యావిధానపత్రంలో నిర్బంధ ప్రాథమిక విద్య, విద్యాహక్కు చట్టాల ఊసేలేదు. ఇందిరాగాంధీ ప్రభుత్వం కొఠారీ కమీషన్ (1964-66) వేసింది. ఆ కమీషన్ నివేదిక సిఫార్సుల ఆధారంగా 1968లో ఒక విద్యావిధానాన్ని అమలులోకి తెచ్చారు. అప్పటివరకూ విద్యావిధానం టాటా-బిర్లాల ప్రణాళిక ప్రకారం సాగింది. ఆ తర్వాత 1986లో నూతన విద్యావిధానాన్ని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రకటించింది. అది ప్రపంచీకరణ విధానాలకు అనుగుణంగా విద్యావిధానాన్ని సవరించి విద్యారంగంలో ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం ఇచ్చింది. 'కుడిచేతికి కాశీదారం - ఎడమచేతికి ఎలక్ట్రానిక్ వాచ్ పెట్టించిన' నూతన విద్యావిధానాన్ని తలదన్నుతూ విద్యను పూర్తిగా ప్రైవేటుపరం చేస్తూ, విద్యార్థుల ఆలోచనలను శక్తియుక్తులను మొద్దుబార్చే, ప్రశ్నించేతత్వం లేని బానిసలుగా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను కార్మికులుగా సరఫరా చేసే జాతీయ విద్యావిధానాన్ని మోదీ ప్రభుత్వం రూపొందించింది. దీని ప్రకారం ప్రభుత్వం ప్రజల విద్యకు బాధ్యత వహించే పరిస్థితి నుండి పూర్తిగా తప్పుకోనుంది.

గురజాడ చెప్పిన పాత, కొత్తల మేలు కలయికలో కాలంచెల్లిన ఫ్యూడల్ సంస్కృతి, మార్కెట్ మాయాజాలపు సామ్రాజ్యవాద సంస్కృతుల చేటు కలయికతో సరికొత్తగా మోసం చేస్తున్న చట్టంగా ఈ జాతీయ విద్యావిధానం వుంది. ఈ విద్యావిధానం ద్వారా గత నూరేళ్ళుగా తాము నిర్మించుకున్న కాషాయ భావజాలానికి అనుగుణంగా గతాన్ని, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ముందుకు తీసుకురావడానికి సకల ప్రయత్నాలు జరుగుతున్నాయి. జీవన విధానాల అన్ని పార్శ్వాలను మూఢనమ్మకాలతో, కుహనా వైజ్ఞానిక భావజాలంతో, మనిషి కన్నా-సమాజం కన్నా మతమే గొప్పదన్న సంకుచిత భావాలలోకి భారతదేశాన్ని నెట్టడానికి ఈ జాతీయ విద్యా విధానాన్ని ఒక పనిముట్టుగా వాడుకుంటూనే, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసేటందుకు భారత విద్యార్థి యువతరాన్ని సిద్ధం చేసే పరిస్థితులను కల్పిస్తున్నారు. అంతేకాదు ఇప్పటివరకు అనేక పరిశోధనలతో, పరిశీలనలతో, నిర్మించుకున్న చారిత్రక వాస్తవాలను వక్రీకరించి, ఒక అబద్ధాల చరిత్రను నిజమని నమ్మించడానికి ఈ విద్యావిధానాన్ని వాహికగా చేసుకుంటున్నారు.

ఇక కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన సిలబస్‌ను పిల్లల బుర్రల్లో నింపటానికి విద్యాపాలనలో కూడా మార్పులు జరిగాయి. విశ్వవిద్యాలయాలను, పాఠశాలలను నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదని ఈ NEP 2020లో ఎక్కడా లేదు. విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా కళాశాలలు ఉండబోవటంలేదు. కళాశాలల సంఖ్య క్రమంగా తగ్గిస్తున్నారు. 2030 నాటికి అసలు వుండవు. విశ్వవిద్యాలయాలే బహుళ విషయక విశ్వవిద్యాలయాలుగా వుంటాయి. కళాశాలలకు కొన్ని ప్రమాణాలను సూచించి కనీసం 3 వేలమంది విద్యార్థులు వుంటే స్వయంప్రతిపత్తి ఇస్తారట. విదేశీ సంస్థలు, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు,

పాఠశాలలను, కళాశాలలను నడుపుకోవచ్చు. మతసంస్థలు నడుపుకునే పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసహాయం చేయాలని ఈ పత్రంలో పేర్కొన్నారు. పబ్లిక్ ఫిలాంత్రఫిక్ పార్టనర్‌షిప్ (దాతల భాగస్వామ్యం) పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా స్వచ్ఛంద కార్యకర్తలు బోధనా కార్యక్రమంలో భాగం కావచ్చు. ఆ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం సూచించిన సిలబస్‌కి తోడుగా వారు చెప్పాలనుకున్న సిలబస్‌ను కూడా చేర్చుకోవచ్చు. తాము చెప్పాలనుకున్న భావజాలాన్ని పిల్లల మెదడుల్లో జొప్పించవచ్చు. ఒరకంగా దేశమంతా ఆర్.ఎస్.ఎస్.వారి శిశు విద్యామందిరాలను నిర్మిస్తారనుకోవచ్చు.

9వ తరగతి నుండి 12వ తరగతి వరకు మూడు భాషలు, 40 సబ్జెక్టులలో మూడు సబ్జెక్టులను విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి వుంది. సెమిస్టర్ విధానం అమలులో వుంటుంది. డిగ్రీ కూడా 4 సం॥లు వుంటుంది. అన్ని తరగతులలోనూ విద్యార్థులు బహుళ నిష్క్రమణ – బహుళ ప్రవేశం చేయవచ్చు. ఎప్పుడు మానివేసినా అంతవరకూ సర్టిఫికెట్ ఇస్తారు. ఎప్పుడైనా చేర్చుకుంటారు. ఒకసారి స్కూలు మానిన పిల్లలు మరల చదవటానికి రాగలరా? పిల్లలు పేదరికం వల్ల స్కూలు మానివేస్తున్నారన్న సమీక్షలు వున్నా పట్టించుకోకుండా ఎన్నిసార్లన్నా మానండి, ఎన్నిసార్లన్నా జేరండి అంటే చదువు సాగుతుందా? అందుకే 'స్కూల్ టు వర్క్' కార్యక్రమాన్ని ప్రపంచబ్యాంకు మనకి రుణాన్ని మంజూరుచేస్తూ ప్రకటించింది. జరగబోయేది ఏమంటే అప్పోసొప్పో చేసి అయినా చదువు కొనుక్కోగలిగినవారు బడులకు వెళ్తారు. దేశంలో సగంకన్నా ఎక్కువగా వున్న పేదవారు స్కూల్ టు వర్క్ పనులు నేర్చుకుని కూలీలుగా మారతారు. అందుకోసమే ప్రాథమిక విద్య నుండీ అనేక భాషలని పరిచయం చేస్తున్నారు. ఆ భాషలను ఎంపిక చేసుకుని, చదువగలిగిన అవకాశం వున్నంతవరకూ చదువుకుని, ఆ ఆ దేశాలలో కూలిపనులు చేయటానికి ఈ దేశాన్ని మానవ వనరుల అడ్డాగా మార్చబోతున్నారు.

ఒకప్పుడు రాజాజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఒంటిపూట బడులు పేరుమీద వృత్తి విద్యల్ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తే, ఆనాటి ఉపాధ్యాయ ఉద్యమ నేత, అప్పటి శాసనమండలి సభ్యులు సింగరాజు రామకృష్ణయ్య నాయకత్వాన ఉపాధ్యాయ సంఘాల ఉద్యమం ద్వారా దానిని తిప్పి కొట్టారు.

ఏ ఒక్కరికీ మాతృభాషకాని సంస్కృతాన్ని త్రిభాషా సూత్రం కిందకు తెచ్చి విద్యార్థులందరిపై రుద్దే ప్రయత్నం ఈ విద్యావిధానం ద్వారా జరుగుతోంది. నిజానికి చరిత్ర, ప్రాచీన సంస్కృతుల ప్రత్యేక అధ్యయనానికి ఉన్నత, పరిశోధనావిద్యలో ఎవరైనా ఐచ్ఛికంగా సంస్కృతాన్ని నేర్చుకోవటం తప్పుకాదు. అంతే తప్ప దాన్ని అందరిపై రుద్ది, ప్రజల భాషలను నిర్లక్ష్యం చేసే విధానం మనం అంగీకరించకూడనిది. అంతేకాక సంస్కృతభాష పేరిట పుక్కిట పురాణాలన్నీ చరిత్రలేననీ, మనుధర్మశాస్త్రం లాంటి అమానవీయ బానిస సంస్కృతిని నెత్తిన పెట్టుకుని, కొత్త తరాలచేత మింగింపచేయటమనే ప్రయత్నం వెనుక పాలకవర్గాల కుట్రలను బట్టబయలు చేయటం చాలా అవసరం. భగవద్గీత శ్లోకాలను 6వ తరగతి నుండి 12వ తరగతి వరకూ పాఠ్యాంశంగా చొప్పించటం కూడా వీరి మనువాద సానుకూలతలో భాగమే.

ఇంకొక ముఖ్యమైన విషయం ఏంటంటే – ఈ NEP2020 విధానపత్రంలో ఎక్కడా రిజర్వేషన్ల ప్రస్తావన లేదు. షెడ్యూల్డు తెగలు, కులాలు, వెనుకబడిన తరగతులు స్థానంలో సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలు అనే కొత్త పదాన్ని తెచ్చారు. ఇక ఉపాధ్యాయుల పదోన్నతులు, వేతనాలు కూడా ప్రతిభ ఆధారంగానే వుంటాయని కూడా విధానపత్రంలో వుంది.

రాజ్యాంగంలోని పౌరస్వేచ్ఛలను, లౌకిక భావనలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాచే పనిలో తీరుబాటు లేకుండా వున్న భాజపాలకులు, ఆర్టికల్ 51A(h)లోని శాస్త్రీయ అభినివేశాన్ని, విద్య ద్వారా, కొత్త తరాలకు అందచేయటానికి చిరుప్రయత్నం కూడా చేయలేదు. విశ్వవిద్యాలయాలలో, కళాశాలల్లో జ్యోతిష్యాలు, వాస్తు, తాంత్రిక విద్యలు నేర్పటానికి ఏమాత్రం సిగ్గుపడని పాలకులు శాస్త్రీయ అభినివేశాన్ని (సైంటిఫిక్ టెంపర్) కల్పిస్తారని ఆశించలేము. అదే ఆర్టికల్‌లో గల ప్రశ్నించే గుణాన్ని పెంపొందించటం, సామాజిక సంస్కరణకు సంసిద్ధ పరచటం, సాటి మనుషులను పట్టించుకునే గుణాన్ని అలవరచటం.... లాంటివి ప్రాథమిక విధులుగా నిర్దేశించే, వాటిని పెంపొందించే చర్యలు ఈ పాలకులు చేపట్టటంలేదు.

ఇప్పుడు విద్యారంగంలో జ్ఞానం పేరుతో తప్పుడు జ్ఞానం చలామణి అవుతోంది. గతకాలపు కుల, మత సంకుచి తత్వాలను జ్ఞానంగా చెలామణి చేస్తున్నారు. ఈ అశాస్త్రీయ విద్యావిధానం ద్వారా పిల్లల్లో మూస వైఖరి కలిగిన మరుగుజ్జు మెదడులను అభివృద్ధి చేస్తున్నారు. ఉన్నత విద్యలు చదివిన వాళ్లు కూడా కనీస పాటి ఇంగితజ్ఞానాన్ని కూడా పొందలేకపోతున్నారు. మరోపక్క పోటీతత్వంతో నిండిన యాంత్రికమైన తరం గత 30–40 సంవత్సరాలుగా అమలవుతున్న ఆంగ్ల విద్య ద్వారా తయారై కూర్చుంది. అత్యధికులకు అందిన విద్య కనీసపాటి శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను కూడా ఇవ్వలేకపోతోంది.

చరిత్రపేరిట అబద్ధాల ఫ్యాక్టరీ ప్రచారం చేసే ముస్లిం ద్వేషాన్ని, గతంలోని అసమానతలను, వైరుధ్యాలను, మౌఢ్యాలను ప్రశ్నించకుండా నెత్తిన పెట్టుకుని ఊరేగటాన్నీ ఈ విద్యావిధానం మరింత సానుకూల పరుస్తుంది. సాంస్కృతిక తిరోగమనానికి రహదారులు పరుస్తున్న ఈ విద్యావిధానంలో నిజమైన జాతీయత లేదు, ఉన్మాదం వ్యాప్తిచేసే పరోక్ష ప్రయత్నం తప్ప!

ఎనిమిదో తరగతి ప్రభుత్వ బడులలో విద్యార్థులకు నెట్ సౌకర్యం ఉన్న ట్యాబులను విద్యాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. వీటిద్వారా ప్రసారమయ్యే కాలక్షేపపు కార్యక్రమాలు, చంపటం ద్వారా గెలవాలనే ఆటలు, పోర్న్‌సైట్‌లతో పిల్లల మనసులు విషపూరితం చేస్తున్నాయి. వాటిపై అదుపులేని ఈ పరిస్థితుల్లో ఆడపిల్లలకు కనీస పాటి భద్రత కూడా లేని సాంస్కృతిక విచ్ఛిన్నం వేగం పుంజుకుంటోంది.

శారీరక, మానసిక శ్రమలను వేరువేరుగా ఉంచి, చదువుకున్నవాళ్లు, శారీరక కష్టం చేసేవాళ్లు అనే అంతరం తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. చదువులనేవి అన్ని రకాల అంతరాలను రూపుమాపాలనే ప్రజాతంత్ర విలువ సాధించడానికి నేటి జాతీయ విద్యావిధానం మరింత ఆటంకంగా తయారవుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రజానుకూల మేధావులు, సంఘాలు, కళాకారులు, రచయితలు ఒక తాటి మీదకు వచ్చి ఈ విద్యా సాంస్కృతిక విధ్వంసాన్ని ఉద్యమ చైతన్యంతో ప్రతిఘటించాలి.

కథ

# యాది

- వారాల కృష్ణమూర్తి

జనసాహితితో సన్నిహిత సంబంధాలు ఉన్న కథారచయిత, కళాకారుడు, స్నేహపాత్రుడైన వారాల కృష్ణమూర్తి 2022 డిశంబర్ 17న మరణించిన సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ 17 సంవత్సరాల క్రితం 'ప్రజాసాహితి'లో రైతుల సమస్యపై ఆయన రాసిన 'యాది' కథనూ, జనసాహితి 91, 92లలో విరివిగా ప్రదర్శించిన వీధిభాగవత యక్షగానం 'అప్పుల భారతం'పై రాసిన వ్యాసాన్నీ ఈ సంచికలో పునర్ముద్రిస్తున్నాము.

'గ్రామీణ జీవన విధ్వంసం – రైతాంగ ఉద్యమం' అనే ఒక మౌలికమైన సామాజిక అంశంపై, సాహిత్య వ్యాసాలతో, కథలతోనూ, కవితలతోనూ, నాటకాలు, సినిమాలపై సమీక్షలతో 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచిక 2005 నవంబరులో వెలువడింది. ఆ సంచిక కోసం తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న గ్రామాలకు వెళ్ళి, అక్కడ వారి కుటుంబాలతో, రైతులతో మాట్లాడిన జనసాహితి జంటనగరాల శాఖ బృందంలో వారాల కృష్ణమూర్తి ఒకరు. – సంపాదకుడు

**బతుకు** భారమైంది.

రోజు రోజుకు భయంకరమై నరకంలా మారుతోంది. మునుపెన్నడూ ఇంత కష్టం అనిపించలా.... ముసలి తల్లి, కట్టుకున్నది, పుట్టిన పిల్లలూ తిరుగుతున్న శవాల్లా... జీవితంలోని చీకటిని కడుపులోని ఆకలిని కప్పి పెట్టను చేతగాక గుక్కెడు గంజినీళ్ళకోసం పిడికెడు మెతుకుల కోసం ఆశగా.... ఆబగా.... దీనంగా చూస్తుంటే వాళ్ళకు మొహం ఎలా చూపాలో అర్థంకాక – ఎక్కే గడపా.... దిగే గడపా..... ఎక్కడా అప్పు పుట్టక తిరిగే ఓపిక లేక ఆ రాత్రి చాల ఆలస్యంగా ఇల్లు చేరుకున్నాడు లచ్చుము.

తలుపుకు గడియలేదు. నిశ్శబ్దంగా ఎవరికీ నిద్ర చెదరకుండా ఓ మూల దూరి పడుకుందాం అనుకుని అడుగులో అడుగు వేసుకుంటూ దొంగలా దూరాడు. నిజానికి దొంగే – తనరాక తెలిసి 'అంతో.... ఇంతో రేపటికైనా కడుపులో ఇంత ఏసుకోవచ్చు' అని ఆశగా చూసే కుటుంబ సభ్యులని నిరాశ పరచడం మనసుకు కష్టంగా తోచి వాళ్ళ మొహం చూడలేక జీవితంలో ఓడిన మనిషిలా ఆ చీకటిలో చీకటిలా ఓ మూలకు చేరాడు.

"ఒరే లచ్చుమూ!

......................

పలకవేందిరా బిడ్డా!"

"నేనేలే... పడుకో అమ్మా!"

"ఏమైనా తింటివా!" భార్య యాదమ్మ పలకరింపు.

"ఆ....." నిజంలా అబద్ధం. చీకట్లో మొహాలు కనిపించకపోయినా స్వరంలో ఎంత నిండుతనం తెచ్చుకున్నా "ఆ!" నాదంలో అపస్వరం గుర్తించకపోలేదా ఇల్లాలు. అంతటి భయంకర సన్నివేశానికి పెరటిలో పశువుల ఆర్తనాదాలు నేపథ్య సంగీతం.

"వాటికి నీళ్ళు పెట్టావా!"

"ఎంతకని నీళ్ళు తాగుతాయి.... రేపు వాటికయినా నాలుగు కట్టల గడ్డి సంపాదించాలి.... లేకుంటే...."

"సరే.... సరే....."

ఇహ మాటలు పెంచే ఓపికలేక అంతా చీకట్లో పడిపోయారు.

రోజంతా అప్పుల కోసం తిరగడం మూలాన, రాత్రంతా రేపెట్లా అనే ఆలోచనలతో ఎప్పుడో తెల్లవారిజామున కునుకు పట్టినందున చాల ఆలస్యంగా లేచాడు. దొడ్లో పనులు పూర్తిచేసుకుని మొహం తుడుచుకుంటూ వచ్చి మంచం మీద వాలాడు.

తల్లి, పెళ్ళాం పిల్లలు అంతా చుట్టూ చేరి ఏదో తింటున్నారు. అది చూసి తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు. తను ఎన్ని ఇబ్బందులు పడ్డా పది రూపాయలు పుట్టించలేకపోయాడు. కానీ యాదమ్మ ఏం మాయ చేస్తుందోగాని రోజు ఏదో ఒకటి పెట్టి తల్లి, పిల్లల కడుపు నింపుతుంది అని ఆశ్చర్యపోయాడు.

"ధూత్ నీయవ్వ.... బంగారు బువ్వని ఇది పెడ్తావే!" చిన్నవాడి ఆశ్చర్యంతో కూడిన ఆవేదన.

"లొల్లి సెయ్యకు బిడ్డా! పెద్ద పెద్ద మారాజులు కాలం కలిసిరాక రాజ్యాలుపోయి అడవులల్ల ఈ బంగారమే తిని బతికిన్రు. ఆకులు అలుములు వుడకేసుకుని ఈ బంగారంతోనే కలిపి తిన్రి".

"ఓ కథలు చెప్పమాకే కడుపు నిండదు."

"రేయ్! నోర్మూసుకుని తిను.... లేదా లేసిపో.... పోయి యాడన్నా అడుక్కుతిను." తల్లి కసుర్లు.

"తమ్మీ! కాని కాలంరా! వుంటే ఇట్లెందుకు పెడుతుంది. లేకనే – మేం తినలా.... చూడు ఇట్ల నోట్లో ఏసుకో.... బాగుంది. పాముల పండుగనాడు గీ బంగారమే గాదుర అంతా కళ్ళకద్దుకుని నోట్లో ఏసుకునేది. పచ్చనాకు

ఏదైనా కడుపుకు మంచిదేరా!" ఏదో తరగతి చదువుతున్న బుజ్జి బుజ్జగింపు.

"ఆలోల్లేందే.. పిలవాడట్ల ఒర్లుతున్నాడు.. ఏందది? ఆకులు వుడకేసినావ్.... మరిగదేందే వడల్లెక్కన."

"గది బంగారమయ్యా!" తల్లి వివరణ

"బంగారమేందే.... దిమార్ గిట్ల పనిజేస్తలేదా? బంగారం తింటారా! ఏందది?"

"పుట్టమన్ను.... పిండి లెక్కజల్లెడ బట్టి... పప్పుకారం ఎసి కాల్సిన"

"మన్ను తినబెడ్తున్నావా!" బాధగా అడిగాడు.

"లేదురా మీ అయ్యపోసిన రాసులు.... నీవు దెచ్చిన కాసులు పోసి వండి పెట్టింది. ఏం జేస్తాం! తిండికి గింజల్లేవు. ఆకులు అలుములు తీసుకొచ్చి వుడకేస్తిమి ఇన్నాల్లూ. పూరంతా ఆక్కూరలని కనిపించిన సెట్టుసేనుల్ని బోడి జేస్తుండిరి. దానికీ పోటీవచ్చె – కరువొచ్చె.. ఓరే ఆ కొండల్లో వాల్లు పుట్టమన్నే తిని బతుకుతూండారంట. అయ్యా మనకు బతుకు లేక ఈ మన్ను తింటున్నాం. సూత్తామంటే కంటికి గింజలు కనిపించలా... మన తానే గాదు. మనలాంటి పతి ఇంట్లోనూ అంతే.... అలాంటప్పుడు ఎవరిని అడుగుదాం. ఇచ్చే మారాజులు మనకు అప్పు ఇవ్వకపోయిరి. మరి ఎట్లా సావడం.... అందుకే!"

"మన్ను తిని బతుకుదామంటారా!"

"పెంట తింటున్నట్టు మొకం బెడితివి. అయ్యా మనకు వేరే దారి లేదు. కానికాలం, సుక్క వానలేదు. నాలుగేండ్లుగా పొలం బీడుపాయె. వున్న గొడ్లను అమ్ముకదింటిమి. పాలిచ్చే బరిగొడ్లని మేపలేకపోతుంటిమి.... అవీ వట్టిపోతున్నాయి. ఇంక ఎట్లా బతుకుడు".

తల్లికి సమాధానం చెప్పలేక వీధిలో పడ్డాడు లచ్చుము.

కడుపులో ఆకలి.... కసి పెరుగుతుంది. నేరుగా షావుకారింటికి చేరుకున్నాడు. ఒక గంట తరువాత తన్ను పలకరించను వీలు చిక్కింది షావుకారుకు.

"రేయ్ లచ్చుం వచ్చిండు ఇంత చాయ్ తీస్కరా! చూడు లచ్చుం భాయ్... నీకు అప్పు గావాలె.... రోజు వస్తున్నావ్.... నాకూ ఇయ్యాలనే వుంది. కానీ నాతాన పైసలు యాడుండాయి. నాతానే గాదు వూర్లో ఎవరితానా లేవు."

"గట్టంటే ఎట్ట సేటూ.... గరీబోల్లం కాల్మొక్తా!"

"నేనూ కాల్మొక్తా.... డబ్బెవరిస్తారు చెప్పు. నువ్వేమొ గా భూమి అమ్మనంటివి."

"వున్నది గా ఎకరమేనాయె.... గదీపోతే ఎట్లా.... పదేళ్లలో పదెకరాల పొలం కరిగి ఒక ఎకరమాయె....."

"బిడ్డల పెళ్లిజేస్తివిగదరా!.... పండని భూవి కడుపు నింపుతుందా! గా మట్టి తిని బతుకుతారా! ఆలోసించు భూమి అమ్ముతానంటే చెప్పు.... వూరకే పైసలు యాడబుడ్తాయిరా.... గా చాయ్ తాగు" పనివాడు తెచ్చిన చాయ్ అందుకుంటూ చెప్పాడు.

"గా భూమి గిరివీ పెదుదువా!" చాయ్ తాగుతూ....

"గిరివి... గవి కిరికిరిలలో పరేషాన్ జేస్తయి. మనదెగ్గర లెక్క సరీగుండాల. ఆలోసించుకో...."

చాయ్‌గ్లాసు కిందపెట్టి.... కాస్సేపు అలాగే కూర్చున్నాడు.

"సోచాయించరా!"

"గట్లనే.... ఓ యాభై రూపాయిలుంటే యీ సేటూ.. ఇంట్లో పిల్లలు పస్తులున్నారు. పున్నెముంటుంది."

"వుంటే ఇద్దును. నాతాన యాడివిరా లచ్చుమూ, అయినా ఇంత పొద్దు గాలగ పైసలు దొరకవు. తరువాత రాపో...."

లాభం లేదని లేచాడు లచ్చుము. తెలిసిన వాళ్ళందరిని పలకరించి అప్పుకోసం దేవులాడాడు. డబ్బుల్లేకున్నా ఓ రెండు కట్టల గడ్డి మోపులు అయినా ఇవ్వమన్నాడు. అలా తిరిగి తిరిగి రచ్చబండ దగ్గరకొచ్చి కూర్చున్నాడు. అందరివీ కళతప్పిన మొహాలే అనుకున్నాడు.

పల్లెలు కళతప్పాయి. ఎక్కడ చూసినా మోడువారిన చెట్లు. బీడువారిన భూములు. జీవంలేని మనుషులు.. పశువులు. బతుకు కనాకష్టమై వలసపోతున్న మనుషులు – కబేళాలకు తరలిపోతున్న పశువులు.

మధ్యాహ్నం వరకు రచ్చబండను వదల్లేదు. 'అన్నమేలకుపోతే గా పెదనాన్న గింత తినమనడా!' అన్న ఆలోచన మెదిలింది. ఆలోచన కాస్సేపటికి అసహ్యమనిపించింది. ఆకలి అసహ్యాన్ని పక్కన పెట్టింది. లచ్చుము లేచాడు.

ఎండ మండుతోంది. నిప్పుల మీద నడకలా వుంది. మనసూ మాడుతుంది. మండుతున్న కళ్ళు తుడుచుకున్నాడు. పెదనాన్నంటే పెదనాన్న కాదు. దూరపు బంధువు. కులంలో పచ్చగున్నోడు. బతక నేర్చినవాడు.

ఇంటిముందు చేరగానే

"ఎరా అట్లుండావ్.... పానం బాగాలే"

"బాగున్నా"

"అమ్మ ఎట్లుంది? కోడలు, పిల్లలు బాగున్నారా?"

"ఆ!"

"ఒరే మల్లిగా మీ అన్నొచ్చుండు. మంచినీళ్లుతే."

"నీళ్ళతో కడుపు నిండేనా!" అన్నట్టు చూశాడు లచ్చుము.

"పైసలేమైనా!" దీనంగా వుంది స్వరం.

"యాడివిరా! నీ లెక్కనే నా బతుకు. నీకు తెలవందిగాదు. ఏమనుకోకు. నాతాన లేవు."

"పోనీ రెండు గడ్డిమోపులిస్తే"

"గడ్డి...."

"నోర్లేని పశువులు అరిచి చస్తున్నాయి"

"మనుషులం మనం అరవలేం. ఏంజేస్తాం.... ఈయాల శుక్రవారం గదా.... రేపు వచ్చి తీస్కపో.... నాకు జర పనుంది పట్నం పోవాలె...." ఇహ లెమ్మన్నట్టుంది మాటతీరు.

ఎవరి బతుకులు వారివి అనుకుంటూ ఇల్లు చేరాడు. పశువులు అరుస్తూనే వున్నాయి. అయినా అంతా ప్రశాంతంగా పడుకుని వున్నారు. వీళ్ళెలా వుండగలుగుతున్నారా అని ఆశ్చర్యపోయాడు మంచం మీదవాలి.

"ఏమన్నా తింటివా!" అడిగింది భార్య.

"మీ అమ్మ మొగుడుండాడు పిలిచి పెట్టను."

"జరంత ఆక్కూర తిను...."

సమాధానం రాకపోయేసరికి లోనికెళ్ళి ఓ గిన్నెలో ఆక్కూర చేతిలో రెండు దిబ్బరొట్టె ల్లాంటి మట్టి పెళ్ళలు తెచ్చింది.

లచ్చుము కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చివాలునలేచి పాత ఇనుపపెట్టె తీశాడు.

అందులోని చీరల్ని బైటపడేసి అడుగున కాగితంలో మడచిపెట్టిన వుంగరం తీసుకున్నాడు. అది తన పెళ్ళినాటిది. దాని అవసరం ఏముంది? ఆమాటకొస్తే దేని అవసరమూ లేదు. ఎవరి అవసరమూ లేదు.

"ఇప్పుడెందుకు?"

సూటిగా భార్య కళ్ళల్లోకి చూశాడు. ఆ చూపులోని ఓటమి.... దాని తాలూకు కసి.... ఆమె నోటమాట రాకుండా చేశాయి. పొద్దుటి నుండి ఏమీ తినకపోవడం వల్ల మనిషి నీరసంగా వున్నాడు. ఆకుకూర తిందామనుకున్నాడు. దానితోపాటు తెచ్చిన మట్టి రొట్టెల్ని చూసి 'బతుకింత అధ్వాన్నంగా తయారయిందేమిటా!' అని బతుకు మీద రోత పుట్టింది. భూమి అమ్మితే డబ్బు వస్తుంది. కానీ అమ్మలేదు. తల్లి, పెళ్ళాం అమ్మవద్దంటారు. అదీ లేకపోతే ఆదరువు వుండదని, ఇంతవరకూ అంతో ఇంతో అప్పు పుడుతుందంటే ఆ భూమిని ఈ ఇంటినీ చూసే ఇస్తున్నారని.

'పిల్ల పెళ్ళికి అదీ మిగల్చవా!' అంటూ ఏడుపులు. మనుషులకే తిండి పెట్టలేకపోతున్న వాడివి ఎద్దులెందుకని వాటిని అమ్మేశాడు. పాలిచ్చే రెండు బర్రెలు తప్ప మరేమీ మిగల్లేదు. వాటికీ గడ్డి కరవై వట్టిపోతున్నాయి.

ఎంత ప్రయత్నించినా అప్పు పుట్టడం లేదు. ఒకనాడు పదెకరాల ఆసామి. తన మాటమీద ఇతరులకు అప్పు పుట్టేది. అలాంటిది ఈరోజు తనకే అప్పు పుట్టడంలేదు.

ఏం చూసి ఇవ్వాలన్నది వాళ్ళ ప్రశ్న.

ప్రభుత్వమిచ్చే అప్పులు అందరికీ అందవు. అందినా సగానికి సగమై చేతికి వస్తుంది. బయటి అప్పులవాళ్ళిచ్చేది భూమిని సొంతం చేసుకుందామనే – రైతుల్ని ఆదుకుందామని కాదు.

ఎలా బతకాలి?

ఆలోచనలతో విసిగి వేసారి ఆలోచించే శక్తిలేక మెదడు మొద్దుబారిపోయింది. విసురుగా వీధిలో పడ్డాడు. షావుకారు ఇంట్లో తేలాడు.

"ఏరా భూమి అమ్ముదువా!"

"లే...."

"మరెందుకొస్తివి?"

"ఇది తీస్కుని ఎంతనో గంత ఇయ్.... శాన జరూర్"

"అంగూటీనా? బంగారుదేనా? సరే.... ఇదో రెండు వందలు"

"అదేంటి సేటూ ఎంత లేదనా"

గది ఎంతైనా.... నాతాన వున్నదంతే. కరువు కాలంలో పైసలెక్కడికెల్లి వస్తాయి. నీ ఇష్టం.

మరోచోట అమ్ముకునే ఆస్కారంలేక సరేనంటూ తలవంచి ఆ రెండు వందలు తీసుకున్నాడు.

డబ్బురాగానే తెలీని జీవం వచ్చింది మనిషికి. అంతవరకు వున్న అలుపు పోయింది. చకచకా బజారులో జొన్నలు.... అంత పప్పు తీసుకుని భుజాన వున్న టవల్‌లో మూట కట్టాడు. అరుస్తున్న బర్రెలు గుర్తుకొచ్చాయి. 'వాటికి గడ్డి కావాలె!' అని రెండు కట్టలు ఎండుగడ్డి కొని నెత్తిన పెట్టుకుని ఇల్లు చేరుకున్నాడు.

గడ్డిమోపు చూడగానే ఆవురావురు మంటున్న బర్రెలు గొంతులు మరింత పెంచి అరిచాయి. వాటి అరుపులకు 'ఏమయిందో....' అని యాదమ్మ చూడనొచ్చి భర్త నెత్తిమీద మోపులను టవల్‌లో మూటకట్టినవి చూసి ఆశ్చర్యంగా టవల్‌లో తెచ్చినది అందుకుంది. లచ్చుము గడ్డిమోపులను చెరోదాని ముందు వేశాడు. అవి అరుపులు ఆపి తినడం మొదలు పెట్టి – ఆనందంతో ఓసారి తలలెత్తి లచ్చుముని చూసి "అంబా!" అని అరిచాయి కృతజ్ఞతగా.

'ఇహ ఇంతకుమించి నేను ఏమీ చెయ్యలేను'. అన్నట్లు చూసి కళ్ళు తుడుచు కున్నాడు లచ్చుము.

అరగంటలో యాదమ్మ జొన్నసంగటి చేసి పొద్దుటి ఆకుకూరతో వచ్చింది.

"పిల్లలకు పెట్టు"

"పొద్దున తిన్నది అప్పుడే అరగదు. రాత్రికి పెడతా".

'అన్నమైతే అరుగుతుంది. తిన్నది మన్ను ఎలా అరుగుతుంది'. అనుకుంటూ తల్లిని పిలిచాడు.

"నువ్ తిను బిడ్డా! మొగోడివి నువ్ బాగుండాల".

"నువ్ తినరాదే...."

"రాత్రికి"

"సరే నాకూ వద్దు. నేను తిన్నాను. నేను పొలానికి పోతున్నా.... రాత్రికి ఆడనే పంటా.... రాత్రికి నాకేం చెయ్యకు."

"మరేం దింటావురా!" అడిగింది తల్లి.

"ఈరోజు బిరియాని తినాలనుందే – ఓటల్లో తీస్కపోతా రాత్రికి గాడే వుంటా నాకోసం సూడకండ్రి."

"ఇప్పుడు పొలంకాడికెందుకురా! ఏముందని?"

"మనసు బాగాలేదే కాడే బాగుంటుంది. వస్తానే అమ్మ.... నువ్ జర పిల్లల్ని చూసుకో యాదీ...." అన్నాడు.

ఆ మాటలు కన్నతల్లి పేగుల్ని.. కట్టుకున్న దాని గుండెల్ని కదిలించాయి.

"ఎల్లుబిడ్డా ఎల్లూ సుకంగుండు. మనసు కష్టపెట్టుకోకు."

ఏం మాట్లాడాలో చేతగాక గొంతురాక వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ ఇల్లంత కలయచూసి బైటపడ్డాడు.

పండని పొలాన్ని చూస్తూ గట్టుమీద కూర్చున్నాడు. చిరుచీకట్లు ముసురు కుంటున్నాయి. ఈ పొలం చుట్టూ ఎన్ని కలలు కన్నాడు. అన్నీ కల్లలైనాయి. ఏడెకరాల పొలంలో ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. ఇంత వరి, అంత జొన్న, శనక్కాయ, కందులు, కూరగాయలు, పండ్లచెట్లు.... ఎన్నో కలలు.... అన్నీ ఎండిపోయినాయి. చివరకు మిగిలింది ఎకరం నేలలో రెండు కొబ్బరిచెట్లు, ఒక చిన్న గుడిసె.

రెండుసార్లు బోర్లు వేయిస్తే.... కన్నీళ్ళొచ్చాయి. డబ్బూ పోయె.. పంటా పోయె.. బతుకే దిగజారిపోయె.

లేచి గుడిసె లోనికెళ్ళాడు. మసిబారిన కిరసనాయిలు బుడ్డీ వెలిగించాడు. మసక వెలుతురులో మసిబారిన గతం.

ఆడబిడ్డల పెళ్ళిళ్ళకని ఆరెకరాలు అమ్ముడమాయె. యాదికి అదిష్టంలే.... గంతకు తగ్గ బొంతంటుంది. కులపోల్లలో నగుబాట కామా అంటే – నవ్విన్నాయాల్లు అవసరానికి అన్ని నీల్లుకూడ పొయ్యరు. ఒకరికోసం మనం బతక్కూడదు. మనకోసమే మనం బతకాల అంటే ఒప్పుకోలా.... బలవంతంగా నోరు మూయించి బిడ్డల పెళ్ళిళ్ళు చెయ్యడమైంది. ఔ వాళ్ళు పెద్ద సావుకార్లు.... వుద్దోగాలు సేస్తుండారు అంటే సరి. వాల్లూ కూటికి లేనోల్లేగదా, వాల్లకూ ఆడంబరాలా అంటుంది. ఏమైతే ఏం బిడ్డలు పెళ్ళయింది. ఇంక మిగిలింది

చిన్నది, చిన్నోడు. వాడిదేమిలే మగోడు.... దాని పెళ్ళి చేద్దామంటే చదవనీ అని పోరు. చదువంటే మాటలా – తినడానికి గతి లేదు. చదువెట్లా అని ఆలోచన లేదు. ఈరోజు కాకుంటే రేపైనా తెలుసుకోదా! బరువు మోస్తే తెలుస్తుంది.

బిరియాని వాసనకు మనసు మారింది. లేచి కడవలోని నీళ్ళు చెంబులో ముంచుకుని తినడానికి పొట్లం తెరిచాడు. నాయాలు బాగా చేశాడు అనుకుంటూ తిన్నాడు. తిన్నంతసేపూ తల్లి, భార్య, పిల్లలు ఎదురుగా నిల్చున్నట్టే అనిపించి రుచిగా వున్నా తృప్తికలగలేదు. తినలేక వదిలేసి చెయ్యి కడుక్కున్నాడు. జీవితంలో తృప్తిలేదు. అంతా అసంతృప్తే.

లేచి చీకట్లోనే పొలమంతా తిరిగాడు. గుడిసెలోపల బుడ్డీ ఎర్రగా నిలిచి వెలుగుతోంది. గాలిలేదు. ఆకాశం నిర్మలంగా చీకట్లు కక్కుతోంది. ఇంక చాలు అనుకుంటూ గుడిసె లోపలికి పోయాడు. బిరియానితో పాటు తెచ్చిన మరో దానికోసం వెతికాడు. కనిపించలా. దీపం చేతబట్టి గుడిసంతా వెతుకుతున్నాడు. మిగిలిన బిరియాని పొట్లంతో పాటు పడేశానా అని అనుమానం వచ్చి బైటకు చూశాడు.

"దీని కోసమేనా దేవులాట!"

ఆ గొంతు విని అదిరిపడ్డాడు లచ్చుము.

"ఎందుకలా బిత్తరపోతావ్.... రా ఇక్కడుంది.... గుడిసె బయట నుంచి పిలుస్తున్న యాదమ్మ గుడ్డి వెలుతురులో మెరుపులా కనిపిస్తోంది.

"నువ్వెప్పుడొచ్చావు!" అంటూ బయట కొచ్చాడు.

"నీతోపాటే మేమూ"

"ఎందిరా లచ్చుమూ నువ్వు చేసే ఇకారపు పని. బిడ్డ యాది నీ మనసు పసిగట్టింది. నన్ను ఎచ్చరించింది. నేను నమ్మలా బిడ్డా – అది నిజమే అయింది" అంటూ చతికిలబడి ఏడవసాగింది.

లచ్చుమూ తల్లితోపాటు కూలబడి పోయాడు. చేతిలోని దీపం పక్కనపెట్టి రెండు చేతులతో మొహం దాచుకున్నాడు.

"నువ్ ఎన్నడన్నా మీ అమ్మను పిల్లలకు నాకూ పెట్టకుండా తిన్నావా! ఈయాల ఒంటిగా బిరియాని తినాలనిపించింది. అంటే ఏంది.... నీ దారి నువ్ చూసుకుంటున్నట్టు కాదా! పంట కాలంలో కూడ ఈడ పండవు ఈనాడు ఈడే పండుతాననంటివి. ఎందుకే.. పశాంతంగా పండనొస్తివా.... మమ్మల్ని ఏడ దూకమంటావ్?

"ఈ బతుకు బతకలేనే నా బతుకీడ్చను పొలం పండతాలేదు. పనిలేదు. అప్పు పుడతా లేదు. కడుపునిండా మీకింత తిండి పెట్టలేకపోతి. సివరకు పశువులకు ఇంత గడ్డి సంపాదించలేని బతుకెందుకు?

"ఒరే లచ్చుమూ.... నువ్ పోతావ్.... మా బతుకులెట్లారా దీని బతుకు.... పిల్లలు బతుకు ఆగమైపోదా!"

"అందుకే అందరం సద్దామె – పీడ పోతుంది"

"సావడానికేనా ఇంతకాలం బతికింది" తల్లి ఆరాటం.

"సావుకు బయంలేదుగాని – సావను బతక్కూడదు. నీకు నాకూ వచ్చిన కష్టమా ఇది. మనలాంటి కొంపల్లో అందరిదీ ఇదే బతుకు. చెప్పుకోలేక కొందరు వూరొదిలి పారిపోతున్నారు. ఇంకా పిరికినాయాల్లు ఇదో... నీలా మందో మాకో తాగిపోతున్నారు. రాత్రి అయినాక పగలు రాదా!" నిబ్బరంగా అంది యాదమ్మ.

"మాటలకేంలే..... కడుపులు కాల్తుంటే."

"మాకు కాలడంలా.... మీ అమ్మ కడుపు కాల్తుంది తిండి లేకకాదు సెట్టంత కొడుకు సేతగానోడయ్యాండని. నాకూ పిల్లలకు కడుపులు కాలడంలా.. సల్లగుండాయి – పశువులు గడ్డిలేక అరవడంలా.."

"అదేనే. పశువులకింత గడ్డి కూడా పెట్టలేనోల్లం బతకడం ఎందుకే!"

"అంతగా దిగులైతే ఎట్టా. పశువులకు గడ్డి లేకుంటే వదిలేద్దాం. వాటి మానాన అవి బతుకుతాయి".

"మరి మనుషుల్ని వదిలిపెట్టనా"

"ఇప్పుడు వదిలేసే పోతున్నావ్. వదిలేసినా యాడికి పోరు కాలు సెయ్యి ఆడేంతవరకు ఈడే వుంటాం. దొరికినరోజు తింటాం. లేదంటే ఈ మన్ను తిని బతికినన్నాళ్ళూ బతుకుదాం".

"మాటలు సెప్పడం కాదే"

"సరే సచ్చేవాల్లని ఎవ్వరూ ఆపలేరు. సావొద్దని ఎంతకని కాపు కాస్తాం... నీ ఇష్టం సూడయ్యా ఇట్టా బతుకు బరువైందని సావాలని అనుకోలా మీ అమ్మ. వూరంతా సెప్తుంటారు మీ అమ్మ శానా గొప్పదని. పదినాళ్ల బిడ్డవంటా మీ బాబుని పాము కరిస్తే సచ్చినాడంట. అప్పటినుండి ఒంటిగా.... పద్దెదేండ్ల పసిది.... సిన్న బిడ్డ తల్లి అయిన వాళ్ళెవ్వరూ నీడివ్వకపోయినా.... మీ అయ్య తాతలు సంపాదించిన బూవులు లేకపోయినా బతికింది. నిన్ను బతికించింది. పదిండ్లలో పాచిపనే చేసిందో.... దొంగతనమే చేసిందో.... లంగపన్లే చేసిందో ఆ పంచనా ఈ పంచనా పడి ఎన్ని అవమానాలు దిగమింగి నిన్ను చూసుకుంటూ బతికింది. నిన్నంతవాడిని చేసి పదెకరాలకు ఆసామిని చేసి నన్ను కట్టబెట్టింది. తనెంత కష్టపడి వుండాలి. ఈ ముసల్దాని కష్టాలకు మించిందా మన కష్టం. ఆలోసించు. మీ అమ్మకొచ్చిన దానికన్నా గొప్పది నీ కష్టం అనుకుంటే చావు". అంటూ పురుగుల మందు డబ్బా కింద పడేసింది.

"పిరికివాడితో నేను ఎంతకాలం కాపురం చెయ్యను. నీ ఇష్టం... నీ కోసం మీ అమ్మ బతికినట్టు నా పిల్లలకోసం నేను బతుకుతా" అంటూ అత్తను రెక్కపట్టుకుని లేపింది.

"నా కడుపున నువ్వెందుకు పుట్టలేదే యాదీ.... ఈ పిరికి నాకొడుకు బుట్టినాడు" అంటూ కోడల్ని కౌగలించుకుంది.

ఆ ఇద్దరాడవాళ్ళ నిబ్బరం చూసి చిన్నబోయిన లచ్చుము చేతులు చాచాడు ఆదుకోమన్నట్టు. యాది చేయి పట్టుకుని లేచాడు. అంతా ఒకర్నొకరు పట్టుకుని ఏడుస్తున్నారు.

ఆ ఏడుపు బాధపడి కాదు.

బాధల నుండి విముక్తి కలిగినందుకు.

తనివితీరా ఏడ్చి తనువుల్ని తేలిక చేసుకున్నారు. మనుసుల్ని దిటవు చేసుకున్నారు.

పొలంలో పంటలేకపోయినా వీస్తున్న గాలికి పులకించి నవ్వుతోంది భూమి ఈరోజు కాకుంటే రేపు పండనా అని.

కన్నీటితో పాత జీవితాల్ని కడిగేసుకుని ముందుకు సాగుతున్న మనుషులు వాళ్ళు.

రేపును పండిస్తారు.

వ్యాసం

# మోడీ స్వామ్యంలో ఎన్నికల సంస్కృతి

- దివికుమార్

*2009వ సంవత్సరంలో ఎన్నికలు జరుగుతూ ఉండగా మే నెల 'ప్రజాసాహితి'లో 'పరిణామంలో ఎన్నికల సంస్కృతి' అనే వ్యాసం వచ్చింది.*

*అప్పటికి గడిచిన 60 సంవత్సరాలుగా జరుగుతున్న ఎన్నికల తీరులో ఒక్కొక్క పది సంవత్సరాలకు ఎలాంటి మార్పులు వస్తున్నాయో స్థూలంగా వివరించిన వ్యాసమది.*

1. *రాజకీయ నాయకత్వం తమ స్వంత ఆస్తులు అమ్మి, ప్రజాసేవే పరమావధిగా భావించిన, కొందరినైనా ప్రజల ఆకాంక్షల ప్రతినిధులుగా చెప్పుకోదగిన కాలం ఒకటి ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలో వుండేది. 60 ఏండ్ల సంఘసంస్కరణోద్యమం, 40 ఏండ్ల స్వాతంత్ర్యోద్యమం, 18 ఏండ్ల కమ్యూనిస్టు ఉద్యమం నెలకొల్పిన త్యాగపూరిత సంప్రదాయాల ప్రభావం, మెండుగా వుండిన కాలమది. ఇది స్థూలంగా మొదటి దశ 1950-60 అనుకుందాం.*
2. *ప్లీడర్లలాగా ఫీజులు పుచ్చుకునో, పుచ్చుకోకో ప్రజల తరపున నిజాయితీగా వాదించి, గెలిచినా, ఓడినా తాను నిమిత్త మాత్రుడననుకునేది రెండవ దశ, 1960-70.*
3. *మూడవదశ ప్రజలపై పెట్టుబడి పెట్టి, ఓట్లు కొనుగోలు చేసి, ఎన్నికలను వ్యాపారంగా మార్చి తాము ఖర్చుచేసిన దానికి అన్నో యిన్నో రెట్లు అధికంగా ప్రయోజనాలు గడించటంలో తప్పేమీ లేదు అని అనిపించుకునే ఆరంభ దశ, 1970-80.*
4. *ఎన్నికలలో ధనరూపేణా పెట్టుబడి పెరిగిన కొద్దీ రౌడీలను, మాఫియాలను వినియోగించాల్సిన స్థితి రావటం నాలుగవ దశ, 1980-90.*
5. *ఎన్నికలలో పెట్టుబడి అంటే దొంగ సొత్తే. (నల్లధనం అని దానికి ముద్దు పేరు) నల్లధనానికి పుట్టిన ముద్దుబిడ్డలే ఆకు రౌడీలు, మాఫియాలు. తామే స్వయంగా ఎన్నికల బరిలోకి దిగి ప్రజా ప్రతినిధులుగా రౌడీలు రాజకీయ రంగంలోకి రావటం (నలుపు తెలుపై పోవటం) ఐదవ దశ 1990-2000, అనుకుంటే*
6. *ప్రస్తుతం (2009 నాటికి) నడుస్తున్నది ప్రపంచీకరణం తెచ్చిపెట్టిన కార్పోరేట్ ప్యాకేజీ దశ ఆరవది. నేటి కాలపు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ కంపెనీలుగా మారిపోయి, ఒక్కొక్క రకం ఉచితాలను పథకాలుగా ప్రకటిస్తున్నాయి. ప్రజలు ఓట్ల పంటను అమ్ముకునేవారూ, కంపెనీలు తమ పథకాల రేట్ల మూటని అందించేవారూను!*

*రాజకీయ పార్టీలకు, ప్రజలకు నడుమ కేవలం వస్తుమార్పిడి సంబంధం, పచ్చివ్యాపార సంబంధం దశకు ఎన్నికల వ్యవస్థ చేరింది. భాజపా దీనికొంత మినహాయింపుగా పైకి కనిపిస్తుంది. అయినా వారు ప్రబోధించేది ఫాసిస్టు సంస్కృతి కనువైన ఫ్యూడల్, మత, ద్వేష సంస్కృతిని మాత్రమే! భారతీయ సంస్కృతిలో అదొక క్షీణ విలువ!!*

*కొత్తరూపాల్లో భూస్వామ్య వ్యవస్థ వేళ్ళు తన్నుకుంటోంది. అందులో భాగంగానే ఎన్నికల వ్యవస్థలో ఫ్యూడల్ వారసత్వ రాజకీయాలు 1980వ దశకం నుండి ప్రబలంగా రంగం మీదకు వచ్చాయి.*

*కాంగ్రెస్‌తో పోటీగా మరొక పాలకపక్షంగా భాజపా నిలదొక్కుకోవటానికి మతవిద్వేషమే వ్యూహాత్మక అజెండాగా అయోధ్య, గుజరాతు, కంధమాల్‌లను ఓట్ల, సీట్ల అధికారాన్ని నిలుపుకునే మార్గాలుగా అది రూపుదిద్దుకుంది.*

*వీటన్నిటికి తోడు తప్పనిసరిగా మద్యముండి తీరుతుంది. కులం, మతం, ప్రాంతం లాంటి ఉన్మాదాలను ప్రయోగించడమే కాక ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడం, వ్యాప్తి చేయటం ఎన్నికల వ్యవస్థకు ప్రత్యేక లక్షణంగా రోజురోజుకీ పెరిగిపోతోంది.*

*పాలక రాజకీయపార్టీలన్నీ దేశం పైన కాంగ్రెస్ రుద్దిన ప్రపంచీకరణ విధానాలను తమ తమ ఎజెండాలుగా స్వీకరించి సాగుతున్నవే తప్ప దానిని ధిక్కరించేవి, రూపుమాపే ఆశయం గలవీ లేవు.*

*సామ్రాజ్యవాద యుగపు పైతరహా క్షీణవిలువల రాజకీయ సంస్కృతికి చరమగీతం పాడకుండా, వెనుకబడిన దేశాల ప్రజలు ప్రజాస్వామిక ఆత్మవిశ్వాసంగల జాతీయ వ్యక్తిత్వంతో తలఎత్తుకు జీవించటం అన్నది సాగుబడిలో ఉన్న నేటి ఎన్నికల ద్వారా ఏనాటికైనా సాధించగలమా? అన్న ప్రశ్నతో పై వివరాలతో ఆ వ్యాసం సాగింది.*

*ఆ తర్వాత 2014లో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రం విభజన జరిగింది. అదే సంవత్సరంలో ఒకసారి, 2019లో మరొకసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అక్కడనుండి నరేంద్ర మోడీ, గుజరాత్ నమూనా, భారతీయ జనతా పార్టీ ముద్ర వేసుకుని దేశంలోని సమస్త రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నాయి.*

*అంతకుముందు వరకు సాగిన అఖిల భారత స్థాయి పాలక రాజకీయ పార్టీలు, రకరకాల స్థానిక రాజకీయ నాయకులు ఇంచుమించుగా అనుసరించింది కాంగ్రెస్ మార్కు ఎన్నికల సంస్కృతిని!*

*ఏడవ దశ ఎన్నికల రాజకీయం ప్రధానంగా భాజపా నమూనా కలది. అది గడిచిన పది సంవత్సరాలుగా ప్రజల ఆలోచనల మీద మానవ సంబంధాల మీద ఎలాంటి సాంస్కృతిక ప్రభావాలను కలిగిస్తోందో ఒకటొకటిగా పరిశీలిద్దాం!* **...రచయిత)**

# ఫ్యూడల్ రాజసూయము, కార్పొరేట్ ఫాసిజపు మిశ్రమంగా మోడీ కాలపు ఎన్నికల సంస్కృతి!!

నరేంద్ర మోడీ భారత దేశపు ప్రధాని కావటానికి పుష్కరకాలం ముందు గుజరాత్ రాష్ట్రంలో, మహాభారతంలో జనమేజయుడులా, ఒక సర్పయాగం లాంటిది చేశారు. దాన్ని నేను "గుజరాత్రంతా ద్వేష మంత్రపు రక్త హోమం" అని ఒక కవితలో చెప్పి ఉన్నాను. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. భాజపాతో పోటీలో కాంగ్రెస్‌తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), అసదుద్దీన్ ఓవైసీ నాయకుడుగా ఉండే మజిలీస్ పార్టీ కూడా రంగంలో ఉంది.

మోడీ ప్రధాని కావటానికి ముందు, గుజరాత్ నమూనా అనే పేరుతో అది దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అనుసరణీయమైనదిగా ప్రాచుర్యంలోకి వచ్చింది గనుక ప్రస్తుతం ఆ రాష్ట్రంలో సాగిన ఎన్నికల తీరు తెన్నులు తదితర పరిస్థితులతో మన చర్చను ప్రారంభిద్దాం.

గుజరాత్‌లో 2002లో మారణహోమం నిర్వహించిన దానిపై అభిశంసనగా, ఆనాడు అమెరికా ప్రభుత్వం నరేంద్ర మోడీకి తమ దేశపు వీసాను రద్దు చేసింది. ఆ సంఘటన గురించి భారత ప్రభుత్వం నేటికీ జవాబు చెప్పుకోవాల్సిన వార్తగా ఇటీవల పత్రికలలో తిరిగి ప్రత్యక్షమైంది. అందునా అది అమెరికా దేశానికి చెందిన అంతర్జాతీయ మత స్వేచ్ఛల కమిషన్ (USCIRF) వారి వ్యాఖ్య కావడంతో స్వయంగా భారత ప్రభుత్వం రంగంలోకి దిగి జవాబు చెప్పుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

పైన పేర్కొన్న అమెరికాకు చెందిన సంస్థ తమ "దేశ తాజా నివేదిక" (Country Update)లో భారత ప్రభుత్వం "ఒక విధానంగా మత స్వేచ్ఛల ఉల్లంఘనలో విపరీతంగా పాలు పంచుకోవడమో లేక వాటిని అనుమతించడమో" సాగిస్తోందని పేర్కొంది.

USCIRF వారి తాజా నివేదిక (22 నవంబర్ 2022) ప్రకారం మోడీ నాయకత్వాన గల భారత ప్రభుత్వం "భిన్నాభిప్రాయాలను తొక్కిపడుతూ, పౌర సమాజాన్ని బీటలు వారుస్తోందని" ప్రకటించడమే కాక "జర్నలిస్టులను, న్యాయవాదులను, హక్కుల రంగ కార్యకర్తలను, విద్యావేత్తలను, రాజకీయ నాయకులను, మైనారిటీ మతస్తులను ఇంకా ప్రభుత్వ విధానాల పట్ల విమర్శనాత్మక వైఖరి కల వారందరిపై" భారతదేశంలో అణచివేత సాగుతోందని తమ తాజా నివేదికలో పేర్కొన్నారు.

అయితే ఇవన్నీ ఇటీవల కాలం సాగుతున్న విధానాలపై విమర్శ. 2002 నాటి గోద్రా సంఘటన అనంతరం గుజరాత్‌లో ముస్లిం మైనారిటీలపై సాగిన ఘోర హత్యాకాండ ప్రస్తావన మళ్ళీ ఎందుకు వచ్చింది అంటే అమెరికన్ జర్నలిస్టు జమాల్ కషోగ్గిని హత్యగావించాడనే ఆరోపణపై సౌదీ అరేబియా రాకుమారుడు మహమ్మద్ బిన్ సల్మాన్ ప్రధానమంత్రి అయిన తర్వాత, అంతకుముందు రద్దు చేసిన వీసా ప్రకటనని ఉపసంహరించుకుని, అలాంటి రద్దు నుంచి సల్మాన్‌కు మినహాయింపు (Immunity) ఇచ్చినట్లుగానే, నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత ఆయనకు కూడా మినహాయింపు ఇచ్చి వీసా రద్దుని ఉపసంహరించుకున్నామని అమెరికా ప్రభుత్వ విదేశాంగ ప్రతినిధి వేదాంత పటేల్ 2022 నవంబరు 18వ తేదీన విలేకరుల ప్రశ్నలకు జవాబు నిస్తూ ప్రస్తావించినందుకు నిరసనగా భారత ప్రభుత్వం విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేయవలసి వచ్చింది. **(ది హిందు 25.11.2022)**

ఆ రోజుల్లో (2002) గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండిన మోడీని ఆనాటి భాజపా ప్రధానమంత్రి వాజపాయ్ "రాజధర్మం తప్పిన వానిగా" అభిశంసించగా, చంద్రబాబు నాయుడు ఏకంగా మోడీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ప్రకటించి, ఆ తర్వాత తూచ్ అన్న సంగతిని మళ్లీ ఒకసారి గుర్తు చేసుకుందాం.

గుజరాత్‌లో 27 సంవత్సరాలుగా కొద్ది మినహాయింపుతో భాజపా ప్రభుత్వమే కొనసాగుతోంది. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి అయిన మోడీ ప్రోత్సహించిన మతోద్వేగాల, ద్వేష రాజకీయ విధానాల ఫలితమే 2002 నాటి దాడులు. మైనారిటీలపై జరిగిన హత్యాకాండ కేసులకు ఉదాహరణగా ఇటీవల తిరిగి చర్చలలోకి వచ్చిన బిల్‌కీస్ బానొ సంఘటన ముఖ్యంగా చెప్పుకోవచ్చు. గుజరాత్ ప్రభుత్వ సిఫారసుతో బిల్‌కీస్ బానొ కేసులోని 11 మంది ముద్దాయిలను 75 ఏళ్ల అమృత మహోత్సవ స్వాతంత్ర్యం సందర్భంగా గత ఆగస్టు 15న జైళ్ల నుండి విడుదల చేశారు. దానిపై ఇటీవల దేశమంతా ఎంత అభిశంసన వ్యక్తమైనా భాజపేయులు ఇసుమంత కూడా సిగ్గు పడలేదు సరి కదా రేపిస్టులకు ఘన సత్కారాలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో ఆ రేపిస్టుల కుటుంబాలలోనివారినీ వారి విడుదలకు సిఫార్సు చేసిన బిజెపి ఎమ్మెల్యేని కూడా తమ పార్టీ తరఫున పోటీ చేయించడానికి సిద్ధపడ్డారు.

ఐదు నెలల గర్భిణిగా ఉన్న బిల్‌కిస్ బానో పై సామూహిక అత్యాచారం కావించి, ఆమె మూడేళ్ల కొడుకుతో సహా ఏడుగురు కుటుంబసభ్యుల్ని, మరొక ఏడుగురు సమీప బంధువుల్ని హత్యగావించిన నేరస్తులను విడుదల చేయటం సరైనది కాదని సిబిఐ కోర్టు కూడా వారి విడుదలకు ముందే స్పష్టంగా ప్రకటించింది. అయితే ఆ వార్త మీడియాలోకి ఆలస్యంగా వచ్చింది.

గుజరాత్ రాష్ట్రంలో మొత్తం పది శాతంకు కొద్ది తక్కువగా ముస్లిం మైనారిటీలు ఉన్నారు.

భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థులలో ఒక్క ముస్లింను కూడా పోటీలో నిలపలేదు. కాంగ్రెస్ పార్టీ 140 మందిలో ఆరుగురికి, ఆప్ పార్టీ 157లో ఇద్దరికీ సీట్లను కేటాయించారు. (నేటి గుజరాత్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి ఒకే ఒక ముస్లిం అభ్యర్థి గెలుపొందాడు)

సుమారుగా 25 నుండి 30 అసెంబ్లీ నియోజకవర్గాలలో ముస్లిం అభ్యర్థులు గెలవగలిగిన విధంగా వీరి జనాభా ఏర్పడి ఉంది. కానీ గడచిన 24 సంవత్సరాలలో భాజపా ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా అసెంబ్లీకి పోటీలో నిలపలేదు. 40 సంవత్సరాల క్రితం మాధవ సింగ్ సోలంకి హయాంలో 12 మంది ముస్లింలు అసెంబ్లీకి ఎన్నుకోబడ్డారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ ముస్లింలను అనేక రూపాలలో చీలికలకు గురిచేయడం పైన దృష్టి వదులుకోలేదు. గుజరాతి ముస్లింలలో కొన్ని తెగలవారిని బుజ్జగించి మరికొందరిని ఏకాకులను చేయటం అనే ఎత్తుగడ పాటిస్తున్నారు. తమ పార్టీని ఓడించగలిగిన వారికి ముస్లిం ఓట్లు పడకుండా చేయడం ఎలా అనే దృష్టితో బిజెపి తమ ముస్లిం మోర్చా ద్వారాను, మహారాష్ట్ర నుండి తమకు అనుకూలమైన 150 మంది ముస్లిం మోర్చా ప్రచారకులను దింపడం ద్వారాను ముస్లిముల ఓట్లను చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాదుకు చెందిన పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ మజ్లిస్ పార్టీని గుజరాత్ ఎన్నికలలో దింపి 14 నియోజకవర్గాల నుండి పోటీ పడుతున్నారు. అయితే పరోక్షంగా బిజెపికి సహాయపడే పాత్ర పోషిస్తున్నాడనే విమర్శలను ఆ పార్టీ ఎదుర్కొంటున్నది. ఇప్పటివరకు తెలంగాణ వెలుపలి రాష్ట్రాలలో 500 అసెంబ్లీ నియోజకవర్గాలలో మజ్లిస్ పార్టీ పోటీ చేస్తే అందులో పది మంది గెలిచారు. వారిలో కొందరు పార్టీలు కూడా మారారు.

ఇవన్నీ కూడా మోడీ స్వామ్యానికి ఒక నమూనాగా తీసుకోవాల్సిందే.

అవన్నీ అలా ఉండగా ఈరోజు, 25 నవంబర్ న హోం మంత్రి అమిత్ షా గుజరాత్ లో మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలను తిరిగి లేవకుండా 2002 నాటి మారణకాండను క్రూర అణచివేత చర్యలను, విధానాలను (బిల్కిస్ బానో కేసు కూడా అందులో ఒకటి) తమకు మహాగర్వకారణమైన అంశమన్నట్లు ఎన్నికల బహిరంగసభలో ప్రకటించారు. ఈ వాస్తవాన్ని సాక్ష్యంగా చెప్పినందుకే కదా పోలీసు ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్‌ను జీవితకాలపు జైలుశిక్ష పేరుతో శంకరగిరి మాన్యాలు పట్టించింది! అనేకమంది బాధితుల తరఫున న్యాయస్థానాలను తట్టి లేపినందుకే కదా హక్కుల కార్యకర్త తీస్తా సెతల్ వాడ్‌ను, ఆమెతో పాటు మరొక పోలీసు అధికారి శ్రీ కుమార్‌ను కేసులలో ఇరికించి అరెస్టు చేసింది? మత విద్వేషాలను భావజాలపరంగా రెచ్చగొట్టడమే కాక భౌతికంగా మారణకాండ సాగించటం ఒక విధానంగా 2002 తర్వాత కాలంలో దేశమంతా విస్తరించుకోవటం గుజరాత్ నమూనాలో భాగమైంది.

## రాజకీయాలలో భూస్వామ్య సంస్కృతి!

మన దేశపు రాజకీయాలలో ఒక ముఖ్యమైన అంశం భూస్వామ్య సంస్కృతి! మొత్తం దేశ జనాభాలో అలాగే ఓటర్లలోను కాస్త ఎక్కువ తక్కువగా సగం (50%) మంది మహిళలు ఉండగా, భాజపా 9% కాంగ్రెసు, ఆప్‌లు చెరి ఒక 7% వరకే గుజరాత్ రాష్ట్రంలో మహిళలకు అవకాశం ఇచ్చారు. దేశవ్యాప్తంగా చట్టసభలలో మహిళలకు ఉన్న సగటు ప్రాతినిధ్యం 15 శాతం కంటే తక్కువ అయితే, 19 రాష్ట్రాల్లో పది శాతం కంటే తక్కువ మంది ఉన్నారు. సమాజంపై ఫ్యూడల్ సంస్కృతీ ప్రభావాన్ని ఒక మేరకు అంచనా కట్టటానికి విభిన్న సామాజిక రంగాలలో మహిళల స్థానం ఎంత ఉంది అనేదొక ప్రాతిపదిక.

అలాగే రాచరిక యుగపు వారసత్వ కుల వృత్తులను అలా ఉంచి, ముఖ్యంగా రాజకీయ రంగంలో వారసత్వం కూడా ఫ్యూడల్ సంస్కృతీ ప్రభావాన్ని అంచనా కట్టే ఒక పరికరమే!

నెహ్రూ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ వారిని ఇరకాటంలో పెట్టడానికి నరేంద్ర మోడీ వారసత్వపు రాజకీయాలు "ప్రజాస్వామ్య వ్యవస్థకు మొదటి శత్రువని" విమర్శిస్తూ ఉంటారు. అలాంటి నీతి బోధలు ఆయన ప్రతినిత్యం చేస్తున్నారు. రాహుల్ గాంధీని రాకుమారుడు (షహజాదా) అనీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రోజుల్లో వారిని "ఢిల్లీ సుల్తాన్ల"ని అనేవారు. అయితే భాజపా ఫ్యూడల్ సంస్కృతి పునరుద్ధరణకు కంకణం కట్టుకున్న పార్టీ అని మనకు తెలుసు. అది ఫ్యూడల్ సంస్కృతిలో భాగమైన వారసత్వపు రాజకీయాలకు ఆచరణలో వ్యతిరేకం కాదు, దానికి దూరంగానూ లేదు.

వారి మద్దతుతోనే కర్ణాటకలో ముఖ్యమంత్రి అయిన బసవరాజ్ బొమ్మైని వారసత్వపు రాజకీయాలకు చక్కటి ఉదాహరణగా చెప్పవచ్చు. వారసత్వపు రాజకీయాలకు అతీతంగా ఒక్క రాష్ట్రంలో కూడా భాజపా అధికారాన్ని చేపట్టలేదన్నది వాస్తవం. ఇతర పార్టీల నుండి తమ పార్టీలోకి దిగుమతి చేసుకున్న వారిలో దుష్యంత్, పంకజ్ సింగ్ ఠాకూర్, పూనమ్ మహాజన్, జయంతి సిన్హా, ప్రవేశ్ వర్మ ఇలాంటి వారంతా వారసత్వ రాజకీయులే. పేరున్న కాంగ్రెస్ నాయకుడు జతీంద్ర ప్రసాద్ కుమారుడు జితిన్ ప్రసాద్‌ని తమ పార్టీలోకి ఆహ్వానించారు. మన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధినేతయిన ఎన్టీ రామారావు కూతురు పురందేశ్వరి, మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో కాంగ్రెస్ మంత్రిగా పనిచేసి ఇప్పుడు బిజెపి నాయకురాలుగా ఉన్న సంగతి మనకు తెలుసు.

ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో 182 నియోజకవర్గాలలో 20 మంది అభ్యర్థులు ప్రత్యక్ష వారసత్వ రాజకీయులు. అందులో 13 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన వారైతే ఏడుగురు భాజపా వారు. బిజెపి ప్రతినిధి మాన్సింగ్ పరివార్ (రాజపుట్) చెప్పిన ప్రకారం ఆయా నియోజకవర్గాల కులాల వారి ఓటర్లను పరిగణలోకి తీసుకుని ప్రతినిధులకు సీట్లను కేటాయించాం కనుక విజయం తమనే వరిస్తుంది అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు. కులాల బలాబలాలను గత ఎన్నికలలో సరిగా అంచనా వేయలేకపోయి నందుకు కాంగ్రెస్ వారి అభ్యర్థుల నుంచి ఓటమిని ఎదుర్కొన్నామని కూడా ఆయనే చెప్పారు.

భాజపా వారు అనుసరించే మత విద్వేష రాజకీయాలకు, వారసత్వ, కుల సంబంధిత భూస్వామ్య సాంస్కృతిక అంశాలను సినీతారలను అనుబంధంగా వినియోగించడం సర్వసాధారణం. ఇదేమి వారి గుత్త సొమ్ము కాదు. పాలక రాజకీయ పక్షాలన్నీ ఒక లెక్కాచారంగా (Calculatedగా) వీటిని పాటిస్తూనే ఉంటాయి. ఇలాంటి వాటిలో మన అర్ధఫ్యూడల్ సమాజపు పోకడను జాడలను చూడవచ్చు.

## గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో కోటీశ్వరులు! :

ప్రజాస్వామిక సంస్కరణల కోసం 1999లో ఏర్పడిన సంస్థ (ADR) ప్రకారం డిసెంబర్‌లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ

చేస్తున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థులలో నూటికి ఎనభై ఐదు మంది కోటీశ్వరులు! వారి మొత్తం సరాసరి సంపత్తి 16.6 కోట్ల రూపాయలు.

పై ప్రజాస్వామిక సంస్థ ప్రతినిధి మేజర్ జనరల్ అనిల్ వర్మ విడుదల చేసిన ప్రకటన ప్రకారం "అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ధన సంపన్నులకే అత్యధికంగా సీట్లను కేటాయించినందువల్ల నేడు జరగనున్న ఎన్నికలలో ధనం పాత్ర దాని ప్రభావం ఎంత శక్తివంతమైనవో స్పష్టంగా మనం గ్రహించవచ్చు." రూ॥ 661 కోట్ల సంపద గల జయంతి భాయ్ సోంభాయి పటేల్, రూ॥ 372 కోట్ల బలవంత సింగ్ చందన్ సింగ్ రాజపుట్‌లు భాజపా తరఫున రంగంలో ఉండగా మొత్తం ఆ పార్టీ అభ్యర్థులు 182 మందిలో 154 మంది కోటీశ్వరులు. అదే కాంగ్రెస్ పార్టీ పోటీకి నిలిపిన 179లో 142 మంది (79%), ఆమ్ ఆద్మీ వారి 181 మందిలో 68 మంది (38%) కోటీశ్వరులై ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులలో అతి పేదవాడు ఇటీవలే ఆ పార్టీలో చేరిన, 9.3 లక్షల ఆస్తిని ప్రకటించిన జిగ్నేష్ మేవాని. గత ఎన్నికలలో కంటే ఈసారి కోటీశ్వరుల సంఖ్య, శాతం కూడా ఎక్కువ.

ఎన్నికలలో నిలబడిన వారు చూపించే ఆస్తులు ఎంత తక్కువ ఉంటాయి అంటే ఆదాని లాంటి అత్యంత సంపన్నుల ఒక గంట ఆదాయంతో కూడా అవి సరికాదు. బిలియనీర్లు అంటే ఎనిమిది వేల కోట్ల రూపాయల ఆస్తులు పైబడినవారు! ఒక గుజరాత్‌లోనే 10 సంవత్సరాల క్రితం అలాంటి బిలియనీర్లు ఐదుగురు మాత్రమే ఉండగా ఇప్పుడు మొత్తం దేశంలోని 166 మందిలో 86 మంది బిలియనీర్లు గుజరాత్‌లో ఉన్నారు. అంటే దేశం మొత్తంలోనే సగం మంది కంటే ఎక్కువ. మోడీ ప్రధానమంత్రిగా అధికారంలోకి రాకముందు ప్రపంచ ఆస్తిపరులలో 133వ స్థానంలో ఉండిన ఆదాని ఇప్పుడు రెండవ లేక మూడవ స్థానం పొందగలిగాడు. ప్రపంచంలోనే మొదటి పదిమంది కుబేరులలో గుజరాతీయులు ఇద్దరు ఉంటే భారతదేశంలో నలుగురున్నారు. దేశమంతా తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలి అంటే గుజరాత్ స్థావరాన్ని సుస్థిరపరుచుకోవాలి. అందుకు ఎలాంటి దుష్ట యత్నాలు అయినా వారికి పట్టింపు లేదు.

కొత్తగా ఏర్పడిన గుజరాత్ ప్రభుత్వంలోని 17 మందిలో 16 గురు కోటీశ్వరులు. ఒక్క మాటలో గుజరాత్ నమూనా అంటే అధికార కేంద్రీకరణ, ఆర్థిక కేంద్రీకరణ మతతత్త్వ విద్వేష రాజకీయాల కేంద్రీకరణ అన్నమాట!

## గుజరాత్ ఎన్నికలలో నేరస్తులు! :

ఎన్నికలలో నేరస్తులకు టిక్కెట్లు ఇవ్వటంపై సుప్రీంకోర్టు విడతలు విడతలుగా ఆగ్రహాన్ని ప్రకటిస్తూనే ఉంది. అయినా నేరస్తులకు స్థానం దొరుకుతూనే ఉంది.

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ADR) వారి నివేదిక ప్రకారం గుజరాత్ రాష్ట్రంలో 2017 ఎన్నికలలో పోటీ చేసిన వారిలో నేరస్థ చరిత్ర ఉన్నవారు 238 మంది అయితే ఇప్పుడు 2022లో 330 దాకా (20%) పెరిగారు. తీవ్రమైన నేరారోపణలు ఉన్న 192 మందిలో ఆప్ – 43; కాంగ్రెస్ – 28; బిజెపి 25 మంది ఉండగా మొత్తంగా నేరారోపణలు ఎదుర్కొంటున్నవారిలో, ఆమ్ ఆద్మీ 61 మంది ఉంటే కాంగ్రెస్ – 60; భాజపా – 32 మంది ఉన్నారు.

ADR వారి ప్రకారం "చెప్పదగిన సహేతుకమైన కారణాలు ఏమీ లేకున్నా నేరచరిత్ర ఉన్న వారిని ఎన్నికలలో ఎందుకు నిలబెడతారో తెలియదు. పైన పేర్కొన్న వివరాలను బట్టి మన రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యవస్థను సంస్కరించటం పట్ల ఎలాంటి ఆసక్తి లేదు. చట్టాన్ని ఉల్లంఘించేవారే చట్టాలను రూపొందించే ప్రక్రియ ఇంకా కొనసాగుతుంది".

ఎన్నికల అనంతర గుజరాత్ ప్రభుత్వంలోని 17గురు మంత్రులలో నలుగురు చట్టబద్ధంగా (క్రిమినల్) నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు ఉండగా, ఎమ్మెల్యేలలో 29 మందిపై హత్య, అత్యాచారం లాంటి తీవ్ర నేరారోపణలతో సహా మొత్తం 40 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో భాజపా ప్రథమ స్థానంలో ఉండగా కాంగ్రెస్, ఆప్ వారు కూడా ఉన్నారు.

## మరికొన్ని చేదు నిజాలు :

15 ఏళ్ల పాటు భాజపాలో ఉండి దాని పట్ల విముఖత పెంచుకున్న తెలుగువాడైన సూరత్ నివాసి పి. వి. యస్. శర్మ చెప్పిన ప్రకారం : 'గుజరాత్ నమూనా అంటే ఏమనుకుంటున్నారు? అత్యంత ఉన్నత స్థాయిలో రాజకీయ అవినీతి చలామణి కావడమే; మంత్రులు, తంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల నుంచి కార్పొరేటర్లు, పోలీసుల వరకు అవినీతి విచ్చలవిడిగా సాగడం; మీడియా, న్యాయవ్యవస్థ, ఏజెన్సీలను పట్టులో ఉంచుకోవడం, ప్రతిపక్షాలను కొనేయడమే" –

**(ఏ కృష్ణారావు; ఇండియా గేట్ : 23-11-2022)**

గుజరాత్ రాష్ట్రంలోని మోర్బిలో ఇటీవల జరిగిన గొలుసు వంతెన ప్రమాదంలో 50 మంది పైగా పసిపిల్లలతో సహా 141 మంది మరణించడం వెనక అధికారము, అవినీతి కలగలిసి పోవటాన్ని దేశమంతా గుర్తించింది.

మానవ అభివృద్ధి సూచికల ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జాబితా 36లో, గుజరాత్ 21వ స్థానంలో ఉంది, మణిపూర్, నాగాలాండ్‌ల కంటే గుజరాత్ ఈ విషయంలో ఎంతో వెనుకబడి ఉంది. ప్రధానమంత్రి నేతృత్వంలోని నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం కూడా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల విషయంలో గుజరాత్ పదవ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రం పేదరిక నిర్మూలన విషయంలో 16వ స్థానం, ఆకలి సూచీలో 18వ స్థానం, నాణ్యమైన విద్య విషయంలో 17వ స్థానం, స్వచ్ఛమైన ఇంధనం విషయంలో 19వ స్థానంలో ఉన్నదని నీతి ఆయోగే ప్రకటించింది.

వ్యవసాయ కూలీలకు, వ్యవసాయేతర నిర్మాణరంగ కార్మికులకు గుజరాత్‌తో సహా భాజపా పాలిత రాష్ట్రాలలో చాలా తక్కువ కూలీ లభిస్తోంది. గుజరాత్ లో రోజుకి 220 రూపాయలు కూలి, లభిస్తుంటే అదే కేరళలో రోజుకు 725రూపాయలు పొందగలుగుతున్నారు.

గుజరాత్ నమూనా పేరుతో పాలకులు చేస్తున్న ప్రచారానికీ, వాస్తవాలకూ మధ్య తేడా ఎంతో ఉంది.

'ఆంధ్రజ్యోతి' 23 నవంబర్ 2022న రాసిన ప్రకారం కార్పొరేట్లు, ప్రభుత్వం కలిసి పనిచేయడం గుజరాత్ సంస్కృతిలో భాగం. బడా కంపెనీలు అక్కడ చవక ధరలకు భూసేకరణ చేయడం అతి సులభం. పన్నురాయితీలు, తక్కువ వేతనాల ద్వారా వారికి ప్రభుత్వం పలు ప్రయోజనాలను చేకూరుస్తోంది.

**(మిగిలిన అంశాలు తర్వాత సంచికలో)**


పుస్తక పరిచయం

# 'నన్ను నడిపించిన చరిత్ర'

## వకుళాభరణం రామకృష్ణ స్వీయగాథ

- కొత్తపల్లి రవిబాబు

**ఒక** చరిత్రకారుడి స్వీయచరిత్ర ఇది. చరిత్ర అంటే కేవలం 'మతలబులూ, కైఫీయతులూ, ఆ రాణీ ప్రేమ పురాణం, ఈ ముట్టడికైన ఖర్చులూ' మాత్రమే కాదు – ఆనాటి సామాజిక, ఆర్థిక, నైతిక, సాంస్కృతిక అంశాలు ముఖ్యమని నమ్మి, చరిత్ర పుస్తకాలు రాసి, చరిత్రను బోధించిన మన సమకాలికుడు వకుళాభరణం రామకృష్ణ స్వీయచరిత్ర ఇది. కనుక తప్పనిసరిగా ఆయన జీవితంలోని సంఘటనలతోపాటు సమాజ చరిత్ర కూడా పాఠకులు దీనిలో చూడగలరు. తన ముందుమాట 'జ్ఞాపకాలు ఎందుకు రాశాను?'లో "వ్యక్తిగత జీవిత చరిత్రల పొరల్లో దాగి, పరిసరాల, ప్రాంతీయ దేశ చరిత్రల ఆనవాళ్ళు వుండవా? స్వీయ జీవితచరిత్రకారుడు వీటిని తన 'కథ'లో స్పృశించడా" అంటూ ఆయన ఒక రెటారికల్ ప్రశ్న (Rhetorical) వేశారు. వాటన్నిటినీ స్పృశిస్తూ రామకృష్ణ రాసిన స్వీయగాథ ఇది.




అర్చక వృత్తిలోనున్న శ్రీ వైష్ణవుల కుటుంబం వారిది. దర్శికి ఆరుమైళ్ళ దూరంలో వున్న కుగ్రామం పొతకమూరు స్వగ్రామం. మూడు గుడులూ, ఒక పెద్ద మసీదు వున్న ఆ గ్రామంలో వున్న బ్రాహ్మణ కుటుంబాలు నాలుగైదే. తాత, తండ్రి అర్చకత్వం చేసినా వచ్చే ఆదాయం తక్కువ. దానికి తోడుగా తండ్రి ఆయుర్వేద వైద్యం చేస్తూ కొంత సంపాదించేవారు. రామకృష్ణ 1938 మే 15న అమ్మమ్మగారి వూరు రామభద్రాపురంలో పుట్టారు. తండ్రి పొతకమూరు నుండి పాకలలోని దేవాలయం అర్చకత్వం కోసం వలస వెళ్ళారు. కందుకూరు తాలూకాలోని పెద్ద గ్రామాల్లో పాకల ఒకటి. సముద్ర తీరప్రాంతం. సింగరాయకొండకు నాలుగు మైళ్ళు. ఈ గ్రామాలలోని ఆనాటి జీవన విధానాన్ని రామకృష్ణ కళ్ళకు గట్టినట్లు చిత్రించారు. పాకలలో సుబ్బయ్య పంతులు వీధి బడిలో ప్రాథమిక విద్య ప్రారంభించి కందుకూరులో బాపనయ్య బడిలోనూ, ఆ తర్వాత హైస్కూలులో ఆయన చదువు కొనసాగింది. కందుకూరి నుండి పాకలకు జట్కాబండిలోనూ, బొగ్గు బస్సులోనూ ప్రయాణం చేస్తుండేవారు.

బొగ్గు బస్సులో కిటకిటలాడే ప్రయాణీకులతో చేసే సరదా ప్రయాణాలు, జట్కాలాగే గుర్రం పరుగులోని రిథం, ఆనాటి పిల్లల ఆటపాటలు, సంక్రాంతి పండుగ సంబరాలూ, తంపటవేసిన తేగలు తినడం, రోళ్ళల్లో బియ్యం దంపుతున్న శబ్దాలు, బెల్లపు అరిసెలు, పశువులకు అలంకారాలు, జడ కోలాటాలు, గంగిరెద్దులు, పగటివేషాలు, తెల్లార్లూ సాగే భాగోతాలు – దీపావళి, వినాయకచవితి పండుగలు, ముస్లిం కుటుంబాలతో కలసి మెలసి సాగటం, వారి పీర్ల పండుగ, హరిదాసులు హరికథలు – ఆనాటి గ్రామీణ సంస్కృతిని, జీవితాన్ని రామకృష్ణ ఈ పుస్తకంలో చిత్రించారు.

నెల్లూరు, సింగరాయకొండల్లో హైస్కూలు చదువు 1953తో ముగిసింది. 1948–51 మధ్యకాలంలో దేశ రాజకీయాలు, కమ్యూనిస్టుపార్టీ ఎదుర్కొన్న ఎగుడుదిగుడులు, అది చేపట్టిన భావవికాస ఉద్యమ ప్రభావం రామకృష్ణపై ఉంది.

ఆ తర్వాత రామకృష్ణ విద్యాభ్యాసమంతా అభ్యుదయ భావాల్తో నిండిన కావలి విశ్వోదయ కళాశాలలో (తర్వాత జవహర్ భారతి) ఇంటర్మీడియట్, బి.ఏ.(1953–1957), విజయవాడ ఎస్.ఆర్.ఆర్.లో మొదటి సంవత్సరం బి.ఏ. – తర్వాత కావలి కళాశాలలో కొనసాగింపు, విశాఖలో ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో ఎం.ఏ. (హిస్టరీ), 1959లో కావలి కళాశాలలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించడం, 1961లో లలితగారితో శాఖాభేదమున్నా 'సంప్రదాయ' ప్రేమ వివాహం వరకు సాగిన వీరి జీవితకాలంలోని అనుభవాల పరంపరను మనకందించారు. విజయవాడలో ఆయన విశ్వనాథ సత్యనారాయణ చెప్పిన పాఠాలు విన్నారు. కావలి కళాశాలలో వీరి అధ్యాపకులుగా భుజంగరాయశర్మ, పెద్దాడ రామస్వామి, కె.వి. రమణారెడ్డి మొదలగు దిగ్గజాలు వుండేవారు. ఢిల్లీలో ప్రథమ అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవాలలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయ బృందంలో కావలి కళాశాల నుంచి ఎంపిక చేసిన సాంస్కృతిక దళం ప్రదర్శించిన ఒకటి, రెండు నాటికలలో రామకృష్ణ నటించారు. ఈ బృందంలో వున్న లలితతో సాన్నిహిత్యం పెరిగింది. వాల్తేరులో ఎం.ఏ. చదువుతూ డిబేట్లు, మాక్ పార్లమెంటు, మాక్ అసెంబ్లీ, ఇతర కార్యక్రమాలలో పాల్గొనడం, విద్యార్థి ఫెడరేషన్ ఉద్యమాలలో మునిగి విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో ఫెడరేషన్ తరపున పోటీ

చేసి గెలుపొందడం, ఆంధ్రాభ్యుదయోత్సవాల నిర్వహణ రామకృష్ణకు ఎన్నో అనుభవాలను నేర్పాయి. ఆనాటి తరంలోని అభ్యుదయ భావాలు గల యువతరపు అనుభవాలన్నిటినీ మనకి తెలియచేశారు.

విద్యార్థులకు అందించే సేవల గురించి (స్టూడెంట్స్ సర్వీసెస్) అమెరికాలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎన్నికై, రామకృష్ణ మొదటిసారిగా 7 గంటల నాన్‌స్టాప్ విమాన ప్రయాణం చేశారు. రెండురోజుల వ్యవధిలో పాస్‌పోర్ట్, వీసా లభించినా, అది అయిష్టమైన ప్రయాణం. వృద్ధులైన తల్లిదండ్రులని వదలి వెళ్ళాల్సి రావటం, ఏడవ నెల గర్భిణీతో, ఎం.ఏ. పరీక్షలు రాయడానికి తిరుపతిలో ఉన్న భార్యనూ, 3 ఏళ్ళ కొడుకు రాజగోపాల్‌ను తల్లిదండ్రుల వద్దే వదిలేసి వెళ్ళటం ఆయనకు కష్టంగా అన్పించింది. ఈ అవకాశం రాకుండా వుంటే ఎంత బాగుండేది అనుకున్న రామకృష్ణ బ్లూమింగ్టన్ దగ్గర ఎర్ల్‌హామ్ కళాశాలకు చేరారు. కళాశాల పాలనాపద్ధతిని అధ్యయనం చేశారు. అక్కడ సమాజంలో వున్న 'సేవాసంస్కృతి', 'శ్రమ సంస్కృతి', 'వస్తు వ్యామోహ సంస్కృతి'ని గమనించారు. వారంరోజుల తర్వాత '26 వేలమంది విద్యార్థులు, 20 లక్షల పుస్తకాల గ్రంథాలయం, 200 ఎకరాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలలో, దట్టమైన పెద్ద చెట్ల మధ్య వున్న బ్లూమింగ్టన్ యూనివర్శిటీని, నల్లజాతీయుల పేదరికాన్ని గమనించారు. బఫెలో యూనివర్శిటీ, క్యాంటీన్‌లో నోబెల్ బహుమతి గ్రహీత అందరితోపాటు క్యూలో నిలబడి వుండటం చూసి ఆశ్చర్యపడ్డారు. 2 నెలలపాటు అనేక కళాశాలలు, యూనివర్శిటీలూ తిరిగిన రామకృష్ణకు చరిత్ర విద్యార్థిగా ఈ ఐరోపా పర్యటన ఎంతో సంతృప్తి కలిగించింది.

1967 నుండి విశ్వోదయ కళాశాలలో మరల బోధనా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఆ కళాశాల పేరు జవహర్ భారతిగా మార్చడం, రెక్టార్ డి.ఆర్.కూ ప్రిన్సిపల్స్‌కూ మధ్య భేదాభిప్రాయాలు రావటం, అదే కాలంలో విప్లవ రచయితల సంఘం ఆవిర్భావం, దానిలో సహోధ్యాపకుడు కె.వి.ఆర్. కీలకపాత్ర, నక్సలైట్ ఉద్యమం, ఢిల్లీ జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్‌కు పరిశోధనా విద్యార్థిగా చేరడం రామకృష్ణ జీవితంలో మరో ఘట్టం. సామ్యవాద భావాలేగాక, ప్రజాస్వామిక, ఉదార, లౌకిక, అభ్యుదయ భావాల జవహర్ భారతి నుండి అవే భావాలు గల జె.ఎన్.యూలో విద్యార్థిగా చేరడం, ఆ తర్వాత అటువంటి సుగుణాలలో కొన్నైనా వున్న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పనిచేయడం రామకృష్ణకు లభించిన అవకాశం.

తన చుట్టూ వున్న సామాజిక జీవితాన్ని వీరేశలింగం శుభ్రం చేసిన విషయంపై పరిశోధన చేయమని సర్వేపల్లి గోపాల్ ఇచ్చిన సలహాతో, దానికి సంబంధించిన విషయ సేకరణ చేసి, అధ్యయనం చేసి 1974 డిసెంబర్ నాటికి పరిశోధనా వ్యాసాన్ని యూనివర్శిటీకి సమర్పించారు. ఆ తర్వాత 1975లో ప్రారంభించి 1977 జులై నాటికి 'ఆంధ్రలో సంఘసంస్కరణ ఉద్యమాల'పై డాక్టరేట్ పొందారు. 1978లో ప్రొఫెసర్ గోపాల్ సెలవు పెట్టగా, యూనివర్శిటీవారి ఆహ్వానంపై ఏడాదిపాటు అధ్యాపకునిగా జె.ఎన్.యులో చేశారు. 1981 జూన్‌లో అనివార్య పరిస్థితుల్లో జవహర్ భారతిలో ప్రిన్సిపల్‌గా చేరి 1985 వరకు వున్నారు. ఆ తర్వాత హైదరాబాద్ యూనివర్శిటీలో రీడర్‌గా చేరి 1988లో ప్రొఫెసర్ పదవి పొందారు. 1992లో సరోజినీనాయుడు (SN స్కూలు) ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, కమ్యూనికేషన్, డాన్స్ అండ్ థియేటర్‌కు డీన్‌గా చేరి ఒకటిన్నర సంవత్సరం పనిచేశారు. ఆ సమయంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆహ్వానిత ప్రొఫెసర్‌గా నాలుగు నెలలు అక్కడ విద్యార్థులతో గడపటం ఒక ఆసక్తికరమైన విషయం. 1998లో నలభై సంవత్సరాల అధ్యాపక జీవితం గడిపి 60వ యేట ఉద్యోగం నుంచి రిటైరయ్యారు. అయినా బోధనపై 'కుతి' తీరక ఆ ఏడాదే స్థాపించిన నల్సార్ (నేషనల్ లా యూనివర్శిటీ)లో చరిత్ర అధ్యాపకునిగా చేరి 2008లో 70వ యేట రిటైరయ్యారు.

రామకృష్ణ సహచరి లలిత వివిధ ఉద్యోగాలు చేసి, గిరిజనులపై క్షేత్ర పరిశోధనలు చేసి, డాక్టరేట్ సంపాదించారు. 1998లో రిటైరయ్యారు. 2010లో అనారోగ్యానికి గురై 2017లో మరణించారు. వారి మరణం రామకృష్ణను ఎంతో కృంగతీసింది. ఆమె కోర్కె తీర్చడానికే ఆయన తన స్వీయగాథ రాసి 2022 ఫిబ్రవరిలో ప్రచురించారు.

పుస్తకం చివర్లో 1997లో చేసిన జర్మనీ పర్యటన 2004లో భార్యాసమేతంగా పిల్లల దగ్గరకు అమెరికా వెళ్ళడం, 2018లో ఒంటరి జీవితం భారంగా గడుపుతుండగా పిల్లల వత్తిడితో మరల అమెరికా వెళ్ళడం, మనవసంతానంతో కాలక్షేపం చివరిపేజీలలో రికార్డుచేశారు.

రామకృష్ణ జీవితంలో పెనవేసుకుపోయిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సంస్థల కృషిలో తన కృషిని ఈ స్వీయగాథ చివర్లో వివరించారు. రిటైరైన తర్వాత ఇతర మిత్రులతో, సంస్థలతో కలసి 'తెలుగువారి సమగ్ర చరిత్ర, సంస్కృతి' (క్రీ.పూ. 500 నుంచి క్రీ.శ. 2000) దాకా ఎనిమిది సంపుటులకు ప్రధాన సంపాదకునిగా ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ తయారుచేసి ప్రచురించిన విశేషాలు తెలియచేశారు. 19 సంవత్సరాలపాటు 1998 నుండి 2017 వరకు, సాగిన ఈ చారిత్రక యజ్ఞానికి సహకరించిన రచయితలను, ఆర్థిక సహాయం అందించిన దాతలను, ప్రచురించిన ప్రచురణకర్తలను, తెలుగులోకి అనువదించిన అనువాదకులను తలచుకున్నారు. మొదట్లో అనుకున్న 8 సంపుటాలేగాక వేయి పుటలతో ఈ చరిత్రకు 'సమగ్ర ఆధారాల సంపుటి' కూడా తొమ్మిదవ భాగంగా విడుదల చేశారు.

ఇవిగాక 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 42వ వార్షిక పరిశోధనా పత్రాల' సంపుటాలను ఆ సంస్థ వెలువరించింది. మనసు ఫౌండేషన్ ఈ రచనలన్నిటినీ డిజిటలైజ్ చేయడానికి అంగీకరించింది. దీర్ఘకాలిక చరిత్ర కల్గిన ఎ.పి. హిస్టరీ కాంగ్రెస్ సంస్థను భావితరాలు కాపాడుకోడానికి 'కార్పస్ ఫండ్' ఏర్పరచే ఆలోచన, ఆకాంక్షను వెలిబుచ్చారు.

తన స్వీయగాథ చెబుతున్న క్రమంలోనే రామకృష్ణ సమకాలీన చరిత్రలో భాగమైన ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ హత్య, తెలుగుదేశం పార్టీ, సారా వ్యతిరేక ఉద్యమం, విద్యారంగంలో మార్పులు, నక్సలైట్లతో చర్చలు, మండల్ మందిర్ ఉద్యమాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, భార్య లలిత చదువు, ఉద్యోగాలు, రచనలు మొదలైన విషయాలను ఈ గ్రంథంలో ప్రస్తావించారు.

భార్య లలితకిచ్చిన మాటకోసం ఈ జ్ఞాపకాలు రాసానని ముందుమాటలో చెప్పిన రామకృష్ణ, చివర్లో 'కథ ముగిసింది' అనే శీర్షికతో 'మహాసంస్కర్తల వారసురాలి'గా కనుమరుగైన లలితను తలచుకుంటూ ముగించారు.

ఒక తరంవారి వైభవోపేతమైన సృజనాత్మకత, నిజాయితీ, సమాజ సంస్కరణాభిలాష, ఉద్యమ జీవితం తెలుసుకోడానికి చదవాల్సిన పుస్తకం, "నన్ను నడిపించిన చరిత్ర".

ఎమెస్కో ప్రచురించిన ఈ పుస్తకం అచ్చుతప్పులు లేకుండా చక్కగా వుంది. అందుకు వారు అభినందనీయులు.

13వ పుటలో ఒక చిన్న వాక్యం మాత్రం ఇంగ్లీషు వాక్యనిర్మాణ శైలిలో ఉన్నది. ఆ వాక్యం ఇది. "ఆ తర్వాత ఈ గ్రామానికి ఎప్పుడు నీటివసతి వచ్చిందో అప్పుడు పరిస్థితి మారింది". – ఆ వాక్యం తెలుగు వాక్యనిర్మాణంలో ఇలా వుండాలి. "ఆ తర్వాత ఈ గ్రామానికి నీటివసతి వచ్చినపుడు పరిస్థితి మారింది". అని –

34వ పుటలో – అరసం సాహిత్య పాఠశాల నిర్వహించిన గ్రామం పేరు పొరపాటున పెదవడ్లపూడి అని రాశారు. అది పెదపూడి – తెనాలికి దక్షిణాన వున్న గ్రామం. పెదవడ్లపూడి తెనాలికి ఉత్తరాన వున్న గ్రామం.

**('నన్ను నడిపించిన చరిత్ర'** – వకుళాభరణం రామకృష్ణ స్వీయచరిత్ర.
**మొదటిముద్రణ : ఫిబ్రవరి 2022. ఎమెస్కో ప్రచురణ.**
**1/8 డెమ్మీ 212 పుటలు. వెల : రూ. 150/–**
**ప్రతులకు : ఎమెస్కో, హైదరాబాదు, విజయవాడ.**
**email : emescobooks@yahoo.com;**
**emescovja@gmail.com)**

## ప్రజాసాహిత్యకారుడు, నాటకకర్త
# వారాల కృష్ణమూర్తికి జోహార్లు



**రచయితగా,** కళాకారునిగా సాహితీలోకానికి, కళారంగానికి పరిచయమైన వారాల కృష్ణమూర్తి 17-12-2022న హైదరాబాద్‌లో మెట్లమీద నుండి జారిపడి తలకు దెబ్బతగిలి మరణించారు. ఆయన చిత్తూరు జిల్లాలో 1-7-1950లో జన్మించారు.

వారాల కృష్ణమూర్తి చిత్తూరుజిల్లాను వదలి హైదరాబాద్ A.G. ఆఫీసులో ఉద్యోగంలో చేరినప్పటి నుండి మరణించేవరకు ప్రజాపక్ష రచయితగా, ప్రజలను చైతన్యవంతం చేసే వివిధ సాహితీ సాంస్కృతిక రూపాలలో కృషిచేస్తూ రాజీపడకుండా జీవించారు. జనసాహితి జంటనగరాలశాఖ నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనేవారు. అన్ని కార్యక్రమాలకు సహకరించారు. 'ప్రజాసాహితి' పత్రికకు సలహాలు ఇచ్చేవారు. రచనలు పంపేవారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలపై స్పందిస్తూ జనసాహితి నిర్వహణలో రచయితలు రైతులను కలసిన బృందంలో వారాల కృష్ణమూర్తి వున్నారు. పర్యటన తర్వాత కృష్ణమూర్తిగారి ఇంటి వద్దనే టీము సభ్యులంతా సమావేశమైనపుడు ఆయన రైతాంగ స్థితిగతులపై ఎంతో ఆవేదన చెందారు. రిపోర్టు రచనలో పాల్గొన్నారు. ఆ స్పందనకు ప్రతిరూపమే 'యాది' కథ. 2005 సెప్టెంబర్ – నవంబర్‌లో "గ్రామీణ జీవన విధ్వంసం – రైతాంగ ఉద్యమం" శీర్షికతో తెచ్చిన 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికలో ఆయన 'యాది' కథను ప్రచురించారు. ఆనాటి నుండి జనసాహితితో ఆయనకు గట్టి అనుబంధం ఏర్పడింది.

కృష్ణమూర్తి 'దేవరదున్న' కథల సంపుటిని ప్రచురించారు. 'యాది' వంటి ఎన్నో కథలతోపాటు కారాగారి 'చావు', గోపీచంద్ 'పతితులు' మొదలైన కథల్ని నాటకలుగా మలచి వివిధ యూనివర్శిటీల్లో ప్రదర్శనలు ఇచ్చారు. 'మాయ', 'ఎలా బ్రతకాలి', 'నగరం ప్రశాంతంగా వుంది', 'గోడలు మింగిన ఊరు' మొదలైన నాటకాలు రాశారు. నాటకరంగంపై పరిశోధనా వ్యాసాలు రాశారు. శ్రీకాకుళ ఉద్యమకాలం, ఆ కాలంలో వివిధ ప్రాంతాలలోని గిరిజన ప్రాంతాల పరిస్థితులను ప్రతిబింబిస్తూ నవల రాశారు. నిర్మలానంద, శీలా వీర్రాజుగార్లతో ప్రత్యేకమైన ప్రేమ, అభిమానాలతో వుండేవారు. జనసాహితి ఆధ్వర్యంలో కలకత్తాకు చెందిన గౌతమ్ ముఖర్జీ బృందం 2017 అక్టోబర్‌లో ప్రదర్శించిన గోర్కీ 'అమ్మ' నాటకం ప్రదర్శన సందర్భంగా ఎంతో సహకరించారు.

కృష్ణమూర్తి పనిచేస్తున్న A.G. ఆఫీసువారి 'రంజని' సాహిత్య, సాంస్కృతిక సంస్థకు కార్యదర్శిగానూ, కార్యకర్తగానూ విశేషమైన కృషి చేశారు. అత్యంత నిర్బంధ కష్టకాలంలో కూడా శ్రీశ్రీతో 'రంజని' వేదికలపై ఉపన్యాసాలు ఇప్పించారు. నాటకరంగంపై ఎక్కడ చర్చలు జరుగుతున్నా అక్కడ కనిపించేవారు. సామాజిక బాధ్యతలను వదులుకోలేని, వదులుకోవటానికి ఏమాత్రం రాజీపడని వ్యక్తిత్వం ఆయనది. ఏమాత్రం రాజీపడినా సినిమారంగం పిలిచేదని ఆయన మిత్రులు చెబుతారు. వారాలగారితో పరిచయమున్న అందరికీ ఆయనలోని సూటితనం నచ్చుతుంది. అదే ఆయనకు కొందరిని దగ్గర చేసింది. మరికొందరిని ఆశ్చర్యపరచేది. సాహిత్యం, కళలు ప్రజలకోసమని నమ్మి కృషిచేసిన ఆయన ఏనాడూ వ్యక్తిగత గొప్పలకు చోటివ్వలేదు. వ్యక్తిగత కృషి, సమష్టితనం కలగలిపి రచయితలు ఎటువంటి కృషి సాగించాలో ఆయన అనుభవాలు చెప్పేవారు.

రోజురోజుకీ సమాజంలో పెరుగుతున్న విషసంస్కృతిని ఎదుర్కోవాలంటే రచయితలు, సమష్టిగా సాంస్కృతికోద్యమ కృషిలో బాధ్యత వహించాలని, కొత్తవాళ్ళను రచయితలుగా మలచుకోవలసిన అవసరాన్ని తెలియచేస్తుండేవారు. జనసాహితికి, 'ప్రజాసాహితి' పత్రికకు ఎంతో ఆప్తులైన వారాల కృష్ణమూర్తికి జోహార్లు చెబుతున్నాం. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియచేస్తున్నాం.

వ్యాసం

# అరుదైన కథకుడు వారాల కృష్ణమూర్తి

- శీలా సుభద్రాదేవి

**కథ** పుట్టిన దగ్గరనుండీ కథలు పుడుతూనే వున్నాయి. కథలు చాలామంది రాస్తారు. రాస్తూనే వున్నారు. కొన్ని కుటుంబాల చుట్టూరా గుడుగుడు కుంచంలా తిరిగే కథలు, వంటింట్లోనే మండే కథలు, వండే కథలు, పార్కుల్లోనో, సినిమాహాల్లోనో, విద్యాసంస్థల్లోనో ప్రేమపుస్తకాల్ని పట్టుకున్న కథలు, రోడ్లు కొలిచే కథలు, కత్తుల్లో కొడవళ్ళో పట్టుకొని తిరిగే కథలు, ఎర్రవో నల్లవో జెండాలు పట్టుకున్న కథలు, బడుగుజీవుల ఆకలి కథలు, అణచివేత కథలు. ఇలా ఇలా ఎన్నో నేలమీది కథలు, నేలవిడిచి సాముచేసే కథలు, ఊహల్లోని కథలు, కలలుకనే కథలు, సమాజంలోని అట్టడుగువర్గాల మూలాల్లోకి తిరిగి చూసే కథలు వెలువడుతూనే వున్నాయి.

అయితే సమాజాన్ని పరిశీలనగా చూసి ప్రజల అసమాన జీవితాలూ, ఆర్థిక సంక్షోభాలూ, వాటిచుట్టూ అల్లుకున్న రాజకీయాల్ని పట్టిచూపే కథలు కొన్నే ఉంటాయి. బడుగుజీవుల కథల్ని, ఏడుపుగొట్టు కథల్ని మాత్రమే గుర్తిస్తారా అని కొందరు కన్నెర్రచేస్తూనే ఉండొచ్చుకానీ పాఠకుడికి జాగరూకత నేర్పే కథలు, ఎలా బతకాలో చెప్పే కథలు, మనుషుల్ని ప్రేమిస్తూ ఎలా జీవించాలో తెలిపే కథలు, సమాజం తీరుతెన్నుల్ని పండు వలిచినట్లు పొరలు పొరలుగా విప్పిచూపి మనసు పొరలు తొలగించుకుని ఒక మెలకువని ఇచ్చే కథలు జీవితం విలువను తెలిపే కథలు అందరూ రాయలేరు. అలా రాసే కొందరిలో వారాల కృష్ణమూర్తి ఒకరని తప్పక గుర్తించాలి.

సౌమ్యంగా, ఆత్మీయంగా పలకరిస్తూ, అమాయకంగా కన్పించే వారాల కృష్ణమూర్తి సమాజంలోని నిజాల్ని వలిచి చూపించే నిప్పుల్లాంటి కథలు రాస్తారని అతికొద్దిమందికే తెలుసు.

1977లో "ఇది ఇంతేనా" అనే కథలో కొందరికి అవసరమయ్యే స్థలాల్లో అకస్మాత్తుగా దేవుళ్ళు ఎలా వెలుస్తారో, ఎలా ప్రజల్ని నమ్మిస్తారో అద్భుతంగా చెప్పారు.

'పాముల పండుగనాడు పుట్ట బంగారాన్ని కళ్ళకద్దుకుని నోట్లో ఏసుకునేదే' అని అనుకుని పుట్టమన్ను పిండిలెక్క జల్లెడపట్టి ఉప్పు కారం వేసి కాల్చిన రొట్టెని ఆకలితో ఏడుస్తున్న పిల్లలకి తినిపించింది. తల్లి యాదమ్మ. అది చూసి ఇంట్లో తల్లికి, భార్యకి, పిల్లలకే కాక పశువులకు గడ్డి కూడా పెట్టలేని తన అసహాయతకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్న పేద రైతు లచ్చుమును అతని భార్య యాదమ్మ నిబ్బరంతో 'నీలాంటి పిరికోడితో కాపురంకన్నా పిల్లలకోసం తాను బతుకుతానంటుంది'. ఆత్మహత్య పరిష్కారంగా చూపకుండా కష్టాలకు ఎదురీదే ధైర్యాన్ని కూడగట్టుకునే స్త్రీ పాత్రలతో, 'యాది' కథకు ముగింపు చెప్పటం రచయితకు జీవితం విలువ, మహిళల మనోధైర్యం పట్ల విశ్వాసం గమనించదగినది.

ముఖ్యంగా వారాల కృష్ణమూర్తి కథ నడపటంలోనూ, ముగింపులోను కూడా పాఠకుడికి కథని పూర్తిగా వివరించేలా కాకుండా సంఘటనలతో, సంభాషణలతో అవగాహన కలిగేలా చెప్తారు. అది రచయితగా కృష్ణమూర్తి ప్రోదిచేసుకున్న శైలీ విన్యాసం.

అందుకే 'కథలన్నీ ప్రయోజనాన్ని ఆశించినవే. జీవిత చిత్రణలో నేటి కథల్లో వచ్చిన పరిణామం ఈ కథల్లో కనిపిస్తుంది. చాలామందికి పరిచయంకాని జీవిత దృశ్యాలను చిత్రీకరించటంలో విజయాన్ని సాధించాడు వారాల కృష్ణమూర్తి' అని తన చేరాతల్లో చేకూరి రామారావు ప్రశంసించారు.

రచయిత ఎంత సౌమ్య స్వభావుడో ఆయన కథలోని పాత్రలు కూడా అంతే సున్నిత హృదయులుగా కన్పిస్తాయి. కానీ ప్రజల కొరకు పోరాటం చేయటంలోకానీ, పట్టుదలలోగానీ, దృఢవిశ్వాసం అంకితభావం కథనం అంతగా స్పష్టంగా వ్యక్తమౌతూనే వుంటుంది.

వివాహ సంబంధం సందర్భంలో గౌరవనీయ కుటుంబంలోని భార్య సుశీల మాటని భర్త నిలబెట్టుకోలేకపోతాడు. మామిడిపళ్ళు అమ్మే పిల్ల పొరపాటున తక్కువ ధర చెప్పినా? ఆ పిల్ల మాటకే విలువిస్తూ పళ్ళు అమ్మిన తల్లితో పోలుస్తూ మాటను నిలబెట్టుకోవటం అనే విషయాన్ని పాఠకులకు చక్కని సంభాషణాచాతుర్యంతో ఒప్పించుతారు రచయిత.

'చింతచెట్టు'ను తాకట్టు పెట్టిన యానాదయ్య కావచ్చు, వ్యవసాయం చేయలేక ఎడ్లని అమ్మకం పెట్టిన లచ్చుమును కావచ్చు, చాకలి కులవృత్తి మానేసిన పుల్లిగాడు కావచ్చు, ఆ కథల్లోని పాత్రలన్నీ తెలివైన కామందుల చేతుల్లో మోసపోయి, పెనంమీది నుండి పొయ్యిలోపడిన వైనం వారాల కృష్ణమూర్తి కథలు చదివితే తెలుస్తుంది.

అందుకే "కలలుగనే కళ్ళు కావు ఈ రచయితవి. తన చుట్టూ జరుగుతున్న సంఘటనల్ని చూడగలిగే నిశితమైన చూపు, సమాజంపట్ల బాధ్యతకలవాడు వారాల కృష్ణమూర్తి" అని 'దేవరదున్న' కథల సంపుటి ముందుమాటలో శీలా వీర్రాజు రాసారు.

'ఊతకర్ర కాదు తుపాకి పుచ్చుకుంటాడు' అని 'గాంధీ మళ్ళీ పుడితే' కథలో చక్కటి రచనా విన్యాసంతో కథని నడిపి ముక్తాయింపు ఇచ్చారు రచయిత.

ఉత్తరం రూపంలో 'ఇప్పటికింతే సంగతులు' కథలో గిరిజన తండాలో ఉన్న పాఠశాల ఉపాధ్యాయుడి అంతరంగ ఘోషని రాసారు.

ఆలోచనలోను, మాటలోను, ప్రవర్తనలోనూ విద్దూరంగా కనిపించే వ్యక్తులు సమాజంలో ఉన్నప్పుడు ఏ పరిస్థితి ఏవిధంగా మారుతుందో పరిశీలించి కృష్ణమూర్తి తన కథలలోని పాత్రలను రూపుదిద్దారు.

సహజంగా వారాల కృష్ణమూర్తి నటుడు, నాటక రచయిత కావటం వలన వారి కథలు ఏ దృశ్యానికి ఆ దృశ్యం పాఠకులకు కళ్ళెదుట దృశ్యమానమౌతుంది. అందుకే వీరి కథల్ని చదివిన నాళేశ్వరం శంకరం" వందిమాగధులు లేని కథలు కథకులు కొంతమందే వుంటారు. అలాంటి రచయితలలో ఒకరు వారాల కృష్ణమూర్తి. నాటకానికి కథాకథనం ఎంత అవసరమో కథకు నాటకీయత అంతే అవసరమనిపించే యీ కథలు సమాజాన్ని అర్థం చేసుకోవటానికి, అవగాహన పెంచుకోవటానికి ఉపకరిస్తాయి' అని తన సమీక్షలో రాసారు.

కథని ఏది ఎంతవరకూ చెప్పాలి అనేది కథకుడికి చాలా ముఖ్యం. కథకుడు తన మనస్సులో ఉన్నదంతా సవివరంగా చెప్పకపోతే పాఠకుడు ఇబ్బందిపడిపోతాడు. అనుకోకుండా పాఠకుడు గ్రహించగలిగిన అంశాలన్నీ అతని ఊహకే వదిలేసేలా కథని నడపటం, ముగించటం కృష్ణమూర్తి రచనావిధానం.

రచనానియమాలచట్రంలో కథని బిగించి అస్పష్టతకు తావివ్వకుండా కృష్ణమూర్తి తనదైన పద్ధతిలోనే నిబద్ధతతోనే కథనీకరించటం వలన వీరి కథలు చదువరులకు ఆసక్తిదాయకంగా నడుస్తాయి.

కథల్లో ఎక్కడా అవాస్తవికతా, కృత్రిమత్వం లేకుండా సరళంగా రాయటం కృష్ణమూర్తి రచనా విధానం.

పుట్టి పెరిగింది చిత్తూరుజిల్లాయే అయినా ఉద్యోగరీత్యా పలు ప్రాంతాలకు తిరగటం వలన వీరి కథల్లోని సంభాషణలు చిత్తూరుజిల్లా మాండలీకమైనా, గోదావరి జిల్లా యాసలోనైనా, తెలంగాణా భాషలోనైనా చక్కని నుడికారంతో ఒదిగిపోతాయి.

వారాల కృష్ణమూర్తి చాలా కథలే రాసినా ఎంపికచేసిన కథల్ని మాత్రమే 'దేవరదున్న', 'నిశ్శబ్ద సంకేతం' అనే రెండు కథాసంపుటాలలో పొందుపరిచారు.

2005లో ఉత్తమ ప్రదర్శనగా నంది బహుమతి పొందిన 'ఎలా బతకాలి'తో పాటూ 'నగరం ప్రశాంతంగా ఉంది', 'పులిమింగిన ఊరు' మొదలగు పలు నాటకాలు రాశారు.

'మాయ చింతచెట్టు', 'సన్ ఫ్లవర్స్', 'దేశం జైల్లో ఉంది', 'మే ఐ హెల్ప్ యూ', 'గోడలు', 'సమ్మతి' మొదలైన నాటకాల్తో పాటు, గురజాడ వారి 'దిద్దుబాటు', గోపీచంద్ 'పతితులు', కాళీపట్నం రామారావు 'చావు' కథలను నాటకీకరణ చేసి ప్రదర్శించారు.

ముఖ్యంగా గురజాడ కన్యాశుల్కం మొదలుకొని నేటివరకూ సమకాలీన సాంఘిక రాజకీయ సమస్యలని కథావస్తువులుగా స్వీకరించి రచనలు చేసిన తెలుగు నాటక రచయితల నాటకాల నుండి కొన్నింటిని ఎంపిక చేసుకొని వాటిని సమగ్రంగా పరిశోధనాత్మకంగా "తెలుగు నాటక సాహిత్యంలో రాజకీయ సామాజిక సమస్యలు" శీర్షికతో ఒక విపుల విశ్లేషణాత్మక విశిష్ట గ్రంథాన్ని రచించారు.

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ 2011-2012, 2012-2013 సంవత్సరాలకుగాను రంగస్థల విభాగంలో "తెలుగు నాటక సాహిత్యంలో రాజకీయ, సామాజిక సమస్యలు" గ్రంథం విశ్లేషణాత్మక అంశానికి సీనియర్ ఫెలోషిప్‌కి ఎంపిక అయినది.

కథావస్తువు జనం సమస్యగా భావించినప్పుడు, సమాజ సంక్షోభ సమయాల్లో నమ్మిన సిద్ధాంతం మేరకు రాయకుండా ఉండలేని అంశం దొరికినప్పుడు మాత్రమే రచనలు చేసే స్వభావం గల వారాల కృష్ణమూర్తి రచనలన్నీ ఆయన దృక్పథాన్నీ, నిబద్ధతనీ, నిజాయితీని వ్యక్తీకరిస్తూనే ఉంటాయి.

గుర్తింపులకు వెంపరలాడకుండా, ఎట్టి పరిస్థితులలోనూ ప్రలోభాలకు లోనుకాకుండా తన మానాన తాను అంకితభావంతో రచనలు చేసే అరుదైన రచయిత వారాల కృష్ణమూర్తి. ●

## ప్రగతిశీలవాది
# రామకోటేశ్ మరణం

**నరసరావుపేటలో** ఇంగ్లీషు అధ్యాపకునిగా పనిచేసి, రిటైరైన కామేపల్లి రామ్‌కోటేశ్ గుంటూరులో తన 68వ యేట 18-12-2022న కాన్సర్‌తో మరణించారు. ఆయన కమ్యూనిస్టు గ్రామంగా పేరుగాంచిన నర్సాయపాలెంలో జన్మించారు.

రామకోటేశ్ విద్యార్థి దశలోనే ఆల్బేనియా కమ్యూనిస్టునేత అన్వర్ హోక్సా భావజాలంతో ప్రభావితులయ్యారు. ఢిల్లీ విశ్వ విద్యాలయంలో చదివే సమయంలో విజయ్‌సింగ్ అనే అధ్యాపకుని ప్రభావంతో మావో ఆలోచనావిధానం అర్థం చేసుకొని ఆ ఆచరణలో వున్నారు. స్టాలిన్ చేసిన కృషిని వివరించే స్టాలిన్ సొసైటీలో ముఖ్య కార్యకర్తగా పనిచేశారు. స్టాలిన్ భావాలను ప్రచారం చేసే ఒక అఖిల భారత పత్రిక సంపాదకవర్గంలో వున్నారు. గుంటూరుజిల్లా ఎ.పి.సి.ఎల్.సి.లో కార్యవర్గ సభ్యునిగా కృషిచేశారు. విశ్రాంత జీవితాన్ని వామపక్ష భావజాల ప్రచారానికి వినియోగించారు. ●



సినిమా సమీక్ష

# చీకట్లోంచి కటిక చీకట్లోకి

('కాంతార' సినిమా సమీక్ష)

- డి.ఆర్. ఇంద్ర

**ఒక** అబద్ధాన్ని పదిమంది నిజంనిజం అని అరిస్తే ఆ అబద్ధం వేల, లక్షలమంది జనాల మెదళ్ళలో నిజమై కూర్చుంటుంది. ప్రచారానికి ఉన్న బలం అటువంటిది. అటువంటి అబద్ధపు ప్రచారహోరు వల్లే నిర్దోషుల్ని వధించే హంతకుడైన రాముడూ, లంకలోని జనావాసాలకి నిప్పెట్టి వేలమంది అమాయకుల సజీవ దహనాలకి పాల్పడ్డ హనుమంతుడూ అవతారపురుషులై పూజలందుకుంటున్నారు. గోబెల్స్ అబద్ధపు ప్రచారాన్ని నమ్మి జర్మన్‌లు గుడ్డిగా నరహంతకుడైన హిట్లర్‌ని నెత్తిన పెట్టుకున్నారు, ఇవాళ మోదీని నెత్తిన పెట్టుకుంటున్నట్టు. నిజం చెప్పులు తొడుక్కునేలోపే అబద్ధం లోకాన్ని చుట్టివస్తుందంటారు ఇందుకే. అబద్ధ ప్రచారాల హోరులో నిజాలు గడ్డిపరకలా ఎగిరిపోతాయ్. అందువల్లే అబద్ధాలే లోకాన్ని ఏలుతుంటాయ్. విద్యావివేకాల్లేని చాలామంది జనాల మెదళ్ళు అబద్ధాన్ని నమ్మడానికే అనువుగా ఉంటాయ్.

సింహాలు తమ చరిత్రని తామే రాసుకోనంతకాలం వాటి చరిత్రను వాటి వేటగాళ్ళే రాస్తారనేది నిజం. ఆ చరిత్రలు అబద్ధాల పుట్టలనేదీ నిజమే. ఎవరి చరిత్రని వాళ్ళు అసత్యాలు, అర్ధసత్యాలకి దూరంగా నిజాయితీగా రాసుకోవడం అభినందనీయం. 'కాంతార' సినిమా అటువంటి ప్రయత్నమే, అందుకే అది సక్సెస్ అయింది అంటున్నారు సినీ, నాన్ సినీజనాలు. అది నిజమే ఐతే ఆ సినిమా తీసినవాళ్ళు అభినందనీయులే. మొన్నే ఆ సినిమా చూసాను. నేను సినిమా సమీక్షకుడ్నికాను. కేవలం ప్రేక్షకుడ్ని మాత్రమే. ఇది ఓ సామాన్య ప్రేక్షకుడి సమీక్ష అనుకోవచ్చు.

ఈ ప్రపంచం విభిన్న సమాజాల, విభిన్న సంస్కృతుల, వాటి ఆచార వ్యవహారాల, విభిన్న విశ్వాసాల పుట్ట. లోకంలోని విభిన్న ప్రాంతాల ప్రజల సంస్కృతుల్ని ప్రతిబింబించే సినిమాలు తీయడం చాలా అవసరమైన మంచిపని. భిన్న సంస్కృతుల గురించి తెలుసుకోవడం, గౌరవించడం మానవ ఏకత్వానికి తప్పనిసరి. మనుషులు దగ్గరవుతారు. ఈ కోణంలోంచి ఇంగ్లీషులో చాలా సినిమాలు వచ్చాయి. 'కాంతార' అటువంటి గొప్ప సినిమా అంటున్నారు. కర్ణాటక పశ్చిమ కోస్తాలోని అటవీ ప్రాంతంలోని నివశించే తుళు ప్రజల ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే కథావస్తువుతో ఈ సినిమాని తీసామని నిర్మాత, దర్శకుడూ, హీరోవేషధారీ అయిన రిషబ్‌శెట్టి శెలవిచ్చాడు. ఒక సినిమాగా 'కాంతార' బాగా తీయబడ్డ సినిమా. సినిమా నిర్మాణంలోని అన్ని శాఖలపై బాగా పట్టు వుంటేగానీ అంత బాగా తీయడం సాధ్యం కాదు. ఇక కథ విషయానికొస్తే ఆ అటవీ ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న ఓ చిన్న జనావాసానికి సంబంధించిన ఇతివృత్తం. ఆ అడవి జనాల అడవిపై ఆధారపడ్డ జీవన విధానం, వారి దైవ మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, వారి బతుకుల్ని శాసించే బయట ప్రపంచంలోని దోపిడీ రాజ్యవ్యవస్థలోని అవినీతి పాలనాధికార్లు, పెద్ద మనుషుల ముసుగులో అటవీ సంపదనీ, భూమినీ కాజేసే భూస్వాములు, వారి తొత్తుల్తో, నిత్యం, హింసించే అటవీశాఖ అధికారుల్తో వేధింపులకి నిత్యం గురవుతూ ఎలా బతుకులు సాగిస్తారో, చివరికి ఆ విలన్లతో హీరో ఎలా తలపడి వారిని మట్టుపెడతాడో చెప్పడమే కథ. నేటికీ ప్రపంచంలో చాలా చోట్ల ముఖ్యంగా మనదేశంలో నిత్యమూ జరుగుతున్న కథే. కొత్తదనం ఐతే ఏమీలేదు.

సినిమాలో కొత్తగా చూపించిందేమిటంటే దుర్మార్గపు రాజ్యవ్యవస్థల్తో, వాటిని శాసించే స్థానిక విలన్లతో భౌతికంగా ఒక్కడూ తలపడలేక చావుదెబ్బలు తిని శవప్రాయంగా పడి వున్న దశలో ఆ ఆటవిక జనాలు తమని కాపాడే దైవమని విశ్వసించి ఆరాధించే, మొక్కే వరాహమూర్తి ఒక్కసారిగా హీరోని ఆవహించి అమిత బలాఢ్యుణ్ణి చేయడంతో హీరో (సినీమాటిగ్గా) లేచి విలన్లని చిదగ్గొట్టి చంపేయడాన్ని గుండెలదిరే బీభత్సమైన సౌండ్ ఎఫెక్ట్‌తో, హీరో ప్రదర్శించే వొళ్ళు గగుర్పొడిచే హావభావాల ప్రదర్శనతో, బీభత్సరసాన్ని క్లైమాక్స్‌కి తీసుకుపోయి, ప్రేక్షకుల్ని ముంగాళ్ళమీద నిలబెట్టి ఓరకం పూనకాల మూర్ఛలోకి గెంటేసి, విభ్రాంతికి లోనుచెయ్యడంలో సక్సెస్ అయ్యాడు! అంతే! అంతకిమించి సినిమాలో ఏమీలేదు, రొటీన్! భారీ కలెక్షన్లతో సినిమా గ్రాండ్ సక్సెస్! జన్యులోపాల వల్ల విపరీతాకారాలతో పుట్టే కందిపిలకలకీ, అవకరాలతో పుట్టే జంతువులకి, పశువులకీ దైవస్వరూపాలు అంటూ సాగిలపడి మొక్కే ఈ జాతికి ఆ పూనకాలు చాలు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి వంటిమీదది వొలిచి ఇవ్వడానికి. ఆ వేలంవెర్రి జనాల పూనకాల మహత్యాల పిచ్చిని 'కాంతార' బాగా సొమ్ము చేసుకుంది. తెలుగులో అమ్మవార్ల మహత్యాల మీద వచ్చిన సినిమాలన్నీ బాగానే సొమ్ముల్ని చేసుకున్నాయ్. వాటి రికార్డ్స్‌ని ఈ సినిమా బాగా అధిగమించి దూసుకుపోయింది.

ఈ సినిమా దర్శకుడూ, హీరో వేషధారైన రిషబ్‌శెట్టి ఓ ఇంటర్వ్యూలో ఏమన్నాడంటే – ఈనాటి యువతకి తమ సంస్కృతుల మూలాల గురించి, సనాతనాచారాల గురించీ, విశ్వాసాల గురించీ బొత్తిగా ఏమీ తెలియపోవడం వల్ల వాటిపట్ల వారికి గౌరవం లేకుండా పోయిందనీ అందువల్ల వాటిని పునరుద్ధరించడానికే 'కాంతార' తీసినట్టు సగర్వంగా చెప్పుకున్నాడు. సైంటిస్ట్‌లయివుండీ హేతువాద భౌతికవాద శాస్త్రీయ దృక్పథం ఏ కోశాన లేకుండా రాకెట్లని అమ్మవార్ల పాదాల మీద పెట్టి

అవి కూలిపోకుండా కాపాడమని మొక్కే మన గొప్ప ఇస్రో సైంటిస్ట్లని ఆదర్శంగా తీసుకుని మంచి ప్యాకేజీల్తో మంచి ఉద్యోగాల్ని ఇప్పించమని తిరుపతి, కాళహస్తి, కాణిపాకం వగైరా దేవుళ్ళకి మొక్కే మన విద్యాధికులైన యువతకి తగినట్టుగానే ఈ సినిమా భౌతిక సమస్యల పరిష్కారాలకి శాస్త్రీయ ఆలోచన్లతోకాక, దైవ విశ్వాసాలు, మొక్కుబడులపై ఆధారపడండని చెపుతుంది. గొప్ప సినిమా! ఇటీవలే భారత ప్రభుత్వం చేత పద్మశ్రీ అవార్డు పొందిన ఒక పురాణ ప్రవచనకారుడు తన ప్రవచన సభల్లో – మీ సమస్యలకి మనుషుల్ని నమ్ముకోకండి, దేవుళ్ళని నమ్ముకోండని బాహాటంగానే చెపుతుంటాడు. చప్పట్లు మారుమోగుతుంటాయ్! అంతేగానీ మనుషుల సమష్టి కృషితో సృష్టించబడే వస్తుసేవల్ని అప్పనంగా తేరగా అనుభవిస్తూనే, మనుషుల్ని నమ్ముకోకండి, (లేని) దైవాల్ని నమ్ముకోండి అని చెప్తున్నావే, నువ్వేం మనిషివయ్యా! సిగ్గులేదా? అని ఎవడూ అడగడు! అలాగే ఈ సినిమాలో భూతకాల నృత్యదైవారాధకుడుగా జీవించే హీరో తమ్ముడ్ని విలన్ తన దోపిడీ ప్లాన్‌కి అనుకూలించలేదని పబ్లిగ్గా పొడిచి చంపితే ఆ ట్రైబ్‌ని కాపాడే ఆ ఆదివరాహమూర్తి ఆ అమాయకుడ్ని కాపాడలేదేం, చివర్లో హీరోని మాత్రమే ఎందుకు కాపాడతాడని ఏ వెర్రి ప్రేక్షకుడూ ప్రశ్నించడు. ఎందుకంటే ఆ దేవుడి దృష్టిలో కూడా కేవలం హీరో మాత్రమే గ్లోరిపై కావాలి! అందుకోసం మిగతా పాత్రలు జీరోలు కావాలి! గొప్ప కథ! బాధితుల్ని విలన్ల బారి నుండి దైవ విశ్వాసులు, పూనకాలూ కాపాడినట్టు చరిత్రలో ఎక్కడైనా దాఖలాలున్నాయా అని ఏ సినీ విమర్శకుడూ ప్రశ్నించడు – ఆహా, యేం గొప్ప సినిమా అని గుండెలు బాదుకోవడం తప్ప.

సరేనయ్యా, హీరోని దైవం పూని, విలన్‌ని వాడి అనుచర్లతోసహా కీచకుడ్ని భీముడు చంపిపారేసినట్టు చంపిపారేసి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసాడు! బాగు, బాగు! సిన్మా ఐపోయింది. వాస్తవంలో తర్వాత యేం జరుగుతుంది? విలన్లని కాపాడే దుర్మార్గపు రాజ్యవ్యవస్థా, యముండు ల్లాంటి పాలనాధికారులూ, నీచ చట్టాలూ, పోలీసుకుక్కలూ, కోర్టులూ ఊరకనే వుంటాయా? ఆ హీరోనీ, ఆ గ్రామస్థుల్నీ చితకబాది అరెస్టు చేసి కేసులు పెట్టి జైళ్ళలో కుక్కి నరకం చూపించవా? అప్పుడు వాళ్ళని ఏ దేవుడు దిగొచ్చి కాపాడతాడు? ఈ వాస్తవాన్ని సీక్వెల్‌గా సినిమాగా తీసే దమ్ము 'కాంతార' హీరోకి వుందా? అడుక్కుతినే వాడికి లాటరీలో కారు తగిల్తే దాన్నమ్ముకుని సుఖంగా జీవించక ఆ కార్లో కూర్చొని అడుక్కుంటాడట. అలాగే ఆధునిక సినిమా టెక్నాలజీలతో సమాజాన్ని ముందుకు నడిపించే సినిమాలు తీయక పూనకాల, మూఢవిశ్వాసాల పరిరక్షణకి ఉపయోగిస్తున్నారే ఈ ఆధునిక సినిమా యాచకులు! పురాతన సంస్కృతీ, సనాతన ప్రియత్వం పట్ల ప్రముఖ చరిత్రకారుడు బి.ఎస్.ఎల్. హనుమంతరావు ఏమంటారంటే – "సనాతన ప్రియత్వం సామాజిక ప్రగతిపట్ల విముఖత్వానికి నిదర్శనం. సనాతన ప్రియత్వం మానవ పురోగతికి ఆటంకమైన మానసిక రోగాల్లో ఒకటి".

సనాతనత్వాన్ని సమర్థిస్తూ పూనకాల్ని గ్లోరిఫైచేసే ఈ సినిమా జనాల్ని చీకట్లోంచి వెల్తురులోకి తీసుకువెడుతుందా లేక చీకట్లోంచి కటిక చీకట్లోకి నెడుతుందో ఎగబడిచూసే ప్రేక్షకుల విజ్ఞతకి వొదిలేయడమే ఉత్తమం – తాటికాయంత మెదళ్ళలో ఇందుపుకాయంత ఇంగితజ్ఞానం అంటూ ఒకటి వుంటే.

కొసమెరుపు : జనాల్లో ఈ సినిమా పుట్టించిన పూనకాల సంచలనాన్ని గుర్తించిన కర్నాటక ప్రభుత్వం 60 ఏళ్ళు నిండిన భూతకోల దైవవేషధారి నర్తకులకి నెలనెలా రెండువేల రూపాయల పెన్షన్ ప్రకటించింది! భేష్! ఏలిన వారి దోపిడీల జోలికి రాకుండా జనాలు దైవ పూనకాల మత్తులో జోగుతూ ఉండటమేగా పాలకులకి కావల్సింది.

అయ్యా యు.జి.సి.వారూ! ఇక విశ్వవిద్యాలయాల్లో పూనకాలపై పి.జి. కోర్సులు, పి.హెచ్.డి. కోర్సులూ పెట్టెయ్యండిమరి. వాస్తు, జ్యోతిష్యాలపై కోర్సులు పెట్టిన పూర్వానుభవం తమరికెటూ ఉందిగా. సమాజానికి ఏది అభివృద్ధో, ఏది అభివృద్ధి నిరోధకమో తెలీని అజ్ఞానంలో జనాల్ని కొట్టుమిట్టాడిస్తున్నంతకాలం కళ ముసుగులో ఇటువంటి సినిమాలు జనాల మెదళ్ళని తినేస్తూనే ఉంటాయి, గొంగళిపురుగు పాదుల లేత చిగుళ్ళని కొరుక్కుతింటున్నట్టు. 'కాంతార' అంటే మాయా అడవి అని అర్థమట. ఆ మాట నిజం! సినీకళ అబద్ధాల్ని నిజంగా, నిజాల్ని అబద్ధాలుగా చూపించే ఒక మాయా అడవే!

## స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర మహాసభ సారథి జైని మల్లయ్య గుప్త మరణం

**తెలంగాణా** సాయుధ పోరాటపు యోధుడు, గ్రంథాలయోద్యమం పట్ల మక్కువతో ఎన్నో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషిచేసిన జైని మల్లయ్య 21-12-2022న తన 97వ యేట హైదరాబాద్‌లో మరణించారు. ఆయన 1926 అక్టోబర్ 11వ తేదీన నల్గొండ జిల్లాలోని భువనగిరి పట్టణంలో జన్మించారు.

జైని మల్లయ్య 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనటానికి ఇంట్లో చెప్పకుండా బొంబాయి వెళ్ళటంతో ఆయన రాజకీయోద్యమ జీవితం ప్రారంభమైంది. ఆ తర్వాత నిజాం రాజరిక వ్యవస్థకు, గ్రామాలలో దొరల, భూస్వాముల దౌర్జన్యాలకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో పాల్గొన్నారు. మిత్రమండలి, ఆంధ్ర మహాసభల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. అరెస్టయ్యి జైలు జీవితం గడిపారు. జైలు నుండి తప్పించుకుని అజ్ఞాత జీవితం గడుపుతూ పోరాటాన్ని కొనసాగించారు. కమ్యూనిస్టుపార్టీతో కలసి పనిచేశారు.

తెలంగాణ పోరాట విరమణ అనంతరం 1962లో భువనగిరి పురపాలక సంఘానికి తొలి వైస్‌ఛైర్మన్‌గా పనిచేశారు. సాహిత్యమన్నా గ్రంథాలయాలన్నా మక్కువతో అనేక కార్యక్రమాలను నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు సభ్యులుగా క్రియాశీలంగా కృషిచేశారు. ఆయన ఉర్దూ భాషాప్రేమికుడు, ప్రజాస్వామికవాది. ప్రజాసంఘాల కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనేవారు.

అమరుడు జైని మల్లయ్యకు జోహార్లు. 'ప్రజాసాహితి' వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తుంది.

‘ఖూనీ’ నాటకానికి రాసిన సుదీర్ఘ ముందుమాటలో చివరిభాగం :

# మతము

- త్రిపురనేని రామస్వామి

**వేనరాజు** కాలమునాఁటికి మత మనునది యొకటున్నట్టు పొడకట్టదు. “ఆర్యఋషులు” చెప్పు ధర్మములే సనాతన ధర్మమని తలంపఁబడుచుండెను. “ఆర్యఋషుల” యభిప్రాయములకు వ్యతిరేకములగు నభిప్రాయములు కలవారు పాషండులుగను, నాస్తికులుగను నెంచఁబడుచుండిరి. తన్మూలమున వారు దండ్యులో, హంతవ్యులో యగుచుండిరి. రాజులు “ఆర్యఋషుల” చేతి కొఱమ ట్టులుగ నుండిరి. తరువాత క్రమక్రమముగ నే మహనీయుఁడో చెప్పిన నీతులన్నియుఁ గట్టకట్టి యాతని పేరిట మతమని చెప్పి, తన్మతేతరుల బలవంతముగాఁ దమమతములోనికి దింపుట పరిపాటియై పోయినది. ఇందుచే మతయుద్ధములు తలలెత్తసాగినవి. దేశములెల్లను మానవ రక్తప్లావితములయినవి. దేశమునకు మతములు చేసిన మేలిది యొక్కటి. క్రైస్తవ మతమునకు మూలస్థానమైన జెరుసలేము పట్టణము మహమ్మదీయులగు అరబ్బుల స్వాధీనములో నుండుటచే నా పట్టణమును గైవసముఁ జేసికొనుటకు నెంతమంది వీరాధివీరులు హతులయిరో లెక్కపెట్టనలవియా? హిందూ మహమ్మదీయులు తమ తమ మతములకయి పోరాడి యెన్ని లక్షలు దుర్మరణముపాలైరో కదా! సోమనాథ దేవాలయఁపు ముట్టడిలో నెంతమంది జంకు కొంకు లేని రాజపుత్ర సుభటులు ప్రాణముల నర్పించిరో, మతసహనము కొలఁదియో గొప్పయో యున్న హిందూ దేశమున జైనులు బౌద్ధులు వేలకొలది మతావేశమునకు బలిచేయఁబడలేదా? మతము పేరిటఁ బరస్పరమారణ మతిదారుణముగాఁ బాశ్చాత్యదేశములయందుఁ గూడ జరుపఁబడినది. 1572వ సంవత్సరమున ఫ్రాన్సు దేశములో 10,000 మంది ప్రొటెస్టెంటు క్రైస్తవులు జాలిలేకుండఁ గుత్తుకలు కోయఁబడిరి. స్పెయిను దేశములోఁ గ్రైస్తవమతములోఁ జేరుటకు నిష్టపడమిచే మూడువందలమంది కాల్చివేయఁబడిరి. దేవుని పేరిట నిట్టి క్రూరకృత్యము లెన్నియో జరుపఁబడినవి. భగవంతుఁడొకఁడున్నచోఁ దనపేర జరుగుచున్న యత్యాచారములనైన మాన్పనొల్లఁడా? →



## మరో భావ వికాస ఉద్యమ అవసరాన్ని గుర్తుచేస్తున్న త్రిపురనేని రామస్వామి

**20వ** శతాబ్దపు ప్రారంభ సంవత్సరాలలో తెలుగునాట సంఘసంస్కరణ ఉద్యమానికి, భావవికాస ఉద్యమానికి తన సాహిత్యం ద్వారా, కార్యాచరణ ద్వారా ఒక నమూనాగా మన ముందున్న త్రిపురనేని రామస్వామి 135వ జయంతి జనవరి 15న, 79వ వర్ధంతి జనవరి 16న జరుగుతున్న సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం.

కృష్ణాజిల్లా అంగలూరులో పుట్టి (15-1-1887) మచిలీపట్టణంలో మెట్రిక్, ఇంటర్ పూర్తిచేసి 1914లో ఐర్లాండ్‌లోని డబ్లిన్ కళాశాలలో న్యాయ విద్యలో బారిష్టర్ కోర్సు చేశారు. బందర్‌లో ఇంటర్ చదువుతున్నపుడే అష్టావధానం, 1912లో శతావధానం చేశారు. ‘కారెంపూడి కథనం’, ‘కురుక్షేత్ర సంగ్రామం’ నాటకాలు రాశారు. 1922లో తెనాలిలో అడ్వకేటుగా స్థిరపడ్డారు. తెనాలి పురపాలక సంఘ ఛైర్మన్‌గా రెండుసార్లు గెలిచారు. 1925 నుండి 1938 వరకు ఆ పదవిలో వున్నారు.

ఆనాటి సనాతన సమాజానికి ప్రతినిధిగా విశ్వనాథ సత్యనారాయణ వుండగా, ఆధునిక భావవిప్లవధారకు, హేతువాదానికి ప్రతినిధిగా త్రిపురనేని నిల్చారు. విశ్వనాథ రాసిన ‘వేనరాజు’ నాటకానికి సమాధానంగా ‘ఖూనీ’ నాటకం రాశారు. హేతువాద కులాంతర, మతాంతర వివాహాలను మంత్ర తంత్రాలు లేకుండా చేశారు. ‘వివాహ విధి’లో అటువంటి వివాహాలు చేసే పద్ధతిని వివరించారు. భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామిక సంస్కృతి భావజాలాన్ని ప్రచారం చేస్తూ భావవికాస ఉద్యమాన్ని నడిపారు.

ఈనాడు బిజెపి దేశంలో అన్నిరంగాలలో తిరోగమన సంస్కృతిని ప్రచారం చేస్తోంది. దీనిని త్రిప్పికొడుతూ వేమన, గురజాడ, వీరేశలింగం, త్రిపురనేని మొదలగువారి స్ఫూర్తితో మరో భావవికాస ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం త్రిపురనేని జయంతి, వర్ధంతులు గుర్తుచేస్తున్నాయి.

→ మతము ప్రతిదేశమునందు సౌజన్యము, సౌభ్రాతృత్వము, సమానత్వమును జిందరవందరచేసి, మానవుల నల్లకల్లోలము జేసి, ప్రపంచశాంతి లేకుండఁజేయుటయే కాకుండ మహాపురుషుల నెందఱనో తనపొట్టఁ బెట్టుకొన్నది. తార్కాణముగా నొక యుదాహరణము నిచ్చెదము. సూర్యునిచుట్టు భూమియే తిరుగుచున్నదని చెప్పిన 'కోపర్నికస్' అను జ్యోతిష్కుని, రోమను చక్రవర్తి పెట్టరాని సిలుగులం బెట్టి చంపించెను. మానవుఁడతిమూఢదశలో నున్నప్పుడు కొండగాని, ఏరుగాని, వాఁకగాని, పందిగాని, కుక్కగాని యేది యతిభీకరంబై మనస్సునకు నలజడిఁగల్గించునో, యట్టిదానియందు భక్తివిశ్వాసము లుంచి, వేడికోళ్లర్పించుట స్వభావముగాఁ గన్పట్టుచున్నది. ఇట్టి జనసంఖ్య ప్రపంచమునం దధికంబుగా నున్నదనుట స్పష్టము. కాని యీ సంఖ్య క్రమక్రమముగాఁ బెరుఁగుటకు మారు తరుగుచున్నది. కారణమేమి? ప్రజాసామాన్య మజ్ఞానాంధకారబంధురముగా నున్నప్పు డుబుసుపోకకో, చిత్తశాంతికో దేవుఁడను మాఱొకొకటి కావలసి యుండును. ప్రజలు జ్ఞానచక్షువులందెఱచి, తమలోఁదాము తర్కించు కొనుచున్న కొలంది భక్తివిశ్వాసములు నశింప భగవంతుఁడున్నాడా లేఁడా యను తర్కవితర్కములు బయలుదేరుట సహజము.

మానవుఁడు మృగదశలో నున్నప్పుడే కొండగానో, యే యేరుగానో వెలసిన దేవుఁడు, మానవ విజ్ఞానము పరిణామముఁ బొందుచున్న కొలంది, భగవంతుఁడేరు, కొండరూపమును వదలి, మృగమై, మృగము నుండి మనుష్యుఁడై, మనుష్యదశ నుండి యదృశ్యరూపుఁడై, నిరాకారుఁడై, నిరంజనుఁడై, నిర్వికల్పుఁడయ్యెను. ఇఁకఁ దరువాతి దశయేమి? శూన్యత్వము అనఁగా నాస్తికత్వము. ఇదియే మూఢమానవ ప్రతిపాదితుఁడైన భగవంతునకు నేఁడు వాటిల్లుచున్న దశ. రష్యాలో నిరువదియేండ్లక్రింద బయలుదేరిన యీ ప్రళయ ఝంఝూమారుతమునకు భయపడి యచ్చటి గుడులు (Churches)లో నున్న భగవంతుఁడు కాలిచప్పుడు కాకుండ నెచ్చటికో దారితీసెను. ఈ యిరువది సంవత్సరములలో నచ్చట బయలుదేరిన సాంఘిక మానసిక పరిణామము బహువిచిత్రమై ప్రపంచమునకు విస్మయముఁ గొల్పుచున్నది. ఈ విచిత్ర పరిణామమునుజూచి ప్రపంచమునందలి రాజకీయవేత్తలందఱు దిగ్భ్రమఁజెంది ప్రపంచమేమగునో యని దిగులుపడుచున్నారు.

రష్యాయందుఁ బది పదియేను కోట్ల జనమున్నది. యూరపు మహా సంగ్రామమునకుఁ బూర్వమీదేశమును "జారు" అను బిరుదుగల యొకచక్రవర్తి పాలించుచుండువాఁడు. ఈ జారును రష్యనులందరు (Little God) చిన్నదేవుఁడని పిలుచుచుండువారు. జారు పరిపాలనలో నున్నంతకాలము రష్యాయందు మతావేశము మెండుగ నుండెను. రాజశాసనముచే నెల్లరు విసుగు, విరామము లేక భగవత్పూజ చేయవలసియుండెను. దీనికిఁ బ్రతిఫలమేమి? ప్రజలలో నూటికి డెబ్బదిమందికిఁ గూడు గాని గుడ్డగాని మంచముగాని కంచముగాని లేకుండెను. యూరపు మహాసంగ్రామము మధ్య జరిగిన మహాదారుణమైన జారుహత్యకు భయపడి భగవంతుఁడు రష్యాను వదలి పలాయితుఁడయ్యెను. చిన్నదేవుఁడు చావగాఁ బెద్దదేవునికి గతి లేకపోయెను. గుడులన్నియు యంత్రాగారములుగను, పుస్తక భాండాగారములుగను మారిపోయెను. గుడులకున్న మడిమాన్యములు ప్రభుత్వ వశమైపోయెను. తలఁదాచికొనుటకు నిల్లువాఁకిలి లేనప్పుడు భగవంతుఁడు మాత్రమేమి చేయఁగలఁడు? ఈ మార్పువల్ల రష్యాదేశమునకుఁ గల్గిన ప్రతిఫలమేమి? నూటికి డెబ్బదిమందికిఁ దినఁగూడును, కట్టబట్టయుఁ, బండ మంచమును, సాపడఁ గంచమును లభించినవి. పురుషకారమప్రతిహతమగు నధికారము చెల్లించుకొనుచున్నది.

ప్రార్థించినంతమాత్ర, సేవించినంతమాత్ర, కైంకర్యము చేసినంతమాత్ర భగవంతుఁడు ప్రీతుఁడై, సిరిసంపత్తులనిచ్చి, పరలోక సౌఖ్యములు గల్పించుననుట నమ్మఁదగినదేనా? ఇట్టివి యెన్నడు, నెచ్చటను జరిగియుండలేదు. ఇయ్యది మానవ హృదయదౌర్బల్యమును సూచింపక తప్పదు. ఈ ప్రార్థనలు, ఈ సేవలు, ఈ కైంకర్యములు స్వాతంత్ర్యమును గోల్పుచ్చి, పురుషకారమును నశింపఁజేసి మానవులను నంబేదలగు బానిసలనుగాఁజేయుట కుపకరించును గాని మఱెందులకుఁ గొఱగావు.

పాషండు లైనంతమాత్రమునఁ (అనఁగా వైదిక ధర్మములను ననుష్ఠింపనంతమాత్రమున) మానవుఁడు పాపకర్మములను చరించునని కాని ధర్మపీడలను సల్పునని కాని చెప్పుట లోకమునెడ మహాపచారము చేయుట యగును. భగవంతుని ప్రేమించుటకన్నఁ, దోడిమానవులఁ బ్రేమించుట పరమోత్తమంబు, పాషండుఁ డనఁగా సకల పాపములను జేయువాఁడని ప్రాకృతలోకంబునఁగల యూహలను నాధారము జేసికొని విశ్వనాథ సత్యనారాయణగారు వేనరాజును నావిధముగ నభివర్ణించియున్నారు. ఇది కేవలము పొరపాటు. పాషండులయందెట్టి పవిత్రజీవనము సల్పిన యుత్తమపురుషులున్నారో లోకచరిత్రఁ జదివినవారికి బోధపడకపోదు. కావుననే పాషండు లైనంత మాత్రముననే మానవులు దుర్మార్గులు కారనియు వేనరాజు పాషండుఁడైనను, సత్యనారాయణగారు చిత్రించినట్టు దుర్మార్గుండు కాఁడనియు రుజువు చేయుటకే "ఖూనీ" వ్రాయఁబడినది.

**సూతాశ్రమము** — **కృతికర్త**

**1.9.35**

# దివ్యాంగులు, కవయిత్రి రాజేశ్వరి మరణం

**సిరిసిల్లకు** చెందిన రాజేశ్వరి చేతులు రెండూ లేకపోయినా కాలితో కవితలు రాసేవారు. ఆమె ఒక నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టారు. అనారోగ్యంతో 28-12-2022న మరణించారు. 2014లో సుద్దాల ఫౌండేషన్ 'సిరిసిల్ల రాజేశ్వరి కవితలు' పేరుతో ఆమె కవితల సంపుటాన్ని ప్రచురించింది. దీనికి ముందుమాట డా॥ శిలాలోలిత రాశారు.

"సంకల్పం ముందు వైకల్యం ఎంత! దృఢచిత్తం ముందు దురదృష్టం ఎంత! ఎదురీత ముందు విధిరాత ఎంత! పోరాటం ముందు ఆరాటం ఎంత?" అంటూ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆమె కవితలు రాశారు.

శతజయంతి నివాళి

# వచనకవితా ఉద్యమకారుడు
# కుందుర్తి ఆంజనేయులు శతజయంతి ముగింపు



**వచన** కవితను ఒక ఉద్యమంగా ప్రచారం చేసి, వచన కవితలు, వచన కవితలో కావ్యాలు రాసిన కుందుర్తి ఆంజనేయులు శతజయంతి గత నెల (డిసెంబరు 2022) 16వ తేదీతో ముగిసింది. ఆయన గుంటూరుజిల్లా కోటవారిపాలెంలో 16-12-1922న జన్మించారు. 25-10-1982న 60వ ఏటన మరణించారు.

వినుకొండలో విద్యార్థిగా వున్నప్పుడు వీరికి జాషువా తెలుగు ఉపాధ్యాయుడు. విజయవాడ పురపాలక ఉన్నత పాఠశాలలోను, ఎస్.ఆర్.ఆర్. కళాశాలలోనూ చదివారు. కళాశాలలో విశ్వనాథ వీరి గురువు. గుంటూరు ఎ.సి. కళాశాలలో బి.ఏ. పూర్తిచేశారు. రేవేంద్రపాడు రెసిడెన్షియల్ స్కూలులో ఇంగ్లీషు టీచరుగా, ఆ తర్వాత గుంటూరు పొగాకు మార్కెట్‌లో చేసి 1956 నుండి సమాచార ప్రచారశాఖలో అనువాదకులుగా 1977లో రిటైరయ్యేంతవరకు పనిచేశారు.

వీరు నరసరావుపేటలో 'నవ్యకళాపరిషత్తు' అనే సాహిత్యసంస్థను స్థాపించి, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలసి 'నయాగరా' అనే వచన కవితల సంకలనం ప్రచురించారు. 1958లో వచన కవిత ఉద్యమంలో భాగంగా ఫ్రీవర్స్ ఫ్రంట్‌ను ప్రారంభించి ఉత్తమ వచన కవితలకు బహుమతులు ఇవ్వడం ప్రారంభించారు. ఆయన మరణించిన తర్వాత 'రంజని' సంస్థ ఇప్పటికీ 'రంజని కుందుర్తి' అవార్డులు ఇస్తున్నది.

ఆయన వచన కవితలో 'తెలంగాణ', దండియాత్ర', 'నగరంలో వాన', 'నాలోని నినాదాలు', 'హంస ఎగిరిపోయింది' మొదలగునవి రాశారు. 1969లో సోవియట్ లాండ్ - నెహ్రూ అవార్డు అందుకున్నారు. వచన కవితలో కథాకావ్యాలు రాయమని కవులను ప్రోత్సహించగా, శీలా వీర్రాజు కథా కావ్యాలు రాసి వారి కలను సాకారం చేశారు. వచన పద్యం, ముక్తకాలు, ముక్త ఛందం, వచన గేయం అని రకరకాల పేర్లు వాడినా, వచన కవిత అనే పదమే సాహిత్య లోకంలో స్థిరపడింది. కుందుర్తి వచన కవితా పితామహుడయ్యాడు. వచన కవితలో ఒక అంతర్లయ, వినూత్నమైన భావచిత్రణ, ఒక తూగు, ఒక వూపు వుంటేనే అది కవితగా భాసిస్తుంది. ఈనాడు ఇవేవీ లేకుండా కేవలం వచనాన్ని తుంటలు చేసి వరుసగా పేర్చి వచన కవిత అని తృప్తిపడుతున్న కవులు కోకొల్లలుగా తయారైన పరిస్థితిలో కుందుర్తి శతజయంతి వచన కవితకు పునర్వైభవం కలుగచేయాలని ఆశిస్తున్నాం.

## కుందుర్తికి సన్మానం సందర్భంగా
## వారు చెప్పిన కృతజ్ఞత - వచన కవితారూపంలో

"వచన కవిత విచారణలో
ఉరిశిక్ష పడిన మొదటి ముద్దాయిని నేను
అలనాటి కవితాలతాంగిని హత్యచేశాను
అలంకార ఆభరణాలు అపహరించాను
అన్నీ ఒప్పేసుకున్నాను ఆనాడు బోనులో ఎక్కి
క్రింది కోర్టు వేసిన శిక్షను
మానవ కారుణ్య దృక్పథంతో సడలించి
జన్మ ఖైదు వేశారు హైకోర్టు న్యాయమూర్తులు
ఒక తరంపాటు బ్రతకాలన్నారు బందీగా
పాఠకుల గుండెల చెరసాలలో -"

## జాతీయ అక్షరయోధులు



## బలరాజ్ సాహ్నీ
**( 1913 - 1973)**

**10**

**సింగంపల్లి**
**అశోక్‌కుమార్**

# నటబలరాజ్

## అసామాన్య కళాకారుడు బలరాజ్ సహానీ
## రంగస్థల, సినిమా నటనలో వారెవ్వహానీ
## మరణించాక తలకింద లెనిన్ గ్రంథాలు
## ఉంచమని కోరిన నిబద్ధ యుద్ధ కహానీ

**'తను మరణించాక తన శరీరంపై పూలు పెట్టకూడదని, పండితులను పిలవకూడదని, శ్లోకాలు చదవకూడదని కేవలం సోషలిస్టు రాజ్య నిర్మాత కామ్రేడ్ లెనిన్ గ్రంథాలు మాత్రమే తన తలక్రింద ఉంచవలసింది' అంటూ కోరిన కమ్యూనిస్టు ప్రేమికుడు, మరణించేవరకు పార్టీతోనే వున్న నిబద్ధ ప్రజాకళాకారుడు బలరాజ్ సాహ్నీ భారతీయ రంగస్థల,చలనచిత్ర నటుడు,**

ఇంగ్లీషు సాహిత్యంలో ఎం.ఏ. చదివారు. కొంతకాలం రవీంద్రుని శాంతినికేతన్‌లో ఉపాధ్యాయులుగా పనిచేశారు బి.బి.సిలో హిందీ/ఉర్దూ న్యూస్ రీడరుగా పనిచేశారు.

సాహిత్య,రాజకీయ అధ్యయనం పుష్కలంగావున్న బలరాజ్‌సాహ్నీ తొలుత ఆంగ్లంలోనూ, తరువాత పంజాబీలోనూ పత్రికలకు అనేక కథలు, కవితలు రాశారు. 'మేరీఫిల్మీ ఆత్మకథ' పేరుతో ఆత్మకథ రాశారు.ఇంకా 1960లో పాకిస్థాన్ సందర్శించి 'మేరా పాకిస్తానీ సఫర్నామా', 1969లో సోవియట్ పర్యటించి 'మేరా రూసీ సఫర్నామా'వంటి ట్రావ్‌లాగ్‌లు రాశారు. ఈ రచన సోవియట్‌ల్యాండ్ నెహ్రూ అవార్డు పొందింది. ఇంకా 'కామీ, ఏక్ సఫర్ ఏక్ దస్తాన్, గైర్ జజ్బాటి డైరీ' వంటి రచనలుచేశారు. తన 'మేరా దృష్టికోణ్' అనే పుస్తకంలో ముల్లాలు, పండితులపట్ల పాఠకులు జాగ్రత్త ఉండాలని ప్రపంచంలో యుద్ధాలకు వీరే కారణాలంటారు.

ఇప్టా కళాకారిణి,కమ్యూనిస్టుపార్టీ సభ్యురాలు దమయంతిని 1936లో వివాహం చేసుకున్నారు,1947 ఆమె మరణించగా 1949లో సంతోష్ చందోక్‌ను వివాహం చేసుకున్నారు

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా. సభ్యుడు, అనుబంధ సంస్థ ఐ.పి.టి.ఏ. (IPTA) ప్రథమ అధ్యక్షుడు. కళల ద్వారా ప్రజాఉద్యమాలకు ఉపిరులు పోసే ఇప్టా సంస్థ నాటకాలతో తన నటజీవితం ప్రారంభించిన బలరాజ్ సాహ్నీ సినిమారంగంలో ఎ గ్రేడ్ స్టార్‌గా ఉంటూ కూడా రంగస్థలాన్ని విడిచిపెట్టని ప్రజాకళాకారుడు. 'మాభూమి' తెలుగు నాటకం ప్రదర్శన చూసి అభినందించిన రంగస్థల ప్రేమికుడు.

1953లో బిమల్‌రాయ్ క్లాసిక్ 'దో భీగా జామీన్' బలరాజ్ బలనట ప్రదర్శన పరిశ్రమను విస్మయపరిచింది. ఈ చిత్రం కాన్స్ ఫిలింఫెస్టివల్‌లో అంతర్జాతీయ బహుమతి గెలుచుకుంది

'ధర్తీ కె లాల్, కాబూలీవాలా, వక్త్, నీల్‌కమల్, ఏక్ ఫూల్ దో మాలి, దో రాస్తే, ఘర్‌ఘర్‌కీ కహానీ, చిత్రాలతో సాటిలేని మేటి గుణచిత్ర నటులయ్యారు. 'గరమ్ హవా' చిత్రంలో విభజన కాలంనాటి విషాదాన్ని, ఉద్వేగాల్నీ తన నటనతో ప్రేక్షకులను ఉద్విగ్నుల్ని చేశారు.


ప్రభుత్వ పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ పోస్టల్ స్టాంపు విడుదలైంది. వీరికి రచయిత భీష్మసాహ్నీ సోదరుడు. నటుడు పరీక్షిత్ సాహ్నీ కుమారుడు.

'సినిమా హిట్ కావచ్చు,ఫట్ కావచ్చు బలరాజ్ నటన ఎప్పుడూ సూపర్ హిట్టే' అన్న ప్రేక్షక, పరిశ్రమ ప్రశంసలందుకున్న నటబలరాజ్ సాహ్నీ 1913 మే ఒకటిన బ్రిటీష్ ఇండియా పంజాబ్‌లోని రావల్పిండిలో జన్మించారు. 1973 ఏప్రిల్ 13న ముంబైలో కన్నుమూశారు.

# 28వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవ విశేషాలు

- బాలాజీ (కోల్‌కతా)

**ఒకవైపు** పర్యావరణంలో విపరీత మార్పులు. కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ గ్లోబునే బలితీసుకునే పరిస్థితి. మరోవైపు గ్లోబలైజేషన్ వివిధ ప్రాంతాల సామాజికార్థిక సమస్యలను మరింత ఎగదోస్తూ బలవంతపు వలసలకు దారి తీస్తోంది. ఫలితంగా గత దశాబ్దంలోనే దాదాపు ఆరు కోట్లమంది అంతర్జాతీయంగా వలసలు పోయారట! 2 కోట్ల 66 లక్షల మంది రెఫ్యూజీలూ, 44 లక్షల మంది పరదేశంలో శరణు కోరేవారూ, 5 కోట్ల 9 లక్షల మంది అంతర్గతంగా నిర్వాసితులైన వారూ, అసంఖ్యాక అక్రమ వలసదార్లూ ... ఈ లెక్కలకు అంతేలేదు! రెక్కలు వచ్చిన పెట్టుబడికి ఎల్లలే లేవు. అది ఎక్కడికైనా ఎగురుకుంటూ వెళ్ళొచ్చు. కానీ ప్రాణభీతితోనో లేక మనుగడ కోసమో వలసలు పోయే వారిపైనే ఆంక్షలన్నీ! తమ బిడ్డల్ని అమెరికాలకు పంపినవారే రోహింగ్యా శరణార్థులపై కక్షగట్టడం ఈ కాలపు విషాదం. ఇటీవల జరిగిన 28వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో సినిమాలు చూస్తున్నప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఈ శరణార్థుల, వలసదారుల ఇతివృత్తాలే ప్రతిచోటా పునరావృతమౌతూ కనిపించాయి. డిసెంబర్ 15 నుండి 22 వరకు జరిగిన ఈ ఫెస్టివల్లో అంతర్జాతీయ పోటీ విభాగంలో ఉత్తమ చిత్రాలుగా సంయుక్తంగా గోల్డెన్ రాయల్ బెంగాల్ టైగర్ అవార్డును గెల్చుకున్న రెండు సినిమాల్లోనూ ఇదే థీం. ఈ సినిమాల గురించి క్లుప్తంగా చూద్దాం.




### 1. అపాన్ ఎంట్రీ (ప్రవేశించినంతనే) (2022/ స్పెయిన్/ దర్శకులు : అలెజాండ్రో రోజాస్, జువాన్ సెబాస్టియన్ వాస్క్వెజ్ / 74 ని.లు.) :

వెనిజులాకు చెందిన 38 ఏళ్ల డియెగో, 32 ఏళ్ల బార్సిలోనా డాన్సర్ ఎలీనా సరికొత్త అవకాశాల కోసం ఆమోదిత వీసాలతోనే అమెరికాకు వెళతారు. వారు పెళ్ళి చేసుకోకుండానే కలిసి జీవిస్తున్నారు. ఈ ప్రయాణానికి కొద్దిరోజుల ముందు డియెగో పాస్‌పోర్టు దొంగతనమైతే మరో డూప్లికేట్ పాస్‌పోర్టు తయారుచేయించుకున్నాడు. బార్సిలోనా నుండి న్యూయార్క్ వచ్చి, అక్కడ్నుంచి మియామీ కోసం కనెక్టింగ్ ఫ్లైట్ క్యాచ్ చేయాలన్నది వారి ప్లాన్. ఈలోగా ఎయిర్‌పోర్ట్ బయట డియెగో తన బంధువును కలుసుకోవాలి. ట్రంప్ ఎన్నికైన తర్వాత విదేశీయుల రాకపై కొత్త ఆంక్షలు పెడుతున్న ఆ కాలంలో ఈ జంట న్యూయార్క్ విమానాశ్రయంలో 'ప్రవేశించినంతనే' వారి ప్లానింగ్ అంతా తలకిందు లౌతుంది. ఇమిగ్రేషన్ ఏరియా నుండి రెండో తనిఖీ కోసం అధికారులు మరో గదికి తీసుకువెళతారు. అక్కడ వారిని సరిహద్దు అధికారులు చెత్త చెత్త ప్రశ్నలతో అసహ్యకరమైన తనిఖీ ప్రక్రియకు గురిచేస్తూ మానసికంగా హింసిస్తారు. ఒకరికొకరు ఇంకా చెప్పుకోని వారి వ్యక్తిగత రహస్యాలను పైకిలాగి, వారి పరస్పర నమ్మకాలను ధ్వంసం చేస్తారు. వారి కనెక్టింగ్ ఫ్లయిట్ కూడా మిస్సవుతుంది. ఇది చిన్న సినిమానే. ఇమిగ్రేషన్ ఆఫీసు గదుల్లోనే మొత్తం సినిమా సాగినా చాలా ఆసక్తికరంగా చివరికంటా సాగుతుంది.

### 2. కురా పొఖీర్ శూన్యే ఉరా (ది గోల్డెన్ వింగ్స్ ఆఫ్ వాటర్‌కాక్స్) (నీటికోడి ఆకాశయానం)/ (2021/ బంగ్లాదేశ్/ దర్శకుడు: ముహమ్మద్ కయ్యూమ్/ 117 ని.లు.) :

బంగ్లాదేశ్‌లోని హౌర్ అనే ప్రాంతానికి సంబంధించిన కథ. అక్కడ ఎప్పుడు వర్షం పడుతుందో ఎవరూ చెప్పలేరు. సంవత్సరానికి ఏడు నెలలు ఆ ప్రాంతం నీట మునిగి వుంటుందనీ, వర్షాలు లేని కాలంలో వరి పండిస్తారనీ, కొన్నిసార్లు ఆ పంట కూడా వరదల పాలౌతుందనీ సినిమాను ప్రెజెంట్ చేయడానికొచ్చిన దర్శకుడు చెప్పాడు. అక్కడి వ్యవసాయ కూలీల, పేదరైతుల జీవితాలకు అద్దం పడుతుంది ఈ సినిమా. ఆ వూర్లో తుఫాను వల్ల తన కొడుకునూ, కథాక్రమంలోనే వరదల వల్ల బుల్లి మనవడినీ కోల్పోతాడు ఓ ముసలాడు. విధవరాలైన కోడలూ, మనవరాలూ ఉన్నారు. వ్యవసాయంలో సాయపడడానికి సుల్తాన్ అనే వలసకూలీ వారింట్లో వున్నాడు. సుల్తాన్ ఆ విధవరాలైన కోడలికి దగ్గరై, ఆమెను వివాహం చేసుకుంటాడు. వర్షాలు తగ్గాక, ప్రకృతి అనుకూలించాక, అప్పుచేసి వరి నాటుతాడు. కానీ ఆకస్మిక తుఫాను చేతికి రాబోయిన బంగారు పంటను నీటముంచేస్తుంది. చివరికి పడవల్లో వలసపోతూ ఆ ప్రాంతానికి కన్నీటి వీడ్కోలు చెబుతారు. వరదలు లేనప్పుడు చేపలూ, లేత చిగుర్లూ తినడానికి నీటి కోళ్లు ఆ ప్రాంతానికి వస్తాయి. ఆ ప్రాంతం నీట మునిగినంతనే దూరపు కొండల్లోకి ఎగిరిపోతాయి. ఆ పక్షుల జీవితాన్ని అక్కడి బడుగుల బ్రతుకుకు మెటాఫర్‌గా అన్వయిస్తూ తీసిన డాక్యుడ్రామా ఈ సినిమా. వరదల మధ్య చిక్కుకున్న ప్రజలకు ఆ గ్రామం పక్క నుండి వెళ్లే పెళ్లి నౌకే పెద్ద

ఆనందహేతువుగా వుంటుంది. ఇలా ఆ ప్రాంతాన్ని వివిధ పరిస్థితుల్లో, వివిధ రుతువుల్లో దృశ్యీకరించడానికి దర్శకుడు చాలా ఏళ్లు కష్టపడ్డాడు. బంగ్లాదేశ్ ఫిల్మ్ సొసైటీ ఉద్యమకర్త అయిన ఈ దర్శకుడు తన మొదటి సినిమా నిర్మించడం కోసం 20 ఏళ్లు వేచి ఉన్నాడు.

శరణార్థుల జీవితాలపై వచ్చిన మరో గొప్ప సినిమా –

**3. దర్టీ డిఫికల్ట్ డేంజరస్ (మురికైన, కష్టతరమైన, ప్రమాదకరమైన) (2022 / ఫ్రాన్స్ / దర్శకుడు : విస్సమ్ షరఫ్ / 83 ని.లు.):**

అది లెబనాన్‌లోని బీరూట్ నగరం. సిరియన్ శరణార్థి అహ్మద్. సెకండ్ హ్యాండ్ మెటల్ స్క్రాప్ అమ్ముకుంటూ బ్రతుకుపోరు సాగిస్తున్నాడు. సిరియా ఘోర యుద్ధంలో ఉండగా పారిపోయి వస్తున్నపుడు ఓ బాంబు దాడికి గురైయ్యాక అతడికో వింతరోగం వచ్చింది. శరీరం క్రమంగా లోహంగా మారుతోంది. బీరూట్‌లో ఎప్పటికప్పుడే సిరియన్ శరణార్థులపై దుండగులు దాడులు చేస్తుంటారు. ఇక, ఇథియోపియా నుండి వలస వచ్చిన మెహదియా ఓ వృద్ధ జంట కోసం ఇంటి పనిమనిషిగా వుంది. కానీ ఆ ఇంటి ముసలాడికి ఓ మానసిక రోగం. భయంకరంగా పనిమనిషి మీద దాడిచేస్తుంటాడు. పని వదిలి ఇంటికి పోదామంటే ఇంటివారు ఓ ముసలాడికి కట్టబెట్టాలని నిశ్చయించుకుని వున్నారు. అహ్మద్‌కీ, మెహదియాకీ మధ్య రహస్య ప్రేమ. ఆ కాలనీకి వచ్చి 'ఐరన్, కాపర్, బేటరీ' అని అహ్మద్ అరిస్తే మెహదియాకు సిగ్నల్ అందినట్టే. దొంగతనంగా ముద్దుపెట్టుకోవడం కూడా వారికో సాహస చర్యే. యజమానురాలికి ఈ విషయం తెలిసి రాద్ధాంతం చేస్తుంది. శరీర ఛాయ, భాషా సంస్కృతులు వేరైనా ఒకే మతం, నిశ్చితంగా లేని జీవితాలూ ఆ జంటను ఒకటిగా చేశాయి. భవిష్యత్తు ఎలా వుండొచ్చో వారిరువురికీ తెలీదు. కానీ కోల్పోడానికి కూడా వారి దగ్గర ఏమీలేదు. అందుకే చిక్కిన చిన్న అవకాశాన్ని దొరకబుచ్చుకుని, ఒక ఏజెంటు దగ్గర దొంగ డాక్యుమెంట్లు సంపాదించి కొత్త దేశంలో కొత్త భవిష్యత్తు కోసం ప్రయాణమౌతారు! స్థానికుల దృష్టిలో ఈ వలస కూలీలు పనికిరాని పాతసామాను లాంటి వారే. మళయాలీని బంగ్లాదేశీగా, ఇథియోపియా పిల్లని శ్రీలంకన్‌గా ముఖాలు చూసి ఊహాగానాలే కానీ, వారి బతుకువెతలు ఎవరికీ పట్టవు. సినిమా టైటిల్ ఆ దుర్భర బ్రతుకులనే వర్ణిస్తుంది.

స్పెషల్ స్క్రీనింగ్ విభాగంలో ప్రదర్శించిన కొన్ని మంచి సినిమాల గురించి చూద్దాం.


**4. నైబర్స్ (పొరుగువారు) (2022 / స్విట్జర్లాండ్ / దర్శకుడు : మనో ఖలీల్ / 124 ని.లు.) :**

సిరియా–టర్కిష్ సరిహద్దులోని కుర్దిష్ గ్రామంలో గడిచిన తన చిన్ననాటి జ్ఞాపకాల ప్రేరణతో దర్శకుడు ఈ సినిమా నిర్మించాడు. సున్నితమైన సెరో అనే పిల్లాడి దృష్టిలో కుర్దిష్ ప్రజల కష్టాలను హైలైట్ చేశాడు దర్శకుడు. అక్కడ కుర్దులూ, యూదులూ కలిసి మెలిసి వుండేవారు. మారిన పరిస్థితుల్లో యూదు పరివారాలు అక్కడ్నుంచి పలాయనం చిత్తగిస్తున్నాయి. కానీ సెరో పక్కింట్లో ఇప్పటికీ ఆ గ్రామంలోని ఆఖరు యూదు పరివారం కొనసాగుతోంది. ఆ వూరి బడికి కొత్త సిరియన్ ఉపాధ్యాయుడి రాకతో సెరో నిర్లక్ష్య బాల్యానికి ఆంక్షలు పడతాయి. కొత్త టీచరు కఠోరమైన నియమాలు ప్రవేశపెడతాడు. కుర్దిష్ మాట్లాడ కూడదు, అరబిక్ మాత్రమే మాట్లాడాలి. యూదులు ప్రపంచానికే శత్రువులనీ, వారు చిన్నపిల్లల్ని చంపేసి వారి రక్తంతో కేకులు తయారు చేసుకుంటారనీ, ఇలా వింత వింత కథలతో పిల్లల మెదడులో విషం నింపుతుంటాడు. కానీ తన పొరుగున వున్న యూదులను గమనించే సెరోకు ఈ మాటలు మింగుడు పడవు. ఆ మాటలు ప్రమాదకరంగా, అసంబద్ధంగా అనిపిస్తాయి. ఒక ప్రధాన శత్రువు బూచి చూపుతున్న వారు తమ కుర్దుజాతిపై కూడా కక్షగట్టిన వారే అన్న విషయం సెరోకు తను పెరిగే క్రమంలో అర్థమౌతుంది. అతడు మరో దేశంలో పెరిగి, పెద్దై తన చిన్ననాటి గ్రామాన్ని చూట్టానికి సినిమా ఆఖర్లో వస్తాడు. అప్పటికి అది ఓ శరణార్థి శిబిరాల గుట్టగా మారివుంటుంది. ఈ సినిమా 43 అంతర్జాతీయ అవార్డులు గెలుచుకుంది. బహుశా ఇదే కథ ఇజ్రాయిల్ దేశంలో లేక మనదేశంలో మరో రకంగా కనిపించవచ్చు. కానీ అన్నిచోట్లా విద్వేష రాజకీయాలు అనుసరించే పద్ధతి ఒకటే. వాటిని పసిగట్టడంలో జనాలే బోల్తా పడుతుంటారు.

**5. నజర్‌బంద్ (బందీ) (2022 / ఇండియా / దర్శకుడు : సుమన్ ముఖోపాధ్యాయ / 83 ని.లు.) :**


బెంగాలీ రచయిత్రి ఆశాపూర్ణా దేవి రాసిన 'చుటీ నాకోచ్' కథ ఆధారంగా తీశారీ సినిమాను. కోల్‌కతా సెంట్రల్ జైలులో ఐదేళ్లు గడిపి విడుదలౌతుంది వాసంతీ మహతో. ఆమెతో పాటు రెగ్యులర్












జైలుపక్షి చందూ కూడా విడుదలౌతాడు. వాసంతీ తన భర్త తనను ఇంటికి తీసుకుపోతాడని జైలు బయట చాలాసేపు ఎదురుచూస్తుంది. ఆమెను దూరాన్నించి గమనిస్తుంటాడు చందూ. ఎంతకీ ఎవరూ రాకపోయేసరికి తనే తన బస్తీనీ, భర్తనూ, ఏడేళ్ల కొడుకునూ వెతుక్కోడానికి బయల్దేరుతుంది వాసంతి. ఆమెను సంహరించాలనే అన్న నీచమైన ఉద్దేశంతో ఆమె వెంటపడతాడు చందూ. గతంలో తనున్న చోటికి వెళ్తే అక్కడ ఉషా ఫ్యాక్టరీ గానీ, పేదల బస్తీ గానీ లేదు. ఇప్పుడక్కడ పెద్ద షాపింగ్ మాల్, కొన్ని బహుళ అంతస్తుల భవనాలూ కనిపిస్తాయి. తనవాళ్ల ఆచూకీ కూడా దొరకదు. అక్కడ్నుంచి వాసంతీ, చందూల దీర్ఘయాణం మొదలౌతుంది. నమ్మకం, అపనమ్మకం, దగా, పశ్చాత్తాపం – ఇలా చాలా డైనమిక్‌గా మారిపోతూ వారి సంపర్కం ఓ రోలర్ కోస్టర్ రైడ్‌లా గింగుర్లు తిరుగుతుంది. రాజకీయ గూండాలూ, వేశ్యా వ్యాపారులూ, రియల్ ఎస్టేట్ మాఫియాలూ, పోలీసులూ కథలోకి ప్రవేశిస్తారు. ప్రతిసారీ ఆమెను అమ్మేసి సొమ్ముచేసుకోవాలనుకునే చందూ ఆమె రక్షకుడిగా మారుతూ ఉంటాడు. వాసంతి కూడా మొండి మనిషే. ఎలాగైనా తన భర్తాబిడ్డలను వెదికి పట్టుకోవాలని పట్టుదలతో వుంటుంది. వాసంతి, చందూల ప్రయాణం కోల్‌కతాను దాటి దేవ్‌ఘర్ బాబాధాం తీర్థయాత్ర మీదుగా ఝార్ఖండ్ బొగ్గు గనుల ప్రాంతంలోని వాసంతి భర్త స్వగ్రామానికి చేరుతుంది. ఇంత చేసీ ఆమెకక్కడ మిగిలింది విషాదమే. వాసంతీ, చందూలిరువురూ తమ యజమానుల కోసం నేరం చేసి జైలుకు వెళ్లిన వారే. ఆ సామ్యమే వార్ని ఒకటి చేస్తుంది. ఈ సినిమాలో నూతన పరిచయంగా వచ్చిన ఇందిరా తివారీ, తన్మయ్ ధనియా అద్భుతంగా నటించారు. కరోనా కాలంలో నిర్మితమైన ఈ సినిమా బూసాన్‌తో మొదలుపెట్టి ఎన్నో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పాల్గొంది. ఇండియాలో ఇదే మొదటి ప్రదర్శన.

సినిమా ఇంటర్నేషనల్ (నాన్ కాంపిటీషన్) విభాగంలో కూడా మంచి సినిమాలున్నాయి. ఉదాహరణకు –

### 6. నో బేర్స్ (ఎలుగుబంట్లేం లేవు) (2022 / ఇరాన్ / దర్శకుడు: జాఫర్ పనాహీ / 104 ని.లు.) :

నిషేధాల మధ్య కూడా సినిమాల్ని ఎలా తీయాలో, వాటి సామాజిక శక్తులను ప్రశ్నించేలా ప్రగతిశీలంగా ఎలా మలచాలో జాఫర్ పనాహీకి మాత్రమే తెలుసు. నిర్బంధాలకనుగుణంగానే అతడు కథ, స్క్రిప్టూ రాసుకుంటాడు. ఈ మధ్యలో తీసిన చాలా సినిమాల్లోలానే ఇందులో కూడా పనాహీ తను తనుగానే అంటే డైరెక్టర్ జాఫర్ పనాహీగానే కనిపిస్తాడు. ఇరాన్‌లో టర్కీ బార్డర్‌కి సమీపంలోని ఓ గ్రామంలో అద్దె ఇంట్లో వుంటూ, సరిహద్దుకు అవతలి వైపున టర్కీలోని ఒక ప్రేమ జంట కథకు పరోక్షంగా దర్శకత్వం వహిస్తుంటాడు. టర్కీ నుండి ఒక జంట నకిలీ పాస్‌పోర్ట్‌లను తయారుచేసుకుని ఫ్రాన్సుకు పారిపోతున్న దృశ్యాన్ని అక్కడి అసిస్టెంట్ సహాయంతో షూటింగు చేయించాలి. రాత్రిపూట




దొంగచాటుగా బార్డర్‌కు వెళ్లి, మరో అసిస్టెంట్ డైరెక్టర్ సహాయంతో పుటేజీతో కూడిన హార్డ్ డ్రైవ్‌ను సంగ్రహించాలి. ఇదీ ఏర్పాటు! కానీ ఇక్కడ పనాహీ తను విడిది ఉంటున్న గ్రామం రాజకీయాల్లో చిక్కుకుంటాడు. ఆ ఊరి సంప్రదాయం ప్రకారం ఆడపిల్ల పుట్టినపుడు బొడ్డుతాడును ఆమెకు కాబోయే భర్త పేరున కోస్తారు. పెద్దయ్యాక ఆ వ్యక్తినే పెళ్లి చేసుకోవాలి. గ్రామ పంచాయితీ అనుమతి లేనిదే వేరే సంబంధం పెట్టుకోకూడదు. కానీ ఆ వూరి ఒకానొక అమ్మాయి సిటీలో చదువుకుంటున్న మరో అబ్బాయిని ప్రేమిస్తోంది. ఆ వూరిని ఫొటోలు తీస్తున్న క్రమంలో పనాహీ ఆ ప్రేమ జంటను కూడా ఫొటో తీశాడట! అలా అని అక్కడి ఓ చిన్న కుర్రాడు సాక్ష్యం చెబితే, ఆ ఫొటో తమకు కావాలనీ, అదిస్తే పంచాయితీ పెట్టి అవతలి అబ్బాయిని శిక్షిస్తామనీ వూరి పెద్దలు పనాహీపై వత్తిడి తెస్తారు. అలాంటి ఫొటో తన దగ్గర లేదు మొర్రో అంటే వినిపించుకోరు. ఖురానుపై ఒట్టేసి చెప్పమంటారు. ఇటు యూనివర్సిటీ అబ్బాయి కూడా పనాహీని రహస్యంగా కలిసి ఆ ఫొటోను ఎవరికీ ఇవ్వవద్దనీ, కొద్దిరోజుల్లో తన ప్రేయసీ, తనూ ఆ వూరి నుండి పారిపో బోతున్నామనీ చెబుతాడు. ఇలా ఈ సినిమాలో రెండు ప్రేమ కథలు సమాంతరంగా నడుస్తుంటాయి. పనాహీకి ఇల్లు అద్దెకిచ్చినందుకు ఆ ఇంటి ఓనర్‌పై పోలీసులు వత్తిడి తెస్తారు. తమ ఇరుగు పొరుగు వారికి కన్నీటి వీడ్కోలు చెప్పి ఫ్రాన్సుకు బయలుదేరుతున్న దృశ్యాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు ఆ టర్కీ జంట నిజంగానే భావోద్వేగానికి గురౌతుంది. ఎందుకంటే వారు నిజంగానే టర్కీ వదిలి వెళిపోవాలనుకుంటున్నారు గనుక! ఇటు గ్రామంలోని యువజంట కోసం ఒక విషాదం ఎదురు చూస్తోంది. సంప్రదాయాల సంకెళ్ల నుండి, ఆర్థిక బాధల సంకెళ్ల నుండి పారిపోవాలన్న పెనుగులాటను కొంత వ్యంగ్యంగా, కొంత విషాదంగా చిత్రిస్తాడు దర్శకుడు. ఈ ప్రయోగాత్మక సినిమాలో దర్శకుడి వ్యక్తిగత విషాదం కూడా ఉంది. దేశం విడిచి వెళ్లకూడదన్న నిషేధం పనాహీపై ఇప్పటికీ కొనసాగుతోంది. రాత్రిపూట బార్డర్ వైపుకి వెళ్లే వాళ్లను భయపెట్టడానికి 'ఎలుగుబంట్లు వుంటాయి' అని చెబుతుంటారనీ, నిజానికి 'ఎలుగుబంట్లేమీ లేవు' (నో బేర్స్) అనీ ఓ గ్రామీణుడు పనాహీతో అన్న మాటే ఈ సినిమాకు టైటిల్. సో, 'ఎలుగుబంట్లు' అంటే 'ఆంక్షలే'!

### 7. బాయ్ ఫ్రమ్ హెవెన్ (స్వర్గం నుండి వచ్చిన అబ్బాయి) (2022 / స్వీడన్/ దర్శకుడు : తారిక్ సలేహ్ / 120 ని.లు.):

ఒక పేద మత్స్యకారుని కుమారుడైన ఆడమ్‌కు సున్నీ ఇస్లాం రాజకీయాల కేంద్రమైన కైరోలోని అల్–అజార్ విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశం అందుతుంది. అతను చేరిన కొద్దికాలానికే విశ్వవిద్యాలయం ప్రధాన ఇమామ్ అకస్మాత్తుగా మరణిస్తాడు. ఖాళీ అయిన ఆ పదవి చేపట్టడం కోసం జరిగే పోరాటంలో మత పెద్దలూ, రాజకీయ ప్రముఖులూ పన్నే కుట్రలలో పావుగా

మారతాడు ఆడమ్. ఇది ఆసక్తికరంగా సాగే థ్రిల్లర్ కనుక మిగతా వివరాలు చెప్పకూడదు. ఏ దేశంలోనైనా మతమూ, రాజకీయమూ ఒకటైతే జరిగే నష్టమేదో, ఆయా అధికారుల ద్వంద్వ వైఖరులేమిటో, టెర్రరిస్టు సంస్థలనూ అధికార యంత్రాంగం ఎలా వినియోగించుకుంటుందో ఈ సినిమా చూస్తే తెలుస్తుంది. కాన్స్ పామ్ డియోర్ అవార్డు కోసం ఎంపికైన ఈ సినిమా బెస్ట్ స్క్రీన్‌ప్లే అవార్డు గెల్చుకుంది.

రెండేళ్ల క్రితం ప్రఖ్యాత దక్షిణ కొరియా దర్శకుడు కిమ్-కి-డుక్ కోవిడ్ కారణంగా చనిపోయిన సంగతి తెలిసిందే. అతని ఆఖరు సినిమా ఫుటేజిని స్క్రిప్టు ప్రకారం ఎడిటింగ్ చేసి 'కాల్ ఆఫ్ గాడ్' (దేవుడి పిలుపు)గా విడుదల చేశారు. 'ప్రేమ - స్వప్నం - వాస్తవం' సరిహద్దులు చెరిపేస్తూ సాగే ఈ సినిమాను ఆస్వాదించి తీరాల్సిందే. మరో కొరియా దర్శకుడు హిరొకాజూ కొరీదా 'బ్రోకర్' సినిమా కూడా ఈ సెక్షన్‌లో మరో మంచి సినిమా. పాకిస్తాన్ నుండి కాన్స్ అన్‌సెర్టైన్ రిగార్డ్స్ కోసం ఎంపికైన ఏకైక పాకిస్తాన్ సినిమా 'జోయ్‌ల్యాండ్' ప్రదర్శనకు భారీగా సినీ ప్రేమికులు విరుచుకుపడ్డారు. జర్మనీ ఫాతీ అకిన్ సినిమా 'రైన్ గోల్డ్', డారెన్ అరెనోఫ్స్కీ 'ది వేల్' మరికొన్ని ముఖ్యమైన సినిమాలు.

ఈ ఉత్సవంలో ఇరాన్ సినిమా 'సైలెంట్ గ్లోరీ' స్పెషల్ జ్యూరీ అవార్డును అందుకుంది. 'హిట్లర్స్ విచ్' (హిట్లర్ మంత్రగత్తె) సినిమా కోసం ఉత్తమ దర్శకులుగా ఎర్నెస్టో ఆర్డిటో, విర్నా మోలినా గోల్డెన్ రాయల్ బెంగాల్ టైగర్ అవార్డును గెలుచుకున్నారు. 'ఛాద్' అనే బెంగాలీ సినిమా, 'సికైసల్' అనే అస్సామీ సినిమాలు భారతీయ భాషా చిత్రాల విభాగంలో ప్రత్యేక జ్యూరీ అవార్డులను గెలుచుకున్నాయి. హైదరాబాద్ అబ్బాయి భాస్కర్ మౌర్య తెలుగులో నిర్మించిన 'ముత్తయ్య' భారతీయ భాషా చిత్రాల విభాగంలో ఉత్తమ చిత్రంగా హీరాలాల్ సేన్ స్మారక అవార్డును అందుకుంది. 70 యేళ్ల సినిమా పిచ్చి ఉన్న ముసలాడి కథ ఇది. మళయాల దర్శకుడు బిజూ దామోదరన్ తెలుగులో తీసిన 'స్థలం' సినిమాను కూడా ఈ ఉత్సవంలో ప్రదర్శించారు. 'నానేరా' అనే రాజస్థానీ చిత్రానికిగాను దీపాంకర్ ప్రకాష్ ఉత్తమ దర్శకుడిగా హీరాలాల్ సేన్ మెమోరియల్ అవార్డును గెలుచుకున్నారు.

ముహిద్దీన్ ముజఫర్ దర్శకత్వం వహించిన తజికిస్తాన్ చిత్రం 'దోవ్' (ఫార్చ్యూన్) సినిమాకు ఉత్తమ ఆసియన్ సెలెక్ట్ (నెట్‌పాక్) అవార్డు లభించింది. ఉత్తమ భారతీయ డాక్యుమెంటరీ చిత్రంగా నేహా శర్మా 'నైబ్రియమ్' (ది అన్‌సెటిల్డ్ షేడ్) గోల్డెన్ రాయల్ బెంగాల్ టైగర్ అవార్డును గెల్చుకుంది. ప్రత్యయ సాహా 'మై మెహ్‌మూద్'కు ఉత్తమ లఘుచిత్రంగా అవార్డు లభించగా, 'శూన్యత' (దర్శకుడు - నబాపన్ దెకా), 'హోథేర్ స్పర్శో' (దర్శకుడు - డా॥ ప్రసేన్‌జిత్ చౌధురీ) అనే లఘుచిత్రాలు ప్రత్యేక జ్యూరీ అవార్డులను అందుకున్నాయి.

42 దేశాల నుండి 130 ఫీచర్ ఫిల్మ్‌లు, 52 లఘుచిత్రాలూ, డాక్యుమెంటరీలతో సహా మొత్తం 183 సినిమాలను నందన్ కాంప్లెక్స్‌తో కలిపి మొత్తం పది థియేటర్లలో ప్రదర్శించారు. ఫ్రెంచ్ చలనచిత్ర దర్శకుడు, స్క్రీన్ రైటర్ అలైన్ రెస్నైస్, ఇటాలియన్ చిత్రనిర్మాత పియర్ పాలో పసోలినీ, గ్రీకు చలనచిత్ర నటుడు, దర్శకుడు మైఖేల్ కాకోయన్నిస్, దిలీప్‌కుమార్, అసిత్ సేన్, హృషికేష్ ముఖర్జీ, భారతీదేవి, కె ఆసిఫ్, హిందుస్తానీ శాస్త్రీయ సంగీతకారుడు అలీ అక్బర్ ఖాన్ వంటివారికి ఈ ఉత్సవం శతజయంతి నివాళులర్పించింది. ఇటీవల కన్నుమూసిన ఫ్రెంచి మాస్టర్ జా లుక్ గొదార్‌పై ఒక ప్రత్యేక పెవిలియన్‌లో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రాక్ పశ్చిమ సినిమాల సమ్మేళనంగా - ఉదాహరణకు చాప్లిన్‌తో అపూ పోటోలతో - తయారుచేసిన అడ్వర్టైజ్‌మెంటు పోస్టర్లు ఈ ఫెస్టివల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## సంపుటి : 16 సంచిక : 3 జనవరి 1993

**ప్రభుత్వ** సారాయి విషనాగై శ్రామిక ప్రజలను పిప్పిచేస్తుంటే అడ్డుకుంటున్న మహిళ ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండవ అట్టమీద రామానాయుడు రాసిన 'బతుకు భయం' కవితనూ, మూడవ అట్టమీద అఫ్సర్ రాసిన "ప్రేక్షకుడు కన్ను మూశాడు" కవితనూ, నాలుగవ అట్టమీద ఛాయరాజ్ రాసిన "ఉద్యమ 'సారాం'శం" కవితనూ ప్రచురించారు. "మతోన్మాదాన్ని ఓడించండి! మానవత్వాన్ని నెలకొల్పండి!!" అనే సంపాదకీయాన్ని, యస్. మనోహర్ రాసిన "మధురవాణి బహుళ ప్రయోజనాత్మక చర్యలు", కె. రవివర్మ రాసిన "యుగద్రష్ట గురజాడ - ఆధునిక తెలుగు నాటకం" వ్యాసాలను, కత్తుల కాంతయ్య రాసిన "నాను సెపుతున్నాను ఇనుకో!", క్రాంతికిరణ్ రాసిన 'సారాస్వామ్యం' అనే వ్యంగ్య రచనలనూ, పుప్పాల కృష్ణమూర్తి రాసిన 'చదువు' అనే గల్పికనూ ప్రచురించారు. డా॥ కిరణ్మయి రాస్తున్న ధారావాహిక "సామ్రాజ్యవాద భూతా(త)ల స్వర్గం-3", మిత్ర రాసిన 'కిరెన్' కథనం, చిత్రకన్య రాసిన "నువ్వేటి? నీ బతుకేటి" కథలనూ ప్రచురించారు. "నేల తడవని వాన" పుస్తకాన్ని ఛాయరాజ్ సమీక్షించారు. అలాగే "రోజా" కాదిది, హిందూ దురహంకారుల బాజా" అంటూ 'రోజా' సినిమాను ఉదయ్ సమీక్షించారు. సూర్యతేజ రాసిన "ఇదే నా వీడ్కోలు - ఇవే నా ఎదురుచూపులు", అల రాసిన 'మనిషికి చావులేదు', ఎన్.ఎన్.వాసు రాసిన 'ఒక పోరాటమే చేద్దాం', వై. ముకుంద రామారావు రాసిన 'సిటీ ఆఫ్ జాయ్', ఇక్బాల్ చంద్ రాసిన 'చూస్తుండు', డా॥ మానేపల్లి రాసిన "మనిషిని ప్రేమిస్తాను", దర్భశయనం శ్రీనివాసాచార్య రాసిన 'మత్తు నిషేదిద్దాం', దివికుమార్ రాసిన 'భారతీయ మానవతా', డా॥ సోమసుందర్ రాసిన "వేకువ పిట్టల గొంతుల్లో" కవితలనూ, దశరథ రాసిన 'అమ్మో! సారాయి దండం!', ఆకుల జి.డి.కె. రాసిన "సారా వద్దు బాబోయ్", దూడం నాంపల్లి రాసిన 'కిక్కెందుకురో', నిశితాసి రాసిన 'వేగుచుక్కలు', ప్రతీన్ రాసిన రసూల్ భాయి స్మృతిలో పాటలనూ, జనసాహితి కార్యక్రమాల వివరాలను తెలుపుతూ 'చైతన్యవాహిని'ని ప్రచురించారు.

1/8 డెమ్మీ; పుటలు : 60; వెల : రూ.5/-

## ధారావాహిక దేశ విభజన వస్తువుగా సాహిత్యం-5
# ఖుర్రతులైన్ హైదర్ రచనలు - 1

- కొత్తపల్లి రవిబాబు

**ఖుర్ర**తులైన్ హైదర్ ప్రముఖ ఉర్దూ రచయిత్రి. ఉపాధ్యాయిని. ఆమె తండ్రి సజ్జాద్ హైదర్ ఇల్దారిమ్ (1880-1948) ఉర్దూ కథానికా రచయిత. తల్లి నజర్ జహ్రా సజ్జాద్ హైదర్ (1894-1948) ఉర్దూ నవలా రచయిత్రి. ఖుర్రతులైన్ ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌లో 20-1-1927న జన్మించారు. ఖుర్రతులైన్ అనేది ఒక ఇరానీ కవి పేరు. దాని అర్థం "కనులకు సాంత్వన కలిగించేది" అని.

ఆమె ఢిల్లీలోని ఇంద్రప్రస్థ కళాశాలలోనూ, లక్నో విశ్వవిద్యాలయపు ఇజిబెల్లా థోబర్న్ కళాశాలలోనూ ఇంగ్లీషు ఎం.ఏ. చదివారు. దేశ విభజన కాలంలో ఆమె కుటుంబం 1947లో పాకిస్తాన్‌కు వలస వెళ్ళింది. దేశ విభజన సందర్భంగా జరిగిన దురాగతాలను ప్రత్యక్షంగా అనుభవించిన రచయితలలో ఆమె ఒకరు. డెహ్రాడూన్‌లో వారి ఇంటిని ఆమె కళ్ళముందే తగులబెట్టారు. తనూ, తన తల్లీ ప్రయాణం చేస్తున్న రైలుపై దాడి జరిగినప్పుడు వారిద్దరూ తృటిలో తప్పించుకున్నారు. పాకిస్తాన్ నుండి ఆమె 1960లో ఇంగ్లండ్ వెళ్ళారు. ఇంగ్లండ్ నుంచి ఇండియాకు 1961లో తిరిగి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. 20 ఏళ్ళపాటు బొంబాయిలో గడిపి, ఆ తర్వాత న్యూఢిల్లీ పరిసర ప్రాంతమైన నోయిడాలో స్థిరపడ్డారు. బొంబాయి నుండి వెలువడిన 'ఇంప్రింట్' పత్రికకు 1944-68లలో మేనేజింగ్ ఎడిటర్‌గా వున్నారు. 1968-75 సంవత్సరాలలో 'ది ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' పత్రికకు సంపాదకవర్గ సభ్యులుగా పనిచేశారు.

పాకిస్తాన్‌లో ఉన్న కాలంలో ఆమె ప్రసిద్ధ రచన 'ఆగ్‌కా దర్యా'ను 1959లో ఉర్దూలో రచించారు. దానినే 1998లో 'రివర్ ఆఫ్ ఫైర్' (అగ్ని ప్రవాహం) పేరుతో ఇంగ్లీషులోకి తానే అనువదించారు. 1958 నుండి 1969 వరకు పాకిస్తాన్ సైనిక నియంత ఆయూబ్ ఖాన్ అధ్యక్షుడిగా వుండి మార్షల్ లా ప్రకటించారు. ఆ కాలంలో ఈ నవల వివాదాస్పదమై, నిషేధింపబడిందని పుకార్లు వచ్చాయి. మొత్తంమీద అక్కడి రాజకీయ వాతావరణం నచ్చక ఆమె పాకిస్తాన్ వదలి ఇండియా పౌరసత్వం స్వీకరించారు.

మొత్తం 12 నవలలు, నాలుగు కథాసంపుటాలు ఆమె రచించారు. 1967లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1980లో జ్ఞానపీఠ బహుమతి, 1994లో అకాడమీ ఫెలోషిప్, 2005లో పద్మభూషణ్ ఆమె అందుకున్నారు.

ఆమె వివాహం చేసుకోలేదు. 21.8.2007న తన 80వ యేట నోయిడాలో మరణించారు.

దేశవిభజన కథావస్తువుగా ఆమె రాసిన ఆరు రచనలు ఇవి : 1). సీతాహరణ్ (సీత మోసగించబడింది - సీతా బిట్రేడ్); 2). హౌసింగ్ సొసైటీ; 3. రివర్ ఆఫ్ ఫైర్ (అగ్ని ప్రవాహం); 4. ఫైర్ ఫ్లైస్ ఇన్ ది మిస్ట్ (పొగమంచులో మెరిసే మిణుగురులు); 5. మై టెంపుల్స్, టూ; 6. షిప్ ఆఫ్ సారోస్ (విషాదాల నావ).

దేశ విభజన కాలంలో జరిగిన హింసకు దాడులకు గురైనవారిలో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా భౌతికంగా మానసికంగా గాయపడ్డారు. ఖుర్రతులైన్ తన రచనలలో ఈ అంశాన్ని బలంగా చిత్రీకరించారు. స్త్రీలను అవమానించడం, ఎత్తుకొనిపోవడం, లైంగికదాడులు చేయడం, అవయవ విచ్ఛేదం చేయడం, వారి స్వగ్రామాలకు దూరం చేయడం - ఇలా అనేక విధాలుగా మహిళలు చిత్రహింసలకు గురయ్యారు. పితృస్వామిక సమాజ అవలక్షణాలను రచయిత్రి తన రచనలలో దుయ్యబట్టారు.

**1. సీతాహరణ్ :** 'సీత మోసగించబడింది' అనే నవలికలో ప్రధానపాత్ర సీతామీర్ చాందిని అనే సింధీ (పాకిస్తాన్) ప్రాంతపు యువతి. విభజన వల్ల తన మాతృభూమి సింధ్‌ను వదలిపెట్టాల్సి వస్తుంది. తన మూలాల నుండి తొలగింపబడ్డ ఆమెకు ప్రేమ, ఆప్యాయత కరువైపోతాయి. నిరంతరం తాను నివసించిన తన సింధ్ గురించే కలవరిస్తుంది. తాను నివసించిన ప్రాంతంలోని పొలాలను గ్రామాలను జ్ఞాపకం చేసుకుంటూ వుంటుంది. విభజన సృష్టించిన శూన్యాన్ని పూడ్చుకోడానికి పురుషులపై ప్రేమ, విశ్వాసం చూపిస్తుంది. అయితే ఆమెకు పరిచయమైన పురుషులందరూ ఆమెను మోసం చేస్తారు.

దేశవిభజనానంతరం ఆమె ఢిల్లీకి శరణార్థిగా వలస రావడం ఒక బాధామయ గాథ. విభజన పూర్వం తన గ్రామంలో అనుభవించిన రక్షణ, సౌకర్యవంతమైన జీవితం అకస్మాత్తుగా మాయమైపోవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతుంది. ఢిల్లీకి చేరే క్రమంలో పలు పునరావాస కేంద్రాలలో బాధలు అనుభవిస్తుంది. స్వదేశం నుండి బహిష్కరణకు గురైనట్లు తలుస్తుంది.

కెనడాలో స్థిరపడిన ఆమె మేనత్త, మేనమామలు, వారికి పిల్లలు లేని కారణంగా సీతను దత్తు తీసుకోగా, ఆమె కెనడా వెళ్ళి కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరుతుంది. కుటుంబసభ్యుల అనుమతి తీసుకోకుండా, అక్కడ పరిచయమైన జమీల్‌ని పెళ్ళి చేసుకుంటుంది. పెళ్ళి ద్వారా జీవితంలో రక్షణ, స్థిరత్వం వస్తుందనుకున్న సీత వాటిని

పొందలేకపోతుంది. జమీల్ ఇష్టాలకనుగుణంగా మారుతుంది. కాని కొన్నేళ్ళకు జమీల్, సీత పట్ల విముఖత చూపిస్తాడు. దానితో ఆమె కలలన్నీ భగ్నమౌతాయి. ఆ దశలో కలకత్తా నుంచి కెనడాకు నటనలో శిక్షణ పొందటానికి వచ్చిన ఇస్లాం చౌధురి పట్ల ఆకర్షితురాలౌతుంది. సామాజిక నియమాలు తిరస్కరించి అతనితో సంబంధం పెట్టుకుంటుంది. అతడు కూడా పితృస్వామిక సమాజపు వాడేనన్నది రుజువుచేస్తూ సీతను జలీల్ దగ్గరకు వెళ్ళమంటాడు 'అతడు పెద్దమనిషి. నేనూ క్షమాపణ అడుగుతా. నీవు అతన్ని క్షమాపణ అడుగు' అని సలహా ఇస్తాడు.

ఈ విధంగా ఇద్దరు మగవాళ్ళ మోసానికి గురైన సీత ఢిల్లీకి తిరిగి వస్తుంది. అక్కడ బాల్య స్నేహితుడు ఇర్ఫాన్‌తో కలిసి పాకిస్తాన్‌కు వెళ్ళి, లాహోర్, సింధ్‌లలో తనకు పరిచయం వున్న ప్రదేశాలన్నీ తిరుగుతుంది. ఏడాదికొకసారి జరిగే సత్‌మేళా అనే జాతర తలచుకొని అక్కడికి వెళ్ళితీరాలనుకుంటుంది.

తండ్రి మరణవార్తతో ఢిల్లీ వచ్చి తల్లిని కలుస్తుంది. తనకు స్నేహితులు లేకపోవడం, ఒంటరితనం ఆవహిస్తుంది. ఎందరు మగవారిని నమ్మినా, వారు ఆమెను మోసం చేశారు. చివరకు బాల్యస్నేహితుడు ఇర్ఫాన్ కూడా కనపడకుండా పోతాడు. ఆవిధంగా ఆమె మోసగింపబడుతుంది.

**2. హౌసింగ్ సొసైటీ :** 'హౌసింగ్ సొసైటీ' మరో నవలిక. సి.ఎమ్. నయీమ్ దీనిని ఇంగ్లీషులోకి అనువదించారు. ముగ్గురు కథానాయికల చుట్టూ కథ తిరుగుతుంది. స్వతంత్రానికి పూర్వం వున్న ఇండియాలోనూ, స్వాతంత్ర్యానంతర పాకిస్తాన్‌లో ఈ కథ జరుగుతుంది. వివరాల్లోకి వెళ్ళకుండా స్థూలంగా ఈ నవలికలోని కథా సంగ్రహం చూద్దాం. ఉత్తరప్రదేశ్‌లో సాధారణ రైతు కుటుంబానికి, ఇరుగుపొరుగు గ్రామాలకు చెందిన ముస్లిం బాలికలు మంజుత్ ఉన్ నిశా, సూరయ్యా సుహాన్ (ఈమె మరోపేరు బసంతి బేగం). మూడో అమ్మాయి ముస్సోరిలోని ముస్లిం కలక్టరుగారి గారాల కూతురు ఛోటీ బిటియా (మరోపేరు సాల్మా మీర్జా).

విభజనకు ముందు గ్రామాలలో అన్ని మతాలవారు కలుపుగోలుగా, వరసలు పెట్టి పిలుచుకునే లౌకిక వాతావరణంలో పెరిగిన వీరు విభజనానంతర పరిస్థితులలో మానసికంగా, భౌతికంగా అనుభవించిన వేదన రచయిత్రి ఈ నవలలో చిత్రించారు.

మంజూర్ ఉన్ నిశాకు బాబాయి కొడుకు జంషెడ్‌తో వివాహం జరుగుతుంది. ఈమె తండ్రి గ్రామంలో గోమతి నది ఒడ్డున సూఫీ ఆలయ సంరక్షకునిగా వుంటాడు. విభజనానంతరం తల్లిదండ్రులను, భార్యను, కొడుకును వదలి జంషెడ్ పాకిస్తాన్‌కు వలస వెళ్తాడు. అక్కడ వ్యాపారంలో బాగా సంపాదించి, సంపన్నులలో ఒకడౌతాడు.

సూరయ్యా 13 ఏళ్ళ బాలిక. పలువురు భార్యలు వున్న 65 ఏళ్ళ భూస్వామి నవాబ్ భూరే సూరయ్యాను పెళ్ళిచేసుకుంటానని కబురు పంపితే, సూరయ్యా తండ్రి ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తాడు. భూస్వామి గూండాలు ఆమెను బలవంతంగా ఎత్తుకుపోతారు. కలెక్టర్‌గారి ఇంట్లో పనిమనిషిగా వున్న సూరయ్యా తల్లి, కలక్టర్‌గారి ప్రమేయంతో కూతురును తిరిగి తెచ్చుకుంటుంది. కలక్టరు సూరయ్యాకు రక్షణ కల్పించి ఆమె చదువుకోడానికి సహాయపడతాడు.

కలక్టర్‌గారి గారాల కూతురు ఛోటీ బిటియా. అసలుపేరు సాల్మా మీర్జా. బ్రిటిష్‌వారి కాలంలో ముస్సోరిలో ఉన్న ముస్లిం కలక్టరు అక్కడొక రాజులాంటివాడు. అన్ని హంగామాలు అనుభవిస్తున్నవాడు. కూతురు రాజకుమారి హోదాలో వుంటుంది. కాని దేశ విభజన సమయంలో ముస్సోరీలో కలక్టర్ ఇల్లు తగలబెడతారు. కలక్టరు, భార్య, కూతుర్లను తీసుకొని పాకిస్తాన్‌కు శరణార్థిలా వలస వెళ్తాడు. అక్కడ దిగువ మధ్యతరగతి జీవితాన్ని కష్టంమీద గడుపుతుంటారు. సాల్మా అన్న సాల్మన్ కమ్యూనిస్టుగా మారి అజ్ఞాతజీవితం గడుపుతుంటాడు. తండ్రికి (కలక్టర్) పక్షవాతం రాగా, సాల్మన్ అరెస్టు కాగా కుటుంబభారం అంతా, అంతకుముందు రాకుమారిగా పెరిగిన సాల్మా మీద పడుతుంది. చదువు పూర్తిచేసి స్కూలు టీచరుగా పనిచేస్తూ వుంటుంది. ఆ తర్వాత నూతనంగా సంపన్నుడైన జంషెడ్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తుంది.

సాల్మన్‌ను కలుసుకోవాలనే కోర్కెతో సురయ్యా కరాచీ వెళ్తుంది. అయితే అతన్ని కరాచీ నుండి ఎక్కడికో పంపించేసారని తెలుసుకుంటుంది. అక్కడ జరిగిన ఒక పార్టీలో జంషెడ్, తన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్న సాల్మాతో అసభ్యంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తుండగా సురయ్యా అతని చెంప పగులగొట్టి, తమ మూలాలను గుర్తుచేస్తుంది. అతను కాన్పూరులో ఒక లాయరు కొడుకనీ, మధ్యతరగతి రైతు కుటుంబమనీ, వివాహితుడనీ గుర్తు చేస్తుంది.

ఇండియాలోనే వుండి, జంషెడ్ తల్లిదండ్రులకు సేవచేస్తూ కాలం గడుపుతున్న భార్య మంజూర్ ఉన్ నిశాకు జంషెడ్ విడాకులు ఇచ్చి ఫర్హత్ నిశాను పెళ్ళి చేసుకొన్నాడు. ఇండియాను వదలివెళ్ళిన 11 ఏళ్ళ తర్వాత తిరిగి వచ్చి పాకిస్తాన్‌కు కూతురు తల్లి, సోదరుడు, చెల్లెలుతో తిరిగి వెళ్తాడు. అతని తండ్రి మాత్రం ఎక్కడో దాక్కొని పాకిస్తాన్ పోకుండా ఇండియాలోనే వుంటాడు.

**3. 'మై టెంపుల్స్ టూ' ('మేరే భీ సనామ్ ఖానా') :** ఖుర్రతులైన్ తన 19వ యేట ఉర్దూలో రాసిన మొదటి నవల ఇది. 2004లో ఆమె దీనిని ఇంగ్లీషులోకి అనువదించారు. ఉర్దూ సాహిత్యంలో కవిత్వం రాజ్యమేలుతున్న కాలంలో ఉర్దూలో నవలా ప్రక్రియను ఒక సాహిత్య రూపంగా ప్రవేశబెట్టిన నవల ఇది. సాధారణంగా సాహిత్య రచనలో అంతకు ముందున్న సంప్రదాయాలను ఉల్లంఘించి, పాతబడ్డ అరిగిపోయిన భావచిత్రణల స్థానంలో నూతనత్వాన్ని ఆమె ఈ నవలలో ప్రవేశబెట్టారు.

కథలోని మొదటి సగం భారతదేశం ఒకే దేశంగా, ఐక్యంగా వున్న కాలంలోనూ, రెండవ సగం విభజన తర్వాత కాలంలోనూ, లక్నో సమాజంలోని ఉన్నత మధ్యతరగతి యువతీయువకుల చుట్టూ జరుగుతుంది.

రక్షాంద కార్వాహ్ రాజ్‌కు చెందిన రాకుమారి. కున్వర్ రాజా ఆమె తండ్రి. కున్వర్ రాణా ఆమె తల్లి. రక్షాంద గాంధేయవాది.

హిందూ-ముస్లిం ఐక్యతకు కృషి చేస్తుంటుంది. 'న్యూ ఎరా' (నవతరం) అనే పత్రిక సంపాదకురాలుగా తన భావాలను ప్రచారం చేస్తుంటుంది. తల్లి తన కూతురు రక్షాంద కార్యక్రమాలను ఈసడించుకుంటూ వుంటుంది. తండ్రి సంప్రదాయవాది. ఆచారాలను, సంప్రదాయ వ్యవస్థను సమర్థిస్తాడు. అలాగే నూతనంగా ఏర్పడిన మధ్యతరగతిని ద్వేషిస్తాడు.

రక్షాంద సోదరుడు పీచూ. తన స్నేహితుడి ఇంగ్లీషు భార్యను క్రిస్టబెల్‌ను ప్రేమిస్తాడు. క్రిస్టబెల్ తన భర్తను, పీచూను వదలి లండన్ వెళ్ళిపోతుంది.

సైన్యంలో పనిచేసే డాక్టర్ సలీం, పీచూ స్నేహితుడు. డా॥ సలీం రక్షాంద చేపట్టిన కార్యక్రమాలను మెచ్చుకుంటాడు కాని హిందూ - ముస్లిం ఐక్యత సాధించడం ఊహాలోకంలోనే సాధ్యమంటాడు. రక్షాంద ఊహాలోకంలో వుందంటాడు. విభజన బాధితులకు సహాయనిధి సేకరణపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్వీన్ రోజ్ పాల్గొంటుంది. ఆ సందర్భంగా డా॥ సలీంతో ఆమెకున్న సంబంధం రక్షాందకు తెలుస్తుంది. నవల చివర్లో ఈయన రక్షాంద పినతల్లి కూతురు, అందగత్తెన ఖమర్ ఆరాను పెళ్ళిచేసుకుంటాడు.

'న్యూ ఎరా' పత్రిక ద్వారా హిందూ-ముస్లిం ఐక్యతా ప్రచారాన్ని మానుకొమ్మనమని రక్షాందకు వచ్చే ఆకాశరామన్న బెదిరింపు లేఖలను ఆమె లక్ష్యపెట్టదు. సోదరుడు పీచూ కూడా ఆమెకు నచ్చ చెప్తాడు. కాని ఆమె అంగీకరించదు.

విభజన తర్వాత మానసిక బాధతో కున్వర్ రాజా మరణిస్తాడు. మిగిలిన ఆస్తులతో రక్షాంద అన్న పోలు వ్యాపారం చేయడానికి ప్రణాళికలు వేసుకుంటాడు.

ఈ కులీనవర్గ బృందంలో మిగిలిన సభ్యులు, కిరణ్, విమల్, డైమండ్, గినీ.

సరిహద్దు అల్లర్లలో పీచూ చనిపోతాడు. కిరణ్ సైనిక శిబిరంలో బాంబు ప్రేలుడులో మరణిస్తాడు. డైమండ్ ఆమె కుటుంబంతో పాకిస్తాన్ వెళ్ళిపోతుంది. విమల్ రేడియోలో ఉద్యోగం చేస్తుంటాడు. రక్షాంద మానసిక రోగిగా మారి తనలో తాను - 'మొత్తం రోజంతా గడచిపోయింది', 'రోజంతా గడచిపోయింది' అనుకుంటూ వుంటుంది.

నవలలో ఔధ్ ప్రాంతంలో వున్న సమ్మిళిత సంస్కృతిని చూస్తాం. హిందువుల, ముస్లిముల ఆచారాలు, కర్మకాండలు, పండుగలు మొదలైనవాటిని రెండు మతాలవారు కలిసిమెలసి చేసుకోవడంలో నవలలో చిత్రించారు. కున్వర్ రాజా పిల్లలు హోలీ, దీపావళి, రామ్‌లీలా, ఈద్ పండుగలు హిందూ మిత్రులతో కలసి జరుపుకుంటారు.

**4. షిప్ ఆఫ్ సారోస్ విషాదాలనే ఓడ :** ఉర్దూలో 'సఫీనా ఎ ఘమ్ ఎ దిల్' పేరుతో 1952లో ప్రచురింపబడిన ఈ నవల ఖుర్రతులైన రాసిన రెండవ నవల. 2019లో సలీమ్ కిద్వాయ్ దీనిని ఇంగ్లీషులోకి అనువదించారు. హైదర్ తన 25వ యేట రాసిన నవల ఇది.

దేశం విభజింపబడటానికి రెండు దశాబ్దాల ముందు నాటి కథ ఇది. ఒక నవలలో సంప్రదాయసిద్ధంగా వుండే ప్రారంభం, కొనసాగింపు, ముగింపులు దీనిలో వుండవు. ఔధ్ ప్రాంతానికి చెందిన ముస్లిం శిష్టవర్గానికి (elite) చెందిన ఆరుగురు యువతీ యువకుల పాత్రలు - వారికి హిందూ, బ్రిటిష్ స్నేహితులతో గల సంబంధాలే దీనిలో కథావస్తువు.

విభజన కాలంనాటి భయోత్పాత, విషాద సన్నివేశాలేవీ దీనిలో వుండవు. కథ చెప్పే ఆనీ (Anne) ఆలీ, ఫరాద్, రియాజ్, రాహిల్, అరుణ్, మిత్రా, ఎల్మోర్‌ల ఆదర్శాలు, ప్రేమలు, ఆకాంక్షలు వుంటాయి. వీరిలో కొందరు రచయితలుగా, మరికొందరు నాట్యకారులుగా, ఇంకొందరు గాయకులుగా అభివృద్ధి అవుదామనుకుంటారు. అయితే దేశ విభజన వీరి కలలన్నిటినీ భగ్నం చేస్తుంది.

ఖుర్రతులైన ఈ నవలను చైతన్య స్రవంతి శైలిలో రాశారు. అన్వయ క్లిష్టత గల వాక్యాలు, ప్రయోగశీలత, ఎవరెవరు ఎవరితో మాట్లాడుతున్నారో అర్థంకాని సంభాషణలతో కూడిన ఈ నవలలో స్వీయచరిత్ర, కల్పన, చరిత్ర కలగలిపి వుంటాయి. దీనిలో రచయిత్రి చిత్రించిన ఆరు పాత్రలూ ఉన్నత మధ్యతరగతివారు. ఇంగ్లీషు వాతావరణంలో పెరిగినవారు. తాము గతించిన భూస్వామ్య సంస్కృతికి వారసులుగా గర్వపడేవారు. దీనిలో ఆనీ (Anne) పాత్ర రచయిత్రిదే. ఆమె ప్రత్యక్షంగా డెహ్రాడూన్‌లో జరిగిన మత హింస చూశారు. తమ ఇల్లు తగలబెట్టే భయానక దృశ్యాన్ని చూశారు. ఈ పాత్రలలో ఆలీ అనే అతను ఆనీకి అన్న అవుతాడు.

లక్నో ఆనాడు ఒక సాంస్కృతిక కేంద్రం. ఆ వూరిలో వున్న మిత్రులు ఆరుగురు ఉన్నత విద్యావంతులు - కాని వారు పతన సంస్కృతి వారసులు. వేటకు పోవడం - విలాసవంతమైన క్లబ్బులలో కాలక్షేపాలు, మేట్నీ షోలకు పోవడం, గ్రామ ఫోన్ రికార్డులు వినడం - డిన్నర్ పార్టీలు - రాత్రంతా గాలిబ్, లేక నాసిక్ రాసిన ఒక దోహామీద చర్చలు - బ్రిడ్జి ఆట ఆడటం, గ్రేటాగార్బో సినిమాలు చూడటం, ఆధునిక కవిత్వ రచన, లారెల్, హార్డీలను అభిమానించడం తాగిన నిషాలో కొట్లాడుకోవడం - ఇదీ వీరి సంస్కృతి. వీరు శరణార్థులు గుంపులు గుంపులుగా సొంత వూర్లు, సొంత ఆస్తులు, సొంత ఇళ్ళు వదలిపోవడం, ఆకలితో వారు మలమల మాడుతున్న దుస్థితి - శవాలతోనూ, గాయపడినవారితోనూ నిండిన రైళ్ళు, మొదలగు విభజననాటి విషాద దృశ్యాలను ఏమాత్రం పట్టించుకోరు. ఒక జింఘానా క్లబ్ నుండి మరొక క్లబ్‌కు - లక్నోలో మహమ్మద్ బాగ్ క్లబ్ - లాహోర్, కరాచీలలో క్లబ్బులకు పోవడం మాత్రమే వారికి తెలుసు. ఒక సందర్భంలో ఐతే కాన్పూరు నుండి లాహోర్‌కు ప్రైవేటు విమానంలో సరిహద్దులు దాటి వెళ్తారు.

ఐతే దేశ విభజన వీరి జీవిత విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఆనీ (కథకురాలు) అన్న ఆలీ కమ్యూనిస్టు తీవ్రవాదిగా సాయుధ విప్లవ కృషిలో తన గోపాల్‌పూర్ ఎస్టేట్‌లోని రైతులతో కలసి చేసిన పోరాటంలో అరెస్టయి, రెండేళ్ళ జైలుశిక్షకు గురౌతాడు.

**(వచ్చే సంచికలో : ఖుర్రతులైన్ రచనలు - 2)**

# సంతాపాలు

## ప్రజాస్వామికవాది కాకర్ల నాగేశ్వరరావుకి జోహార్లు



**ప్రజాస్వామ్య** హక్కుల పరిరక్షణ సంస్థ (ఓ.పి.డి.ఆర్.) కృష్ణాజిల్లా మరియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యులుగా కృషిచేసిన కాకర్ల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో 11-12-2012న అనారోగ్యంతో మరణించారు. తన 82వ యేట ఆయన 1940లలో కృష్ణాజిల్లా పెదముత్తేవి గ్రామంలో జన్మించారు.

నాగేశ్వరరావు కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కాకర్ల వెంకటేశ్వరరావుని పెదకామ్రేడ్ అని పిలిచేవారు. ఆయన బాల్యం నుండీ సంస్థ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఆయన భార్య కల్పన కూడా సంస్థ కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందించేవారు. కల్పన 2021లో కరోనాతో చనిపోయారు.

నాగేశ్వరరావు ఇల్లు ఒక గ్రంథాలయంగా, సాహిత్య సమావేశాల నిలయంగా వుండేది. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల అవసరాన్ని గుర్తిస్తూ కార్యక్రమాలను ఆ, ఆ గ్రామాలలో నిర్వహించేవారు. 1981 అక్టోబర్‌లో జనసాహితి రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం పెదముత్తేవిలో నిర్వహించినపుడు నాగేశ్వరరావు, కల్పన బాధ్యత వహించారు.

కంఠంనేని రవీంద్రరావు, సూరపనేని శేషగిరిరావుల సహచరునిగా ఓపిడిఆర్ సంస్థలో పనిచేశారు. పోలీసు నిర్బంధాలకు, ఎన్‌కౌంటర్ హత్యలకు, అక్రమ అరెస్టులు, కుట్రకేసులు బనాయించటానికి వ్యతిరేకంగా ఓపిడిఆర్ చేసిన కృషిలో భాగస్వాములయ్యారు. 1970, 80లలో దళితులపై అగ్రవర్ణాల దాడులకు వ్యతిరేకంగా సంస్థ చేసిన ఆందోళనల్లో చురుకుగా పాల్గొన్నారు. 'ప్రజాసాహితి' అభిమాని. ఈ అసమాన సమాజం మారాలన్న ఆకాంక్షతో చివరివరకూ జీవించిన నాగేశ్వరావుకు జనసాహితి జోహార్లు చెబుతూంది. వారి కుటుంబసభ్యుల బాధలో పాలుపంచుకుంటుంది. ●

## ప్రగతిశీల చలనచిత్ర నిర్మాత, దర్శకుడు కె.పి.శశి మరణం



**ప్రగతిశీల** డాక్యుమెంటరీల దర్శకుడు, నిర్మాత, కవి, కార్టూనిస్టు, సామాజిక కార్యకర్త, కరువన్నూర్ పూతన్వీట్టిల్ శశి 25-12-2022న తన 64వ ఏట త్రిచూర్‌లో మరణించారు. ఆయన త్రిచూర్‌లో 14-3-1958న జన్మించారు.

శశి తండ్రి కె. దామోదరన్, మార్క్సిస్ట్ సిద్ధాంతవేత్త. భారత కమ్యూనిస్టుపార్టీ సంస్థాపకుల్లో ఒకరు. తండ్రి రాజకీయాల ప్రభావంతో కె.పి. శశి జె.ఎన్.యూ.లో 1970లలో చదువు ముగించి, 1980ల ప్రారంభంలో 8MM ఫిల్మ్ తీయనారంభించారు. 35 సంవత్సరాలలో 25 చిత్రాలు నిర్మించారు. వీటిలో డాక్యుమెంటరీలే ఎక్కువ. ఆయన తొలితరం డాక్యుమెంటరీ నిర్మాతలలో ఒకరు.

ఆదివాసీలు, జాలర్లు, లైంగిక మైనారిటీలు, పర్యావరణ నేరాల వల్ల బాధితులైనవారు, మతోన్మాద బాధితులు మొదలగువారిపైనా, అణువిద్యుచ్ఛక్తి కేంద్రాలను వ్యతిరేకిస్తూ, మైనారిటీ మతస్తులపై హింసాకాండ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష ప్రశ్నిస్తూ ఆయన చిత్రాలు తీశారు. ఇరాక్‌పై అమెరికా చేసిన దాడిని సునిశితంగా విమర్శిస్తూ 4 నిముషాలు సంగీత వీడియో చిత్రించారు. పరిశ్రమల పేరుతో నగరాలలో జరిగే 'అభివృద్ధి' సృష్టించే విధ్వంసం గురించి ఒక నృత్య గేయ రూపకాన్ని 'గావ్ఁ ఛోడబ్ నహీ' చిత్రించారు. రసాయనిక ఫ్యాక్టరీ సృష్టిస్తున్న వాతావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా ఒక జర్నలిస్టు చేసిన పోరాటాన్ని 120 నిముషాల 'ష్! నిశ్శబ్దం! నిశ్శబ్దం!' అనే మూకీ ఫీచర్ ఫిల్మ్ తీశారు. 2008లో ఒరిస్సాలోని ఖాందమాల్ జిల్లాలో క్రిస్టియన్లపై హిందూ మతోన్మాద మూకలు చేసిన హింసాకాండను ఖండిస్తూ 'వాయిసెస్ ఫ్రమ్ రూయిన్స్' చిత్రించారు. నర్మదానదిపై నిర్మిస్తున్న మెడా డ్యామ్‌లకు వ్యతిరేకంగా ఆదివాసుల నర్మదా బచావ్ ఆందోళనను 'ఏ వ్యాలీ రిఫ్యూజస్ టు డై' (మృత్యువును తిరస్కరిస్తున్న లోయ)లో చిత్రించారు.

రెండు అస్థిపంజరాలు తమ మతం గురించి మాట్లాడుకునే కార్టూను, అందాల పోటీలను నిరసిస్తూ 'మిస్ పావర్టీ' అనే కార్టూను వారు వేసిన కార్టూన్లలో ప్రసిద్ధి చెందాయి. 'కౌంటర్ కరంట్స్' అనే ఎలక్ట్రానిక్ పత్రికలో ఆయన ఇంగ్లీషు కవితలు ప్రచురించేవారు. ఆ పత్రికకు ఆయన సలహాదారుడేకాక అసోసియేట్ ఎడిటర్ కూడా. జాతీయ సంఘీభావ వేదికలో కార్యకర్తగా కూడా ఆయన కృషిచేశారు. ఆసుపత్రిలో వున్న ఆయనను చూడటానికి వెళ్ళినవారితో "2024 ఎన్నికల్లో హిందుత్వ ఫాసిజంను ఓడించటానికి ఏం చేయాలో చర్చించాలి" అన్నారు. ●

# బొడ్డుపూల గోల

- ఈతకోట సుబ్బారావు

తలకొట్టెయ్
పెట్రోలు పోసి తగలెట్టెయ్
లేదంటావా -
ఇంటిల్లిపాదినీ సజీవంగా పాతై
దయచేసి బ్రేకింగ్ న్యూస్‌లు ఆపెయ్
పేగు పువ్వును కోల్పోయిన
చెరువంత దుఃఖంలో ఉన్నాం
రేకు రేకును విచ్ఛిన్నం చేసి
విసిరేసిన గాయం కొండ మోస్తున్నాం
రేటింగ్‌ల కోసం చర్చోపచర్చలు నిలిపెయ్
హెడ్డింగ్‌ల బల్లేలతో పొడిచి
ఉదయపు అక్షరాలు సగం చంపేసెయ్
మమ్మల్ని టార్గెట్ చేసి
ఛానెళ్ళు మా కన్నీళ్ళను లైవ్ ఇస్తున్నాయ్
మిగిలిన ఒకటి రెండు శ్వాసల తీగల్ని
ఆరాల ఆరెలతో ఒలుస్తున్నాయ్ ఖాకీ కాకులు
లోకాకుల్ని గురించి ఏం చెప్పను
ఇంటిముందు వడగళ్ల వాన కురిసినట్టుంది
కుల సంఘాలొకవైపు
విద్యార్థి సంఘాలు మరోవైపు
సానుభూతి శరాలతో
పిచ్చికేకల బాకులతో
చిత్రవధ చేసి చితి పేరుస్తున్నాయ్
మహిళా సమాజం మైకు గొంతుకులతో
మా బతుకుల్ని రోడ్డు మీదికి లాగింది
పాలకపక్షం పరామర్శలు
ప్రతిపక్షాల స్లోగలన్ లతో
మిగిలిన ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు
కరోనా సోకిన పేషంట్‌ల్లా
పూడుస్తారో కాలుస్తారో అగమ్యగోచరం
గల్లీల చర్చతో ఆగక ఢిల్లీ దాకా
గోల చేస్తున్నాయి రాజకీయాలు
ఆత్మీయతలు, ఆత్మ గౌరవాల గోడల నడుమ
గిరి గీసుకుని బతికే సాదాసీదాలం
పబ్లిక్‌గా మా వ్యక్తిత్వ హననాన్ని
మీ వెకిలి రాతలతో మా వంశ గౌరవాన్ని
మొత్తంగా మా జీవిత విధ్వంసాన్ని ఆపేయండి
న్యాయం, చట్టం రెండు కళ్లైన దేవుళ్ళారా
రాతి దేవత కళ్ళ గంతలు విప్పండి
మీ న్యాయా న్యాయాలు మాకక్కర లేదు
మా బతుకు మమ్మల్ని బతకనివ్వండి

# వాళ్లకేం తెలుసు.. పాపం పిల్లలు కదా..!

- సహచరి

ఎవరు జాతీయజెండా చేతికిచ్చినా
దేశభక్తుల్లా జై భోలో స్వతంత్ర భారత్ కీ,
జై జవాన్ జై కిసాన్ అంటూ
రహదారుల్ని నోర్లు చేసుకుని నడుస్తూనే ఉంటారు..
ఏ నినాదం అందించినా జాతీయ సమైక్యతకు..
నిదర్శనమేననీ ముందుకు సాగుతుంటరు..
ఎనకనుండి వాడెవడో భారత్ మాతాకి జై అంటూనే
హిందూ బంధువులమంటూ ముస్లింలపై విషం చిమ్మడం
కుండలో నీళ్లు తాగితే
మేఘ్వాల్‌ను చితకబాదిన సరస్వతీ పుత్రులు
ఆవు మాంసం తినలేదు కోడికూరే నన్నా
అఖ్లాక్‌ను అంతమొందించి నోళ్లు
ఇప్పుడు విమోచనాగీతం ఆలపించడమే ఓ విషాదం!
భూమికోసం భుక్తికోసం ఈ నేల విముక్తికోసం
అశువులు బాసిన తెలంగాణ అమరుల త్యాగాల సాక్షిగా..
నిజాం రజాకార్ల దొరల పీడనపై ఎదురొడ్డినోళ్లలో
బందగీలు, దొడ్డి కొమురయ్యలు, చాకలి ఐలమ్మలున్నరు
షోయబుల్లాలు మఖ్దూంలు రావి బద్దంల
త్యాగాలు తెలంగాణ విముక్తికోసమే కదా.
ఏలినోడు నిజామోడే కానీ
వెట్టిచాకిరీ కొనసాగింది దొరగడీల్లోనే కదా
ఇప్పుడు నిజాం మీద పోరు నీకు విమోచనమైతే
మాకు ముమ్మాటికీ విద్రోహపూరిత విలీనమే కదా
అయినా స్వతంత్రోద్యమంలో తెల్లదొరలకి
తెలంగాణ రైతాంగ సాయుధపోరులో
దొరగడీల పాలనకు పోలీస్ పటేల్లయ్ నోళ్ళు..
నువ్వన్న విమోచనమే నిజమైతే..
తెలంగాణ తొలి మలి పోరులో
పారిన నెత్తురు ఎవరిపాపమో చెప్పు
పాపం వాళ్లకేం తెలుసు పసిపిల్లలు కదా
వాళ్ల మెదళ్ళలో విద్వేషపు బీజాలు నాటకండి
మీ మత విద్వేష రాజకీయాలకు
భవిష్యత్ తరాల్ని జెండాకర్రలుగా మార్చకండి
గంగా జమునా తెలంగాణ సహజీవన సంస్కృతిని
విలసిల్లనీయండి!
జాతీయ సమైక్యత వర్ధిల్లనీయండి!!

# శిల్పిగా రూపొందాలనుకున్న కుందన్ కుమార్ మెహతా ఆశలను చిదిమివేసిన హిందుత్వ గుంపులు

**అతను** 22 ఏళ్ళ యువకుడు. పేరు కుందన్‌కుమార్ మెహతా. బీహార్‌లోని ముజఫర్‌జిల్లా ఫుల్‌కహా గొడైన్ గ్రామంలో రోజుకూలీ చేసుకునేవాని కొడుకు. చిన్నప్పటి నుంచి మట్టితో బొమ్మలు చేసే నైపుణ్యం సాధించినవాడు. లలితకళల కోర్సులో బెనారస్ హిందూ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ చేసి గుజరాత్‌లో వదోదరలోని మహారాజు సాయాజీరావు యూనివర్శిటీ (MSU)లో ఎం.ఏ.లో చేరాడు. ఈ కోర్సు ఆఖరి సంవత్సరంలో ఒక కళాకృతిని తయారుచేసి చూపించే పరీక్ష కోసం ఒక శిల్పాన్ని తయారుచేసాడు.

మన సంస్కృతిలో స్త్రీలను దేవతలుగా కొలుస్తాం. దేవతలుగా స్త్రీలు పలువురు వున్నారు. కాని స్త్రీలపై చేసే దాడులు మాత్రం పెరిగిపోతున్నాయి. దీనిని ఆ విద్యార్థి తన శిల్పంలో ప్రదర్శించాడు. పరీక్షాధికారులకు చూపించాడు. బహిరంగ ప్రదర్శనకు పెట్టలేదు. కాని ఆ శిల్పం ఫోటోలు తీసి ఎవరో బహిరంగపరిచారు. వాటిని ఆధారంగా హిందూగుంపులవారు ఆరోపణచేయగా పోలీసులు మే 9న అతనిపై 295ఎ – 298 సెక్షన్లు మోపి జూన్ 4న అరెస్టుచేసి నాలుగురోజులు తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. అక్కడే వుంటే తన ప్రాణానికి హాని అని పసిగట్టి అతను గ్రామానికి వెళ్ళిపోయాడు. ఈలోగా యూనివర్శిటీ సిండికేట్ సభ్యుడు హస్‌ముఖ్ వొఘెలా తాను చూడని ఆ శిల్పం తయారుచేసినందుకు, ఒక నిజనిర్ధారణ కమిటీవేసి, కుందన్‌కుమార్ షోకాజ్ నోటీసుకు జవాబు ఇవ్వలేదన్న సాకుతో, అతని భవిష్యత్తు బుగ్గిపాలు చేస్తూ విశ్వవిద్యాలయం నుంచి రస్టికేట్ చేసారు. అంటే అతను ఇక ఎక్కడా చదవడానికి వీలులేదన్నమాట. ఈలోగా అతను క్షమాపణ పత్రం పంపినా దానిని పరిగణనలోకి తీసుకోలేదు. అయితే కుందన్ కుమార్ తను రూపొందించిన కళాకృతిని బహిరంగంగా ప్రదర్శించలేదు గనుక పోలీసులు మోపిన సెక్షన్లు అతనికి వర్తించవని అడ్వకేట్ హితేశ్ గుప్తా ఆ విద్యార్థి తరపున వాదించారు.

ఇదీ హిందూగ్రూపులు రక్షిస్తున్న మన సంస్కృతి!

**(ది క్వింట్ సౌజన్యంతో)**

# శాస్త్రీయ అవగాహన పెంచే హేతువాదుల కార్యక్రమాలపై హిందూ తీవ్రవాద గూండాల దాడులు

**హిందూ** తీవ్రవాదులుగా తమను తాము పిల్చుకుంటున్న కొందరు గూండాలు ఈ ఏడాది (2022) నవంబరు 8న భువనేశ్వర్‌లో లోహియా అకాడమీలో జరుగుతున్న హేతువాదుల సమావేశంపై దాడి చేశారు. ఆరోజు చంద్రగ్రహణం సందర్భంగా సంప్రదాయవాదులు సోషల్ మీడియా ద్వారా, పత్రికల ద్వారా అందరూ ఉపవాసముండాలనీ, దేవాలయాలు మూసివేయాలనీ ఇలా ఎన్నెన్నో ప్రచారాలు చేసి ప్రజలను భయపెట్టారు. ఈ ప్రచారాలన్నిటినీ తిరస్కరిస్తూ, గ్రహణం ఎలా ఏర్పడుతుందో వివరించి, అది మనుషులను ప్రభావితం చేయడమనేది మూఢనమ్మకమనీ హేతువాదులు ప్రచారం చేస్తూ, తాము వాటిని పాటించకపోవడం వల్ల తమకేమీ హాని జరగదని ఋజువు చేయడానికి గ్రహణ సమయంలో ఉపవాసం బదులు సామూహిక విందులు ఏర్పాటు చేసి వాటిలో పాల్గొన్నారు.

ఇలా చేయడం వారి మతాచారాలకు వ్యతిరేకమనీ, సంప్రదాయాల పరిరక్షణ పేరుతో భువనేశ్వర్‌లోనూ బరంపురంలోనూ హేతువాదుల సామూహిక విందులపై దాడిచేశారు. వీరిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొమ్మనమని గణతాంత్రిక అధికార సురక్ష సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

అయితే దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని ఒక తిరోగమన చర్య ఒరిస్సా ప్రభుత్వం చేపట్టింది. అదేమిటంటే 2022 అక్టోబర్ 25న, సూర్యగ్రహణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యాలయాలకు, పోర్టులకు, బ్యాంకులకు సెలవు ప్రకటించింది. ఈ చర్య మతవాదుల గూండా దాడులకు దోహదం చేసింది. ఈ మతవాదులే గతంలో దభోల్కర్, కల్బుర్గి, పన్సారే, గౌరీలంకేశ్‌లను హత్యచేశారు. మతవాదుల పునరుద్ధరణవాద చర్యలను ఎక్కడికక్కడ ఎదుర్కోకపోతే, హేతువాదులపై శాస్త్రజ్ఞులపై మతోన్మాదుల దాడులు పెరిగే అవకాశం వుంది.

వ్యాసం

# పాతికేళ్ళు నిండిన అప్పుల భారత ప్రపంచీకరణ

- వొరాల కృష్ణమూర్తి

పాతికేళ్ళకిందట (1991) ఈ దేశం సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో ప్రపంచీకరణ ముసుగులో కనిపించని ఊబిలో కూరుకు పోయింది. నిత్యావసరాలైన కూడు, గుడ్డ, గూడు లేకపోయినా–తాగడానికి గుక్కెడు మంచినీళ్ళు కరువైనా ఇంట్లో టి.వీ. అరచేతిలో సెల్లూ పెట్టి వైకుంఠం చూపించేస్తోంది ప్రభుత్వం. జీవనదులన్నింటిని(క్రా) కోలా పానీగా పల్లె పల్లెల్లో పొంగిస్తూ–గ్రామీణ రైతుల్ని వారి జీవన వృత్తుల్ని ఆధునీకరణ పేరుతో పారిశ్రామిక అభివృద్ధి పేరిట బడా(మిల్లు) బాబులకు మితిమీరిన ఋణసాయాలతో ఆర్థిక పుష్టి కలగజేసి, సామాన్యులకు ఉపాధి హామీలు కాదు ఉచిత హామీల పేరిట లాప్‌టాప్‌లు, గ్రైండర్లు,చీరలు జాకెట్లు పసుపు కుంకాలను అందజేస్తూ అడుక్కుతినే వాళ్ళుగా అణగద్రొక్కేసే ప్రపంచీకరణ ఎవరికి మేలు చేసిందో మేధావులు లెక్కలు తేల్చాలి.

**అప్పటికి** ఇప్పటికి భూమి అంతేవుంది కదా. వ్యవసాయం పెరిగిందా తరిగిందా – ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారు. ఆ రోజుకు ఈరోజుకు నిరుద్యోగులు పెరిగారా తరిగారా ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు పెరిగాయా తరిగాయా ఆలోచిస్తే నిరుద్యోగం పెరిగింది. ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. ఇహ హాస్పిటల్స్‌లో ప్రైవేటు వారిదే రాజ్యం. ఈ పరిస్థితి ఎందుకు దాపురించింది. భూములు సెజ్‌ల పేరిట ప్రపంచబ్యాంక్ ఋణాలు బడాబాబులకు అప్పులకింద పోతే సామాన్యుల పాలిట మిగిలింది ఋణభారం.

ఆరోజు (1991) డాలరు మారకం విలువ రూ॥24.47. ఈరోజు (15.10.2016) డాలరు మారకం రేటు రూ॥66.71. మరి ఈ సరళీకృత ఆర్థిక విధానాల వల్ల రూపాయి విలువ పెరిగిందా తరిగిందా? 1966 నాటికి డాలరు మారకం విలువ రూ॥7.50పై కాగా అది 91-92 సంవత్సరానికి రూ॥ 24.47గా పతనమైంది. అంటే 25 సంవత్సరాలలో రూ॥16.97లుగా పడిపోతే అదే 91-92 నుండి ఈనాటికి అంటే 25 సంవత్సరాలకు 42.24గా దిగజారింది రూపాయి విలువ.

పాతికేళ్ళ కిందటి రైతుల ఆత్మహత్యలెన్ని? ఈరోజు ఎన్నో విశ్లేషించు కోవాలి. ఆనాడు నేరాల శాతం–నేటి తీరు పరిశీలించాలి.

సరళీకృత ఆర్థికవిధానమంటే సరళంగా దోచుకోవడమేనా? పెద్దలు ఒకరకంగా, చిన్నవాళ్ళు ఒకరకంగా సాదాజనాన్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వం ఒకరకంగా, దళారీలు ఒక రకంగా లూటీ చేస్తున్నారు. బాగా ఆలోచిస్తే ఈనాటి ఈ భాగోతానికి పాతికేళ్ళ కిందటి సరళీకృత ఆర్థిక విధానాలకు గేట్లు ఎత్తడమే కారణం అనిపించదా!

కవి రచయిత కళాకారుడు నడుస్తున్న ప్రభుత్వానికి నిజమైన ప్రతిపక్ష నాయకుడు. ప్రభుత్వ చేతల్ని రాతల్ని నిశితంగా పరిశీలించి సామాన్యుల జీవితాన్ని అవి ఎలా ప్రభావితం చేస్తున్నాయో విశ్లేషించేవాడే నిజమైన కవి, రచయిత, కళాకారుడు. సరళీకృత ఆర్థికవిధానాల పేరిట భారతీయుల జీవితాల్ని తాకట్టు పెడుతున్న ప్రభుత్వాన్ని ఎందరు రచయితలు కవులు కళాకారులు ప్రశ్నించారో తెలియదు గాని ముగ్గురు రచయితలు దివికుమార్, అరుణోదయ రామారావు, ఉదయ్‌లు బుర్రలుబద్దలు కొట్టుకుని ఆఘమేఘాల మీద నాటకం రాశారు. జనసాహితి – అరుణోదయ సాంస్కృతిక సంస్థలు "అప్పుల భారతం" పేరిట నాటకం ప్రదర్శనకు పూనుకున్నారు. గొంతు చించుకుని వీధిన పడ్డారు. 'అప్పుల భారతం' నాటకం జనాన్ని మైమరపించి మత్తులో పడేసేదికాదు. నిద్రమత్తు వదలగొట్టేది. భవబంధాలు–బాంధవ్యాల సాలెగూడులో కట్టిపడేసేది కాదు. మనిషికి మనిషికి ఉన్న బంధాన్ని, సామాన్య మనిషికి నాయకులకు ఉన్న సంబంధాన్ని – ప్రజలు, నాయకులు, ఎన్నికలు అనే మూడుముక్కలాటలో ప్రజలనే ఎప్పుడూ ఓటమి ఎందుకు వరిస్తుందో తెలిపే నాటకం.

'దేశమంటే మట్టికాదోయ్ – దేశమంటే మనుషులోయ్' అన్న సూక్తి మరువక ఆ మనుషులెలా మట్టిగొట్టుకు పోతున్నారో తెలిపే అద్భుత వ్యంగ్య వీధిభాగవతం 'అప్పుల భారతం'. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు దేశం గేట్లు బార్లా తెరుస్తూ భారత ప్రభుత్వం తరఫున నాటి ప్రధాని పి.వి. నరసింహారావు 1991 జులై నెలలో ఆమోద సంతకం పెడితే, 1991 నవంబరు 4వ తేదీ నుండి 'అప్పులభారతం' వీధి భాగవత యక్షగానం ప్రదర్శన ప్రారంభమైంది. అప్పటికే దివికుమార్ పసుమర్తి వెంకటేశ్వర్లుగారి వద్ద నాలుగు సంవత్సరాలుగా కూచిపూడి నాట్యం నేర్చుకుంటూండగా, ఉదయ్ మచిలీపట్టణంలో శాస్త్రీయ సంగీత విద్వాంసుల వద్ద శిక్షణ పొందుతూ వున్నారు.

రాజీవ్‌గాంధీ మరణానంతరం దేశ ప్రధానిగా పి.వి. నరషింహారావు ఎంపికయిన కాలానికి ఆయన పార్లమెంటు సభ్యుడు కాదు. అందుకుగాను నంద్యాల పార్లమెంటు సభ్యుడైన గంగుల ప్రతాపరెడ్డిచే రాజీనామా చేయించి, ఉప ఎన్నికలను నిర్వహించారు. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వాన్నేలుతున్న తెలుగుదేశం పార్టీ పి.వి.కి పోటీగా అభ్యర్థిని నిలబెట్టలేదు. బి.జె.పి. అభ్యర్థిగా బంగారు లక్ష్మణ్ పోటీచేయగా కమ్యూనిస్టుల తరఫున విప్లవపార్టీ అభ్యర్థి మండ్ల సుబ్బారెడ్డి నిలబడ్డారు. డంకెల్ ప్రతిపాదనంటే సామ్రాజ్యవాద ప్రపంచీకరణమే నంటూ పి.వి.

విధానాలను ఎండగడుతూ 'అప్పుల భారతం' వీధి భాగవత యక్షగానం నంద్యాల ఉపఎన్నికల సందర్భంగా అనేక చోట్ల ప్రదర్శించారు. ఆ విధంగా ప్రపంచీకరణకే కాక దాన్ని వ్యతిరేకిస్తూ రూపొందిన ప్రజాకళారూపమైన 'అప్పుల భారతం' ఆత్మకూరులో జరిగిన మొదటి ప్రదర్శనకు 2016 నవంబరు 4వ తేదీకి సరిగ్గా పాతికేళ్ళు.

మనం ప్రజాస్వామ్యం అనబడే వేతనబానిసల రాజ్యంలో బతుకుతున్నామని హెచ్చరించేది ఈ నాటకం. 1947లో రాజ్యం తెల్లదొరల చేతుల్లో నుండి నల్లదొరల చేతుల్లోకి మారింది. ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు లేకపోగా రొట్టె పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టు మాడిపోతున్నాం. ఆరోజు నుండి రూపాయి మారకం విలువ ఎలా పడిపోతున్నదో అందరికీ తెలిసిందే. రూపాయి మారకం విలువ పడిపోవడమంటే జీవన ప్రమాణాలు పడిపోవడమే.

డబ్బున్నవాడిదే రాజ్యం. మన ఎన్నికలు ఎంత బూటకమో 'అప్పుల భారతం' నాటకంలో గురువు శిష్యుల సంభాషణల్లో తేటతెల్లమవుతుంది.

"ధనం-కులం-సారా-గూండాయిజాలు లేకుండా ఎన్నికలెక్కడివి నాయనా?"

ఈ స్వాతంత్ర్యం బడాబాబులకు బాబాలకే గాని - సామాన్యులకు తిప్పలు, అప్పులు మాత్రమే! ముందుకు పోతున్నాం అనుకుంటూ వెనక్కు నెట్టేస్తున్నారు ప్రజల్ని.

పాలించే ప్రభువులకు-ప్రజలకు ఎంతో దూరం.

మంత్రిగారి "సభకు అంతా కట్టుదిట్టమేనా" అన్న సంశయానికి, "చీమ దూరకుండా ఖాకీబంట్లను సివిల్ డ్రస్‌లో నింపేశాం!" అంటాడు సేవకుడు. ప్రజలకు ప్రభువులకు అంత దూరం. కాబట్టే ప్రభువుల సభలకు జనం కరువైపోతున్నారు. అందుకే మన సభకు జనం వస్తారా అన్న ప్రభువుకు- 'నెల్లాళ్ళుగా ఊరూరా తిరిగి - వాడవాడనా జనం చెవుల్లో జోరీగల్లా ఊదరగొట్టేం. అయినా ప్రభుత్వ వాహనాల్లో జనాన్ని తరలించే ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభకు వచ్చినవారికి ఒక క్వార్టర్ బాటిల్. మనిషికి రెండొందలు - మన కార్యకర్తలు దగ్గరుండి చూసుకుంటున్నారు.' అని భరోసా ఇస్తారు అంతేవాసులు. అది ప్రజలకు ప్రభువులకు ఉన్న బంధం. అలాంటి ప్రభువుల పాలనలో ప్రజలెలా సుఖపడుతున్నారో చూపిస్తుందీ నాటకం.

"అయితే ఒకసారి చూద్దాం మన ప్రజల్ని" అంటాడు ప్రభువు.

'ప్రభువువారి అభిమానానికి తట్టుకోలేరు ప్రజలు. ఈ బుల్లెట్ ప్రూఫ్ కిటికీ అద్దంలోంచి చూడండి' అంటాడు సేవకుడు.

ప్రభువులు ప్రజలకు దూరమైతే రక్షణ వుండదు. అందుకే బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు రక్షక బలాల మధ్య తిరుగుతుంటారు. కూలీలు - కూలిపోయిన బతుకులోళ్ళు చేస్తున్న ఆందోళనలు అర్థంగాక ఏమిటీ ఆక్రందనలు - ఆకాశంలోనికి చూస్తూ, ఈ నిరసన లేమిటో? అని విస్తుపోయి అడుగుతాడు ప్రభువు.

"అది ధరల ఆకాశాన్నంటుకున్నాయని గగ్గోలు పెడుతున్న జనం గోడు. చెవులు మూసుకోండి ప్రభూ!" అంటాడు శిష్యుడు.

"ధరల్ని భూమ్మీదకు దింపి ఆదుకోండి. లేకుంటే ప్రజలకు ఆందోళనలు, ఆత్మహత్యలే శరణ్యం" అని ప్రజలంటే ఆత్మహత్యలు నేరం. నిరసనలు ఆందోళనలూ అణచివేయండి. నాసాలు మీసాలు అరెస్టులు అంటూ వూగిపోతాడు. 'భూమ్మీద వుండాల్సిన ధరలు ఆకాశాన్ని అంటడమా - వెయ్యండి కమిషన్. వందరోజుల్లో ధరల్ని భూమ్మీదకు దింపేద్దాం.' అంటూ వాగ్దానం చేస్తారు ప్రభువులు.

అధికార రాజకీయ నాయకులకు సమస్యలొచ్చినపుడు ఆదుకునే చిట్కా కమిషన్ వేయడం. అదే దారిలో మన ప్రభువు. ధరల సమస్యను ఈ సంవత్సరమంతా ఆలోచించి, రెండో సంవత్సరంలో కమిషన్ నియమించి, మూడవ సంవత్సరంలో భూమ్మీద వుండవల్సిన ధరలు ఆకాశాని కెందుకెళ్ళాయో తెలుసుకుని, నాల్గవ సంవత్సరంలో వాటిని ఎలా కిందికి దించాలో యోచించి, అయిదో సంవత్సరంలో... అందాక ప్రభువులు అధికారంలో వుంటే, ధరలు తగ్గించే ప్రయత్నం చేస్తారు. లేకుంటే లేదు. అంటూ శిష్యుడు కమీషన్ల గుట్టు విప్పుతాడు.

ఇహ కమీషన్‌లో మేధావి, మహామేధావి. మహామహా మేధావులు తేల్చే విషయాలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుంటుంది.

ఒక మేధావి - ధరలు ఆకాశం చేరుకోవడాని తమరి పాలన కారణం కాదు ప్రభూ! ప్రజల బుద్ధిహీనత, కుటుంబనియంత్రణ పాటించకపోవడం వల్ల"-అంటాడు.

మహామేధావి - "ప్రభూ అధిక జనాభా కారణం కాదు. తినడానికి నోరే కాదు. పనిచెయ్యడానికి రెండు చేతులున్నాయి. ఆ చేతులతో పనిచెయ్యక సమ్మెలని, సత్యాగ్రహాలని పోరాటాలు చేస్తూ రోడ్ల మీద తిరగడమే" - అని నిర్ధారిస్తాడు.

మహా మహా మేధావి - "ధరలు భూమ్మీద నుండి ఆకాశం చేరడానికి కారణం. భూమ్యాకర్షణ తగ్గి ధరలు అదుపు తప్పి భూమ్మీద నుండి ఆకాశంలోకి దూసుకుపోయాయి. ఆ ధరలను దించాలంటే దేశం నలువైపులా బలమైన అయస్కాంతాలు తెచ్చి పాతి పెట్టించినచో ధరలు వాటంతట అవే దిగి వస్తాయి" - అని శెలవిస్తాడు. ఆవిధంగా మేధావులందరూ ధరలు పెరుగుదలకు పాలకులు కారణంకాదని తేల్చేస్తారు.

ప్రభువుకు జ్ఞానోదయం అయి "తక్షణం ఆ అయస్కాంతాలు తెప్పించి నాటించు - ఇహ మీరే మా ఆర్థికమంత్రి - ధరలు దింపించండి" అని మ.మ.మేకి శలవిస్తాడు.

"ప్రభూ ఆ అయస్కాంతాలు ప్రపంచ ప్రభువులైన అమెరికా భస్మాసురల వద్దే లభ్యం. మనం అమెరికా తీర్థయాత్రలకు నేడే బయలుదేరుదాం" అంటూ బయలుదేరదీస్తాడు.

"వెళ్ళిపోతుండెల్లి పోతుండో
అప్పుచిప్ప చేతబట్టి
వెళ్ళిపోతుండమెరికాకు"

అలా మొదలయింది అప్పుల భారతం. అప్పు ఎవరూ ఎవరికీ పూరకే ఇవ్వరు. ఏదో కొంత లాభం ఆశిస్తారు. విదేశీ అప్పులకూ కూడా ఇది వర్తిస్తుంది. ఈ అప్పులు తీరేవి కావు దాని మీద అయ్యే వడ్డీ కోసం కూడా మళ్ళీ వాళ్ళ దగ్గరకే అప్పుకు పోవాలి.

ఈ దేశ రైతు తీర్చలేని అప్పుకు భూమిని కొల్పోతాడు. మరి దేశం ఏం పోగొట్టుకుంటుందో చూడండి. దేశ ప్రజలందరిని మభ్యపెట్టి నలభై ఏడు టన్నుల బంగారాన్ని ప్రపంచ బ్యాంకు ముందు పెట్టిందీ ప్రభుత్వం.

ఇంకనూ అప్పు కావలెనన్న మా ఐ.యం.ఎఫ్. షరతులు డంకెల్ కండిషన్లు ఒప్పుకోవాలి. అవి ఎలాంటివో తెలుసా?

రైతులకిచ్చే ఋణాల మీద, ఎరువుల మీద సబ్సిడీ ఎత్తివేయాలి. కిలో రెండురూపాయల బియ్యం పథకం రద్దు చెయ్యాలి. మీ దేశంలో పండే ఆహారధాన్యాలు, తయారయ్యే ముడి సరుకులు, పెంచే రొయ్యలు – చేపలు మా దేశానికి మేం చెప్పిన ధరలకే ఎగుమతి చెయ్యాలి.

మా ఈ దేశంలో తయారయ్యే యంత్రాలు, ఎలాక్ట్రానిక్ కంప్యూటర్లు అన్నీ మా ధరలకే మీరు దిగుమతి చేసుకోవాలి. అన్నిటికన్నా ముఖ్యం అన్ని రకాల విత్తనాల పేటెంట్ హక్కు మాదే. మీ రైతులు వారి విత్తనాలను ఇతరులకు అమ్మకూడదు. మా విత్తనాలతో పండే పంట మళ్ళీ విత్తనాలకు ఉపయోగపడవు.

ప్రభుత్వరంగ సంస్థల్లో లాభాలు వచ్చేవాటిని ప్రైవేటుపరం చెయ్యాలి. అదీ మావారికే అమ్మాలి.

చివరగా... రూపాయి విలువ తగ్గించాలి –

అన్ని షరతులకులోబడి అప్పు తెచ్చారు. ఆ అప్పులను ఎలా వాడాలో కూడ వాళ్ళే నిర్దేశిస్తారు. నిండని చెరువులకు బారెడు అప్పులు. కొరగాని చదువులకు కోరినంత అప్పు. నష్టాల కంపెనీలకు అప్పులు. దివాళా తీసే దొరబాబులకు ఉదారంగా అప్పు. అన్ని అప్పులూ దళారీల ద్వారానే ప్రపంచ బ్యాంక్ పంచేదంతా రాజకీయ దళారులు – కాంట్రాక్టర్లు చేతుల మీదుగా ప్రజలకు చేరేసరికి సామాన్యులకు రూపాయికి పదిపైసలు మాత్రమే అందుతుంది. కాగా ఈ అప్పుతీర్చే భారం మొత్తం సామాన్యుడి నెత్తిన పరోక్షంగా పడుతుంది.

ఇదేం విడ్డూరం అంటే –

ప్రజలు దేశం కోసం త్యాగం చెయ్యాలంటారు. గిట్టుబాటు ధరలు లేక చితికిపోతున్న బక్కరైతులు త్యాగం చెయ్యాలి. వెనకబడిన కులాలు, వర్గాలు నడ్డి విరుగుతున్నా త్యాగం చెయ్యాలి. మహిళలకు రక్షణ లేక పట్టపగలు మానభంగాలకు గురవుతున్నా – కిమ్మనకుండా త్యాగం చెయ్యాలి. అలా అంతా ప్రభువుల పల్లకి మోస్తూనే వుండాలి.

అదీ 'అప్పుల భారతం యక్షగాన నృత్యరూపకం సారాంశం. ఇంతటి సంక్లిష్ట సమస్యలతో వచ్చిన రాజకీయనాటకం మరొకటి లేదనే చెప్పాలి. బాగా పరిశీలిస్తే ప్రపంచీకరణకు డంకెల్ ప్రతిపాదనలకు తెరతీసింది పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఏలుతున్న (చేపట్టిన) రోజుల్లోనే ఈ నాటకానికి ప్రభువుల వారే నాయకుడు. మహామహా మేధావి మన్‌మోహన్ సింగ్‌ని ఆర్థికమంత్రిని చేసింది నరసింహారావుగారనే సంగతి మరువకూడదు. ఇద్దరూ ప్రపంచీకరణకు ద్వారాలు బార్లా తెరిచారు. దేశాన్ని, బంగారాన్ని సామ్రాజ్యవాదశక్తులకు తాకట్టు పెట్టిన తీరుకు నిరసనగా ఈ నాటకం 25 ఏళ్ళనాడే ప్రజల ముందుకు వచ్చింది. ఈ నాటకంలో మూడవదీ, ముగింపుదీ అయిన రంగం చివర, ప్రపంచీకరణ దుష్ఫలితాలను అనుభవిస్తున్న రైతాంగమూ, కార్మికులూ, దళితులూ, మహిళలూ, విద్యార్థులూ తమ సమస్యలపై ప్రభుతను నిగ్గదీస్తూ చివరికి సంఘటితంగా ఒకే లయబద్ధమైన నినాదాల పిడికిళ్ళే పాలకవర్గాలపై పోరాటం సల్పటంతో–ప్రజల విజయంతో ముగుస్తుంది. 1991(ప్రపంచీకరణ) నుండి 2004 వరకు ఈ నాటికను సుమారు 400 సార్లు ప్రదర్శించడం విశేషం. అన్ని ప్రదర్శనల్లోనూ దివికుమార్ ప్రభుతగా, ఉదయ్ సూత్రధారుని శిష్యునిగా ఇంకా వివిధ పాత్రల్లో అనూరాధ పాల్గొన్నారు.

ప్రపంచీకరణ విధానాలతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో వున్నారన్న వాస్తవాన్ని 20 సం॥లనాడే ప్రధాని పి.వి. గుర్తించాడు. 25–7–1995 నాటి 'ది హిందూ' పత్రిక ప్రకారం "పై పొరకి చెందిన 6 కోట్ల మందికి సంస్కరణల గురించి చెప్పనవసరంలేదు. రెండవ పొరకు చెందిన 25 నుండి 30 కోట్లమంది మధ్యతరగతి ప్రజలు సంస్కరణల గురించి అర్థంచేసుకోవటం ప్రారంభించారు. ఒక మూడవ పొరకు చెందిన 55 నుండి 65 కోట్ల మంది తక్కువ ఆదాయంగల పేద ప్రజలు ఆర్థికరంగంలో వచ్చే మార్పుల్ని అభినందించలేక పోతున్నారు" అన్నాడు.

అయినా సంక్షోభాల వెంట సంక్షోభాల్ని తట్టుకుంటూ ప్రపంచీకరణం దేశ ప్రజల మూలుగుల్ని పీల్చి పిప్పిచేస్తూనే వుంది.

**('ప్రజాసాహితి' 400 ప్రత్యేకసంచిక నుండి)** ●

# నవలా రచయిత చావా శివకోటి మరణం

**నవలా,** కథారచయిత చావా శివకోటి తన 82వ యేట 20–12–2022న ఖమ్మంలో మరణించారు. ఆయన 14–12–1940న జన్మించారు. వారి స్వగ్రామం ముదిగొండ మండలం గోకినేపల్లి.

ఆయన ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి బ్యాచ్ విద్యార్థి. దాశరథి రంగాచార్య సమకాలికుడు. డా॥ హరీశ్‌తో కలసి 'సాహితీ హారతి' సంస్థను ఖమ్మంలో నిర్వహించారు. గోపీచంద్ శతజయంతి సభలను నిర్వహించారు. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న వివక్షలను కొన్ని రచనలలో చిత్రించారు. 'అసురగణం' ఆయనకు పేరుతెచ్చిన నవల. మొత్తం 27 నవలలు, 120 కథలు ఆయన రాశారు.

'రచన' పత్రికవారి రావిశాస్త్రి విశిష్ట అవార్డు, గోపీచంద్ స్మారక అవార్డులు అందుకున్నారు. ●



కవిత

# 'మనుస్మృతి' దహనకర్తదే విజయం

- డాక్టర్ కత్తి పద్మారావు

**ప్రభువా!**
నా పాపాలను క్షమించు
నీవు ఉన్నావో లేవో
నాకు తెలియదు కానీ...
పోయిన క్రిస్మస్‌కి,
మళ్లీ ఈరోజు నీ పుట్టినరోజు
వచ్చేనాటికి
నా విస్మృతి పెరిగింది
ఈ దేశాన్ని నేను
ఎందరో కార్పొరేట్లకు
కుదువ పెట్టాను.
వారు నా కీర్తికి పతాకలెత్తారు
నన్ను అనేక వస్త్రధారణలతో
దృశ్యీకరించి
ప్రపంచానికి ఎత్తి చూపారు.
నేను మత వివక్షను,
కుల వివక్షను
విస్తృతంగా పాటించాను.
నాకు ఒక రంగు ఫాలోయింగ్
బాగా పెరుగుతుంది.
నేను వచ్చాక
అన్ని దేశాలకు మా యువత
వలస పక్షుల్లా ఎగిరిపోతున్నారు
ఆ విధంగా నేను
భరతభూమికి భారం తగ్గిస్తున్నాను
నేను విస్తృతంగా
రామమందిరాలు, గుడులు,
గోపురాలు, విగ్రహాలు
నిర్మిస్తూ వెళ్తున్నా
బాబాలు, స్వాములు, యోగులు
నా పాలనలో వర్ధిల్లుతున్నారు
యోగులు రాజ్యాధిపతులవుతున్నారు
ప్రజలు బిచ్చగాళ్ళు అవుతున్నారు
'అన్నమో రామచంద్ర' నా నినాదం
ప్రతి రాష్ట్రం నాకు రెండు ముక్కలాట.
కొత్త కొత్త విభేషణులను సృష్టిస్తున్నాను.
అనేక భాషావాదాలను
నాకు వచ్చిన భాషలోకే మలుస్తున్నాను
విశ్వవిద్యాలయాల అంతటా
ఇప్పుడు రామా, కృష్ణా
కథలే పాఠ్యాంశాలు
చరిత్ర అనేది ఒక అభూత కల్పన
ఇప్పుడు రామ కథల్లోనే
చరిత్రంతా ఉందని
తేల్చి చెప్పేసాను.
ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో
భజన మందిరాలు నిర్మిస్తున్నాము
వోడ్కా, గుట్కా, గంజాయిలతోపాటు
మతం మత్తుతో వారికి
ఇంద్రలోకాలు చూపిస్తున్నాము
ప్రభువా! మీరు శాంతంగా ప్రవహిస్తున్నారు
నేను శాంతానికి, సహనానికి వ్యతిరేకిని
నాకు జ్ఞానతత్త్వం లేదు
వివేచనకు నేను దూరం
హేతువు నా దగ్గరకు రాదు
నేను నిర్మించే భజన కేంద్రాలకు
అభ్యుదయవాదులు కూడా
వచ్చి కూర్చుంటున్నారు
వాళ్లకి తత్త్వంలేదని నాకు తెలుసు
ఈ భజన వినిపించినా
వాళ్లు ప్రేక్షకులే
అందుకే నేను విస్తృతంగా
మనుస్మృతి మందిరాలను
భాష పేరుతో, సంస్కృతి పేరుతో
దేశం పేరుతో, దేశీయత పేరుతో
నిర్మిస్తూ వెళుతున్నాను
ఆ చప్పట్లు కొట్టేవాడు
నాకు వ్యతిరేకే
ఇప్పుడు వాడు నా ప్రేక్షకుడు, నా శ్రోత
భగవద్గీత ఒక్కటే
భారతదేశ తత్త్వంగా
నేను ప్రకటిస్తున్నాను
అందుకే నాది శిష్ట భక్షణ
దుష్ట రక్షణ యుగం
నేను వచ్చాక ధరలు
ఆకాశమంత ఎత్తుకు ఎదిగాయి
ఇది కర్మభూమి
కష్టాన్ని భరించటం
ఆకలిని అనుభవించటం
మన కర్మవాదమని
నేను బోధిస్తున్నాను
నేను వచ్చాక ఎన్నో గొంతులు
మూగబోయాయి
నేను జ్ఞానాన్ని విస్తరించకుండా
శాసిస్తాను
నాకు రాగబంధం లేదు
నేను నేను కాదు
నేను మనువాదాన్ని
నేనొక కరవాలాన్ని
కానీ ప్రభువా!
నీతో నాకు పేచి లేదు
మనువే మా దిక్సూచి
అంబేద్కరుడు.. తగలబెట్టాడు
నేనింకా ఆ మంటల్లో
తగులబడుతున్నాననే
నా అభద్రత
'అహం బ్రహ్మాస్మి' అనే
నా పునరుద్ధరణవాదాన్ని
ఈ మనుస్మృతి దహనం అడ్డుకుంటుంది
వర్గం, కులం, ఆచారం,
సాంప్రదాయం, వివక్ష
అన్నీ ఒకపక్క తగలబడుతున్నాయి
మహాత్మా ఫూలే, అంబేద్కర్
పెరియార్ నా ప్రత్యర్థులు
వారి శక్తి అసామాన్యం
వారు నీలిజెండాగా ఎగురుతున్నారు
విశ్వవిద్యాలయాల గుండెల్లో
జ్ఞాన ప్రకంపనలు రేపుతున్నారు
వారంతా లిఖిత మేధావులు
వారిని చంపటం సాధ్యంకాదు
ఎందుకంటే నేను వాచకుడ్ని
నాకు రాత రాదు
భారతదేశంలో పూతలు అనేకం
నేను పోషిస్తున్న
పండితమన్యులు
ఎవరూ వారిని ఎదుర్కోలేకపోతున్నారు
వారి రాతలు సముద్ర ఘోషలు
వారి మాటలకు ప్రపంచమే పులకిస్తుంది
నేనూ అప్పుడప్పుడు
వారి పాదాలకు నమస్కరిస్తున్నాను
కానీ వారి మానవతా దర్శనం
నాకు అందడంలేదు
ఎందుకంటే అందులో
బుద్ధుని త్యాగం దాగి ఉంది
బుద్ధుడు రాజ్యాన్నీ వదిలాడు
నేను రాజ్యాన్ని కాంక్షిస్తున్నాను
ప్రభువా!
ఆ చూపుడువేలుకు నేను భయపడుతున్నాను
ఎందుకంటే నేను ఈ స్థానంలో
ఉండడానికి కూడా
నిర్నేత ఆయనే
నేను ఓడిపోతున్నానని
నాకు తెలుసు
అంతిమ విజయం
ఆ దహనకర్తదే

## చైతన్యవాహిని

**21-11-2022న** తమ 90 ఏళ్ళ వయస్సులో మరణించిన భద్రం ప్రజాసాహితికి ఆప్తులు, వారి మరణవార్త తెలిసినవెంటనే 22వ తేదీ ఉదయం జంటనగరాలశాఖ సభ్యులు వారి ఇంటి వద్దకు వెళ్ళారు. భద్రం జనసాహితికి చేసిన కృషిని గుర్తుచేసుకుని, అంతిమయాత్రలో పాల్గొన్నారు. 1-12-22న జరిగిన సంతాపసభలో జనసాహితి, స్త్రీ సంఘటన సభ్యులు జీవితం చివరికంటా వామపక్ష భావాలతో జీవించిన వారి కృషిని, వారి నిబద్ధతను, గుర్తుచేసుకుంటూ జోహార్లు తెలిపారు.

**30-11-2022, శ్రీకాకుళం :** గురజాడ 107వ వర్ధంతిని శ్రీకాకుళంలో జనసాహితి జిల్లా శాఖ నిర్వహించింది. ఈ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి పి. మోహనరావు సమన్వయం చేశారు. మొదటగా బి. రంగారావు గురజాడ దేశభక్తి గేయాలాపన చేశారు. నవయుగ వైతాళికుడు గురజాడ దార్శనికత, శాస్త్రీయ దృక్పథం, సామాజిక రుగ్మతలపై వారి పోరాటం, సాధించిన సత్ఫలితాలు, సాధించవలసిన బాధ్యతలు, పోరాటాల ఆవశ్యకత మొ, సామాజిక, సాహిత్య విషయాలపై చర్చ జరిగింది.

గతంలో జరిగిన మంచి కంటే జరగాల్సిన మంచి పట్ల మందగించకుండా కార్యసాధనలో ముందుకడుగేయవలసిన ఆవశ్యకత మరింత అవసరమని ఆ దిశగా సమైక్యంగా ఉద్యమ చైతన్య శక్తులుగా మనం తయారవ్వాలనీ, వక్తలు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో బి.రంగారావు, గోవిందరావు, చింతాడ తిరుమలరావు, శంకరరావు, రామ్మోహన్‌రావు, చావలి శ్రీనివాస్, నవీన్, ప్రసన్న పాల్గొన్నారు.

**28-12-2022న** కోల్‌కటా మినర్వా థియేటర్లో సౌవిక్ సాంస్కృతిక చక్ర బృందంవారు గౌతమ్ ముఖర్జీ ప్రధాన నటుడిగా గ్రీకు నాటక రచయిత సోఫోక్లీజ్ రాసిన 'ఓడిపస్' నాటకాన్ని బెంగాలీలో ప్రదర్శించారు. బాబు ముఖర్జీ నాటకీకరణ చేయగా విజయ్ ముఖర్జీ దర్శకత్వం వహించారు.

**29-12-2022న** వారాల కృష్ణమూర్తి సంతాపసభ మెదక్ జిల్లా బద్దారంలో ఆయన సమాధి వద్ద జరిగింది. ఈ సభలో జనసాహితి సభ్యులు, స్త్రీ సంఘటన సంపాదకులు ఎం. లక్ష్మీ, కవయిత్రి శీలా సుభద్రాదేవి హాజరై వారాల సాహిత్య కృషిని గుర్తుచేశారు. ఎం.లక్ష్మి మాట్లాడుతూ వారాలతో కలిసి జనసాహితి సభ్యులు, స్త్రీ విముక్తి సంఘటన సభ్యులు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాల వద్దకు వెళ్లినప్పటి అనుభవాలను వివరించారు. సుభద్రాదేవి మాట్లాడుతూ ఆయన రచనలన్నీ ప్రజాపక్షమేనన్నారు. ముఖ్యంగా ఆయన కథలలోని పాత్రలు వ్యక్తిత్వం కలిగివుంటాయని, అందుకు ఉదాహరణ 'యాది' కథలోని పాత్రలను ఉదహరించారు. వారాల తన నాటకానికి నంది అవార్డులు వచ్చినా వాటిని పెద్దగా ప్రచారం చేసుకోని హుందాతనం కలిగిన మంచి మనిషిగా పరిచయంచేశారు.

వారాలని గుర్తుంచుకోవడం అంటే ఆయన సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే మార్గమని, అదే ఆయనకు నివాళి అర్పించడం అవుతుందని చెపుతూ కుటుంబసభ్యులకు సానుభూతిని ప్రకటించారు. ●

## స్వాతంత్ర్య సమరయోధుడు, నాస్తికవాది రావూరి అర్జునరావు మరణం

**నాస్తికవాది,** సంఘసంస్కర్త రావూరి అర్జునరావు తన 105వ యేట హైదరాబాద్‌లో 25-12-2022న మరణించారు. ఆయన 17-2-1917 (1918)న కృష్ణాజిల్లా వానపాముల గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు.

8వ తరగతి వరకే చదువుతున్న అర్జునరావు 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆలీపూర్ క్యాంపు జైలులో రెండేళ్ళపాటు సేవాగ్రామం ఆశ్రమంలో వున్నారు.

ప్రముఖ నాస్తిక ప్రచారకుడు గోపరాజు రామచంద్రరావు పెద్దమ్మాయి మనోరమతో వారికి కులాంతర ప్రేమ వివాహం సేవాగ్రాంలో 1948 మార్చి 13న జరిగింది. ఠక్కర్‌బాబా అధ్యక్షతన ప్రభాకర్‌జీ వివాహాన్ని చేశారు. 1953లో స్వగ్రామం వానపాముల పచ్చి సంఘసంస్కరణ కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు. 1960లో గుడివాడకు చేరి అక్కడ హరిజన సేవాసంఘం, ఖాదీ బోర్డు కార్యక్రమాలు చేపట్టారు. అస్పృశ్యతా నివారణ ఒక ఉద్యమంగా నిర్వహించారు. 2018లో వానపాముల గ్రామంలో 'మార్పు' ట్రస్టు ఏర్పాటుచేసి సామాజిక సేవాకార్యక్రమాలు కొనసాగించారు.

వారి శరీరాన్ని విజయవాడలో వైద్య కళాశాలకు అప్పజెప్పారు. ●




**యూట్యూబ్‌లో 100 తెలుగు తేజాలు : రచన : కళాసాగర్, యల్లపు**

2005లో పుట్టిన యూట్యూబ్ ఛానల్ ఈనాడు అసంఖ్యాకంగా విస్తరించింది. ప్రతిభకు ప్రపంచ వేదిక 'యూట్యూబ్'. దీనికి ముందుమాట రాస్తూ యూట్యూబర్లు పాటించాల్సిన విలువలను నల్లమోతు శ్రీధర్ వివరించారు. 2020 నుండి కళాసాగర్ నిర్వహిస్తున్న 64 కళలు డాట్‌కామ్ పత్రికలో ధారావాహికంగా ప్రచురించిన ఈ వివరాలను ఇప్పుడు పుస్తకరూపంలో వెలువరించారు. ఆహారం-వంటలు; ఆరోగ్యం-వైద్యం; జర్నలిజం-వార్తలు; విద్య-అభ్యాసం; వ్యవసాయం; మిద్దెతోట పెంపకం; పర్యటన; సాంకేతిక విజ్ఞానం; వ్యక్తిత్వ వికాసం; వినోదం; విజ్ఞానం-విశేషాలు; కళలు-సంస్కృతి; సంగీతం-సాహిత్యం; ఆధ్యాత్మికం-భక్తి; మాటేమంత్రం; జీవన విధానం; ఉద్యోగాలు-ఉపాధి; ఫుడ్ రివ్యూ అనే శీర్షికల క్రింద తెలుగువారు నిర్వహిస్తున్న యూట్యూబ్‌ల వివరాలు దీనిలో పొందుపరిచారు. మనదేశంలో మొదటి 10 స్థానాల్లో వున్న యూట్యూబర్స్ గురించి రాశారు. వీరిలో తెలుగువారు ఒక్కరూ లేరు. ఈ వివరాలే గాక యూట్యూబ్ పుట్టుక గురించీ, కొత్త ఛానల్ ప్రారంభించే విధానం గురించీ, యూట్యూబ్ సృష్టికర్తలకు డబ్బులెలా వస్తాయి, యూట్యూబ్ అవార్డులు ఎవరికి వస్తాయి, యం.సి.ఎన్. అంటే ఏమిటి? అనే ఆసక్తిదాయకమైన విషయాలతో కూడిన వ్యాసాలున్నాయి.

1/8 డెమ్మీ పరిమాణంలో 96 పుటల ఈ పుస్తకం వెల : 145/- మొదటిముద్రణ : జనవరి 2022. ప్రతులకు : నవోదయ, హైదరాబాదు; అనేక, విజయవాడ. అమెజాన్.ఇన్. వివరాలకు : 98852 89995.

**జయము రైత - త్రిశతి : పద్యకవిత్వం.** రచయిత : **పొన్నాడ వరాహ నరసింహులు**

'జగతిపోషకుండవు నీవె జయము రైత' అనే మకుటంతో రైతు జీవితాన్ని, ఒడుదుడుకులను 306 తేటగీతి పద్యాలలో వర్ణించిన త్రిశతి ఇది. రచయిత విశ్రాంత ఉపాధ్యాయుడైనా వ్యవసాయం చేసినవారు. కనుక తన విద్వత్తును ఉపయోగించి రైతులపట్ల, సేద్యంపట్ల సానుభూతితో రాయడమేగాక, 'అణచివేతకు కర్షకులణగి పోరు / పోరుపొలమును విడిచియు పారిపోరు' అంటూ వారి పోరాట చైతన్యాన్ని చిత్రించారు. ఏడాదిపాటు ఢిల్లీ సరిహద్దులలో మోహరించి, మూడు రైతు వ్యతిరేక చట్టాల రద్దుకై విజయవంతంగా పోరాడిన పంజాబు, హరియానా మొదలగు రాష్ట్రాల రైతాంగం గురించి ప్రస్తావిస్తూ "సాగు చట్టముల్ మనకొద్దు సరసులార / రైతు పోరును గుర్తించి రయముగాను / రద్దుజేయుట కొఱకును రండి కదలి' అని పిలుపిచ్చారు.

ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన వరాహ నరసింహులు ఆమదాలవలసలో విశ్వసాహితి సంస్థకు అధ్యక్షులుగా ప్రతి రెండవ శనివారం సభలు, గోష్ఠులు నిర్వహిస్తున్నారు. ఇది వారి తృతీయ గ్రంథం. మొదటిది 'మా ఊరు మట్టి' వచన కవితా సంపుటి; రెండవది - 'తెలుగు ధీర - త్రిశతి'.

1/8 డెమ్మీ పరిమాణంలో 54 పుటల పుస్తకం వెల : రూ.100/- ప్రథమముద్రణ : అగస్టు 2022. విశ్వసాహితి ప్రచురణ సంఖ్య - 3. ప్రతులకు : కె. జనార్ధనరావు, కార్యదర్శి, విశ్వసాహితి, సాహితీనగర, బి.ఆర్.నగర్, ఆమదాలవలస - 532185. ఫోన్ : 94928 58623.

**భారత రాజ్యాంగము - కనీస అవగాహన : (ఈనాటి మనుధర్మశాస్త్రం)**

ఇది సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక వారి మూడవ ప్రచురణ. ఇప్పుడున్న రాజ్యాంగాన్ని రద్దుచేసి, మనుధర్మశాస్త్రాన్ని రాజ్యాంగంగా గుర్తించాలని మతవాదులు చేస్తున్న ప్రచారాన్ని ఎదుర్కోడానికి - ఈనాటి రాజ్యాంగాన్ని తేలికగా అర్థమయేట్లు ఈ పుస్తకంలో వివరించారు. ఈనాటి పరిస్థితుల్లో చాల అవసరమైన పుస్తకం.

1/8 డెమ్మీలో 168 పుటల పుస్తకం వెల : రూ.35/- తృతీయముద్రణ : నవంబరు 2018. ప్రతులకు : 10-18-7, వడ్డివారిలేన్, బ్రాహ్మణవీధి, విజయవాడ-520001. ఫోన్ : 98480 36063.

**నాస్తిక, హేతువాదులకు బైబిలును విమర్శించే హక్కు లేదా? : రచయిత : పెన్మత్స సుబ్బరాజు**

ఈ పుస్తక రచయిత ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ పూర్వ అధ్యక్షునిగా రాష్ట్రమంతా పరిచయమే. విసుగు పుట్టించకుండా గంటల కొలదీ ఉపన్యాసం ఇవ్వగల్గిన వక్త. సాధారణంగా నాస్తికులను హిందూ మతవాదులు ఒక ప్రశ్న వేస్తుంటారు. 'మీరు హిందూ మతాన్నే విమర్శిస్తున్నారు - క్రిస్టియన్, ఇస్లాం మతాలను విమర్శించాలంటే మీకు భయం. వారు మీపై దాడులు చేస్తారని' అని అంటుంటారు. అత్యధిక సంఖ్యలో వున్నవారు హిందూమతాన్ని పాటిస్తున్నారు కనుక ఎక్కువగా ఉపన్యాసాలు, పుస్తకాలు దానిమీదే వుంటాయి. బైబిల్‌పై, ఖురాన్‌పై కూడా వీరి సభల్లో ఉపన్యాసాలుంటాయి. వాటిని విమర్శించే పుస్తకాలు రాసినవారున్నారు.

ఈ పుస్తకం రాయాల్సి వచ్చిన పరిస్థితులను వివరిస్తూ రచయిత 37 పుటల ముందుమాట రాశారు. "సమాజంలో మౌఢ్యం పెరగడానికీ, శాస్త్రీయ ఆలోచనావైఖరి లోపించడానికీ కుల, మతాలే కారణమని; సామాజిక సంస్కరణలకు అవే ప్రధాన అడ్డంకులని భావించేవారిలో నేనొకడిని. అందుకే మత విమర్శ చేస్తున్నాను" అన్నారు. ఈ పుస్తకంలో ఫేస్‌బుక్‌లో తన వ్యాసాలపై జరిగిన చర్చ వాదోపవాదాలు 60 పుటల్లో ఇచ్చారు. మొత్తం పుస్తకం చదివితే రచయిత బైబిల్‌ను ఎంత లోతుగా చదివారో, బైబిల్‌పై ఇతర రచయితల వ్యాఖ్యానాలను, పుస్తకాలను ఎన్ని చదివారో అవగతమౌతుంది.

పుస్తకం చివరిపేజీలో బాక్స్ కట్టి ఇచ్చిన కొటేషన్ ఇలా వుంది. ఇది అన్ని మతగ్రంథాలకూ వర్తిస్తుంది.

**"బైబిలు మొదటిపేజీలో ప్రచురించాల్సిన ప్రకటన**

**ఇది కల్పిత రచన. ఇందలి విషయాలను సీరియస్‌గా తీసుకోవద్దు. ఈ రచనలను నమ్మేవారి మానసిక స్థితి పాడైతే, రచయితలు, ముద్రాపకులు బాధ్యత వహించరు! – మాక్సిమిలియానో గోంజాలెజ్"**

1/8 డెమ్మీలో 256 పుటలు. వెల : రూ. 250/– ప్రథమముద్రణ : ఆగస్టు 2022; ప్రతులకు : పి. సుబ్బరాజు, 1–122, చార్వాక భవనం, జిన్నూరు – 534265. పోడూరు మండలం. ప.గో.జిల్లా. ఫోన్ : 94911 84911. email : netradanam@gmail.com

**ఎ.పి.టి.ఎఫ్ ప్లాటినం జూబ్లీ మరియు రాష్ట్ర 19వ విద్యా వైజ్ఞానిక మహాసభల సావనీర్ :**

75 సంవత్సరాలుగా ఉపాధ్యాయరంగంలో పనిచేస్తూ, విద్యారంగ అభివృద్ధికి సూచనలిస్తూ, ఫ్యాప్టోను ఏర్పాటుచేసి, 'బాధ్యతకై నిలబడు – హక్కులకై కలబడు' నినాదంతో ముందుకు సాగుతున్న ఎ.పి.టి.ఎఫ్. 2022 ఏప్రిల్ 14–16లలో శ్రీకాకుళంలో జరుపుకున్న మహాసభల ప్రత్యేక సంచిక ఇది.

విద్యావిధానంపైనా, వివిధ సామాజిక సమస్యలపైన తోట జ్యోతిరాణి, నరసింహారెడ్డి, బుర్రా రమేశ్‌బాబు, కొత్తపల్లి రవిబాబు, దివికుమార్, చెరుకూరి సత్యనారాయణ, తులసినాథం నాయుడు, పి.యస్. నాగరాజు, యం.వి. కృష్ణయ్య, జయంతిప్రకాశ శర్మ, ఫెడరేషన్ సభ్యులు రాసిన వ్యాసాలు, కవితలు, కథలు వున్నాయి.

1/4 డెమ్మీ 132 పుటలు. వెల లేదు. ప్రథమముద్రణ : ఏప్రిల్ 2022.

**సమ్మెలు, అనుభవాలు, గుణపాఠాలు :** వ్యాస సంకలనం – సంకలకర్త : **నూతలపాటి పరమేశ్వరరావు**

1/8 డెమ్మీ 152 పుటలు. వెల : రూ. 100/– ప్రథమముద్రణ : ఏప్రిల్ 2022.

**ఉపాధ్యాయ ఉద్యమం – నిర్మాణం :** వ్యాస సంపుటి – రచన : **నూతలపాటి పరమేశ్వరరావు**

33 వ్యాసాలతోపాటు మరణించిన పరమేశ్వరరావుపై 34 పుటల అనుబంధంతో మొత్తం 248 పుటలు. వెల : రూ. 150/– ప్రథమముద్రణ : ఏప్రిల్ 2022.

**ఆరడుగుల నేల :** 2023కు స్వాగతం పలుకుతూ తిరుపతికి చెందిన మానవ వికాస వేదిక ప్రచురించిన 24 పుటల ఈ పుస్తకం చిన్నదే "అయినా చేతులు మారాల్సిన పుస్తకం" 24 పుటల ఈ చిన్న పుస్తకంలో మానవ వికాస వేదిక (తిరుపతి) నిర్వాహకులు పాఠకుల కోసం అజ్ఞాత అమెరికన్ రచయిత 'కొత్త నీలిగౌను' కథ, టాల్‌స్టాయ్ రాసిన సుప్రసిద్ధ కథ 'ఆరడుగుల నేల', బెర్ట్రాండ్ రస్సెల్ 'సృష్టి', ఆస్కార్‌వైల్డ్ 'ఆనందాల యువరాజు', చెహోవ్ రచన 'జీవితానందం' అందించారు. మురికిగా వుండే చిట్టి శుభ్రంగా మారి టీచరు ఇచ్చిన కొత్త నీలిగౌను చూసి, తల్లిదండ్రులు శుభ్రంగా మారడమేగాక వీధి వీధంతా పరిశుభ్రం కావడం మొదటి కథ సారాంశం. అత్యాశ పనికిరాదని చెప్పే టాల్‌స్టాయ్ కథ చాలమందికి సుపరిచితమే. రస్సెల్ అనంతమైన విశ్వంలో మానవుడి పాత్ర ఎంత అల్పమైనదో చెప్తాడు. ఇతరులకు ఇవ్వడంలో వున్న ఆనందం 'ది హాపీ ప్రిన్స్' కథ చెబుతుంది. ఆనందంగా ఎలా జీవించాలో, మన జీవన దృక్పథం సానుకూలమైన ఆలోచనలతో ఎలా వుండాలో చెహోవ్ చెబుతాడు.

విద్యార్థులలో పుస్తకం పఠనం ప్రోత్సహించడమేగాక ఉత్తమ విలువలను పెంపొందించే ఈ పుస్తకాన్ని విద్యార్థుల కోసం 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలతో ప్రచురించారు. వివరాలకు మానవ వికాస వేదిక, కన్వీనర్ల నుండి పొందవచ్చు. సాకం నాగరాజు 9440331016. శైలకుమార్ 7306588999.

**కన్యాశుల్కం నాటకం : (మేధావుల పరామర్శ). సేకరణ : సాకం నాగరాజ**

రచయిత నాయుని కృష్ణమూర్తి 71వ జయంతి కానుకగా అభినవ ప్రచురణలు, తిరుపతివారు 12 నవంబరు 2022లో దీనిని విడుదల చేశారు. నాయుని కృష్ణమూర్తి 12–11–1951లో జన్మించి 1–3–2018న తన 67వ యేట మరణించారు.

గురజాడపై వచ్చిన గ్రంథాలను, ప్రత్యేక సంచికలను పరిశీలించి, 47 మంది రచయితలు గురజాడ రచనలపై చేసిన విశ్లేషణలను సాకం నాగరాజ విశేషమైన శ్రమ చేసి ఒకచోట కూర్చి ప్రచురించారు.

దీనిలో గురజాడ మునిమనవడు వెంకటేశ్వరప్రసాద్ అర్ధాంగి ఇందిర. గురజాడ స్మారక భవనం ప్రక్కనున్న ఖాళీస్థలంలో ఒక ఆడిటోరియం నిర్మించాలనీ స్మారక భవనంలో గురజాడవారి సమకాలీన సాహిత్యకారుల చిత్రపటాలు, వారి సంక్షిప్త చరిత్రలతో ప్రదర్శించాలనీ, దానిని షేక్స్పియర్ స్మారక భవన స్థాయిలో రూపొందించాలనీ కోరుతూ, గురజాడ గురించిన విశేషాలు తెలియచేస్తూ రాసిన వ్యాసం మొదటిది. రెండవది గిడుగు వెంకట సీతాపతి రాసినది. మూడవది వారి నాన్నగారి గురించి గురజాడ రామదాసు రాసినది. సాధారణ పాఠకులకు అందుబాటులో లేని వీటిని అందించినందుకు నాగరాజు అభినందనీయుడు.

ఇవిగాక లబ్ధప్రతిష్ఠులైన తెలుగు రచయితలు 'కన్యాశుల్కం' నాటకంపై వెలిబుచ్చిన అభిప్రాయాలేగాక, రామినీడు, ప్రకాష్, కురుగంటి శ్రీలక్ష్మి, లక్ష్మణ చక్రవర్తి, వృద్ధుల కళ్యాణ రామారావు, టి.బి. కృష్ణారావు మొదలగువారి విశ్లేషణలు కూడా దీనిలో పొందుపరిచారు. 88వ పుటలో ప్రచురించిన గోపి రాసిన 'చెదిరిన గురజాడ' వ్యాసంలో గురజాడపై డాక్యుమెంటరీ తీసి, నంది అవార్డు గెలుచుకొని, రెండు లక్షల అప్పులు కాగా వాటిని తీర్చలేక నిప్పంటించుకున్న భార్యను రక్షించబోయి, గుంటూరుకి చెందిన కామిశెట్టి భుజంగరావు మరణించిన ఉదంతం తెలియచేశారు. వారి ముగ్గురు పిల్లలేమయ్యారో తెలియదు.

అలాగే గురజాడకు కావాల్సింది విగ్రహాలు కాదు. వారి స్వగృహాన్ని చక్కటి స్మారక చిహ్నంగా రూపొందించాలని సూచించారు.

(12 నవంబర్ 2022న ఆవిష్కరింపబడిన ఈ 116 పుటల పుస్తకం వెల : రూ. 100/– ప్రతులకు : అభినవ ప్రచురణలు. 6–1–70 వరదరాజనగర్, తిరుపతి–517507. ఫోన్ : 9440331016)

**(ఇంకా వున్నాయి)**

కవిత

# పద కామ్రేడ్ పద

- సాంబమూర్తి లండ

చాలా రోజులైంది
నా శవాన్ని పూడ్చేసిన తర్వాత
ఆ చాయలక్కూడా మళ్ళీ వెళ్ళలేదు
ఒకసారి చూసొద్దామా కామ్రేడ్
కనీసం నా సమాధి అక్కడ
ఏ వాసన వేస్తుందో తెలుసుకోవద్దూ

అడవిని విరగ్గొట్టాక
నదిని అమూలాగ్రం దున్నేసాక
శిశువు నోటికి
కొంచెం కొంచెం రక్తపు రుచిని పరిచయం చేసాక
కూలిపోయిన భవంతి కింద
ఇంకా ఎవరైనా బతికున్నారో లేదో

అనుకోగానే
రెక్కలు కట్టుకుని వాలదు అడవి
డొల్ల గుండెలతో
మసక చూపులతో ఎంత సేపు వెదికినా
కనబడదు సమాధి

అడవి ఒక అదృశ్యదీవి
మూలం దగ్గర తవ్వితే తప్ప దొరకదు
నాకు బాగా గుర్తు
నా సమాధి
ఒక పూలతోట మధ్యలో ఉంటుంది
నా వెన్నెముక మీద
ఒక కత్తి దిగబడిన గాయం వుంటుంది
నా శవం అని చెప్పేందుకు అదే ఆనవాలు

కళ్ళను అక్కడే విసిరేసి
నా తలను ఎవరో ఎత్తుకుపోయారు
బహుశా అది ఏ కండువా మెడలోనో
పులి గోరులా వేలాడుతూ వుంటుంది

చివరిసారి
నేను సంభాషించిన గాలిని
వచ్చేటప్పుడు కొంచెం వెంట తెచ్చుకోండి
అసలే ఈ నగరం వాకిళ్ళు
గుప్పెడు గాలికి వాచి వున్నాయి

ఇంకిపోవడానికి ముందే
నా రక్తంలో చేతులు ముంచి తీసుకురండి
ఈ ఎడారిలో
దేశానికి ఒక కటౌట్ పెడదాం

తేదీలు మనం రాసుకున్నవే
ఇంకా చరిత్ర కూడా..
ప్రస్తుతానికి ఒకట్రెండు పేజీలను
కొన్ని తేదీలనూ ఖాళీగా వుంచండి
అక్కడికి వెళ్ళి వచ్చాక
నన్ను ఉరితీసిన చెట్టునడిగి
నా మరణ ధ్రువపత్రాన్ని పూరించండి

పద కామ్రేడ్ పద
నన్ను చంపిన తుపాకీమీద
ఎవరి పేరు రాసుందో చూద్దాం
నా పేరు మీద ఏ బుర్రకథ నడుస్తుందో ఏమో.

దీర్ఘ కవిత

# రంగు వెలసిన చిత్రం


- శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

ఎక్కడ చూసినా గోడలే !
మనిషికీ మనిషికీ మధ్య
కులాలకీ మతాలకీ నడుమ
ఎక్కడికక్కడ నల్లతుమ్మ చెట్లలా
మొలుస్తున్న నిలువెత్తు గోడలు!
ఏ మానవతావాదో, సమతావాదో
అడ్డుగోడల్ని నేలమట్టం చేయబోతే
వారినే నిర్దాక్షిణ్యంగా పడగొట్టి
వారిపైనే సరికొత్త గోడ మొలిపించి
ఆ గోడలపైనే కాచుక్కూచున్న పిల్లులై
నలుదిక్కులా చూపులసెర్చ్ లైట్లు ప్రసరిస్తూ
గోడలపైనే పహారా కాస్తూ
ఏ నాయకుడో ఎరగా విదిలించే పదవికోసం
రెప్పవాల్చకుండా పరిశీలిస్తూ
అవసరం వస్తేనో అవకాశం చిక్కితేనో
పక్కవాడిపై దాడి చేసైనా హస్తగతం చేసుకోవాలని
అందుబాటులో ఉన్నవాడిని నిచ్చెన చేసుకుని
దూకాల్సిన శుభగడియ కోసం
నిరీక్షిస్తూ... నిరీక్షిస్తూ... నిరీక్షిస్తూనే
కళ్ళపై వాల్తున్న కునికిపాటుని విసిరికొడ్తూ
కాలాన్ని కరిగిస్తున్నారు ఛోటా మోటా లీడర్లు

(ఇంకా వుంది)


PRAJA SAAHITI January 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month







కార్టూనిస్ట్ కె.పి. శశి గీసిన చిత్రాలు




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI